



RNI TELTEL/2024/89620

తెలంగాణ

# నేటి శుభోదయ

ప్రతి క్షణం - ప్రజల కోసం

తెలుగు దినపత్రిక






ప్రచురణ : తెలంగాణ | సంపుటి 02 | సంచిక 352 | సంపాదకులు : గోంగూర శ్రీనివాసరావు | పేజీలు - 08 | బుధవారం 30 - సెప్టెంబర్ - 2026 | వెల రూ. 5 /-


## సైబర్ మోసాల్లో కొత్త కోణం..
# ఉన్నత విద్యావంతులే టార్గెట్..!

- సైబర్ మోసాల బారిన పడుతున్న ఉన్నత విద్యావంతులు
- బాధితుల్లో ఐటీ నిపుణులు, డాక్టర్లు, బ్యాంకు ఉద్యోగులు
- ఐఐటీ మద్రాస్ అధ్యయనంలో వెల్లడైన కీలక వాస్తవాలు
- మానసిక ఒత్తిడిలో ఉన్నవారినే లక్ష్యంగా చేసుకుంటున్న కేటుగాళ్లు



**నేటి శుభోదయ, హైదరాబాద్ :** సైబర్ ఆర్థిక మోసాల బారిన కేవలం నిరక్షరాస్యులు, అవగాహన లేని వారు మాత్రమే పడతారనే అపోహను ఐఐటీ మద్రాస్ తాజా అధ్యయనం పటాపంచలు చేసింది. ఉన్నత విద్యావంతులు, డిజిటల్ పరిజ్ఞానం కలిగిన ఉద్యోగులు సైతం పెద్ద సంఖ్యలో ఈ మోసాలకు గురవుతున్నారని ఈ పరిశోధన స్పష్టం చేసింది. కేవలం డిజిటల్ అక్షరాస్యత కలిగి ఉండటం ఒక్కటే సైబర్ నేరాల నుంచి పూర్తి రక్షణ కల్పించలేదని ఈ నివేదిక తేల్చి చెప్పింది. ఐఐటీ మద్రాస్‌కు చెందిన విశ్రాంత ఐపీఎస్ అధికారి, ప్రొఫెసర్ పి. కందస్వామి, ప్రొఫెసర్ నందన్ సుదర్శనం నేతృత్వంలో ఈ అధ్యయనం సాగింది. ఇందుకోసం చెన్నై, బెంగళూరు, హైదరాబాద్, ఢిల్లీ, ముంబై వంటి నగరాల్లోని బాధితులపై సర్వే నిర్వహించారు. బాధితుల్లో ఐటీ నిపుణులు, బ్యాంకు ఉద్యోగులు, వైద్యులు, ఆర్థిక రంగ నిపుణులు, ప్రభుత్వ అధికారులతో పాటు సైబర్ సెక్యూరిటీ ధ్రువీకరణ పత్రాలు కలిగిన వారు సైతం ఉండటం గమనార్హం. సైబర్ నేరగాళ్లు బాధితులను ఎంచుకోవడంలో ప్రత్యేక వ్యూహాలను అనుసరిస్తున్నారని ఈ నివేదిక వెల్లడించింది. ముఖ్యంగా కుటుంబంలో అనారోగ్య సమస్యలు, ఉద్యోగ వేట, పదవీ విరమణ, పని ఒత్తిడి వంటి కారణాలతో మానసిక ఆందోళనకు గురవుతున్న వారిని వీరు లక్ష్యంగా చేసుకుంటున్నారు. భయం, ఆత్మన్యూనత వంటి భావోద్వేగాలను ఆసరాగా చేసుకుని, వారిని మానసికంగా లొంగదీసుకుని మోసాలకు పాల్పడుతున్నారు. ఈ మోసాల కారణంగా బాధితులు కేవలం ఆర్థికంగానే కాక, తీవ్ర మానసిక క్షోభకు గురవుతున్నారు. అవమాన భారంతో కుంగిపోవడం, నిద్రలేమి, డిప్రెషన్, కుటుంబ సభ్యుల నమ్మకాన్ని కోల్పోవడం వంటి పరిణామాలు వారిని వేధిస్తున్నాయి. కొన్ని బ్యాంకులు, సైబర్ క్రైమ్ విభాగాలు సత్వరమే స్పందిస్తున్నప్పటికీ, మరికొన్ని విభాగాలు సాంకేతిక సామర్థ్యం లోపం కారణంగా వెనుకబడుతున్నాయని ఈ అధ్యయనం గుర్తించింది. ఈ నేపథ్యంలో, నివారణ వ్యూహాలను రూపొందించేటప్పుడు ఈ క్షేత్రస్థాయి వాస్తవాలను పరిగణనలోకి తీసుకోవాలని పరిశోధకులు సూచిస్తున్నారు.

## బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలపై దాడి వివాదం.. హైకోర్టు కీలక ఆదేశాలు

- బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలు అసభ్యంగా ప్రవర్తించారనడానికి ఆధారాల్లేవన్న హైకోర్టు
- బాధ్యులైన పోలీసులను గుర్తించాలని డీజీపీకి ఆదేశం
- పోలీసులపై చర్యలకు నివేదిక సిద్ధం చేయాలని సూచన
- నివేదికను స్పీకర్ ముందు ఉంచాలని ఆదేశం

**నేటి శుభోదయ, హైదరాబాద్ :** అసెంబ్లీ గేటు వద్ద బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పోలీసుల మధ్య జరిగిన ఘర్షణపై తెలంగాణ హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలు పోలీసులతో అసభ్యంగా ప్రవర్తించారన్న పోలీసుల వాదనకు ఆధారాలు లేవని స్పష్టం చేసింది. మహిళా ఎమ్మెల్యేల పట్ల దురుసుగా ప్రవర్తించిన పోలీసులను గుర్తించాలని డీజీపీ సీవీ ఆనంద్‌ను ఆదేశించింది. ఈ ఘటనకు బాధ్యులైన పోలీసు అధికారులను గుర్తించి, వారిపై చర్యలు తీసుకునేలా సమగ్ర నివేదిక సిద్ధం చేయాలని హైకోర్టు సూచించింది. ఆ నివేదికను అసెంబ్లీ స్పీకర్ ముందు ఉంచాలని డీజీపీకి ఆదేశాలు జారీ చేసింది. పోలీసులు స్పీకర్ ఆదేశాల మేరకే వ్యవహరించి ఉంటే.. వారిపై చర్యలు తీసుకునే అంశం స్పీకర్ పరిధిలోకి వస్తుందని ధర్మాసనం ...

2



## ఆసియా క్రీడల్లో నీరూ ధండా చారిత్రక స్వర్ణం..
## అభినందించిన ప్రధాని మోదీ

- ఆసియా క్రీడల ట్రాప్ షూటింగ్‌లో చరిత్ర సృష్టించిన నీరూ ధండా
- ఈ ఘనత సాధించిన తొలి భారత మహిళా షూటర్‌గా రికార్డు
- మహిళల ట్రాప్ టీమ్ ఈవెంట్‌లో భారత్‌కు రజత పతకం
- విజేతలను అభినందిస్తూ ప్రధాని నరేంద్ర మోదీ ట్వీట్



2

## బుల్లెట్ ట్రైన్ పేరుతో
## రియల్ ఎస్టేట్ దందా : కాంగ్రెస్‌పై కేటీఆర్ ఫైర్

- బుల్లెట్ ట్రైన్ భూసేకరణ పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తోందన్న కేటీఆర్
- బహదూర్‌పల్లి రైతుల వ్యవసాయ భూములను తీసుకోవడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు వెల్లడి
- శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ వద్ద ప్రభుత్వ భూమి ఉండగా రైతుల భూములు ఎందుకని ప్రశ్న



2

## దసరా వేళ పాలపిట్టలను బంధిస్తే కఠిన చర్యలు.. అటవీశాఖ హెచ్చరిక



2

## అధికారంలో లేకున్నా తగ్గని జోరు..
## బీఆర్ఎస్ పార్టీకి పెరిగిన విరాళాలు

- ప్రతిపక్షంలో ఉన్న బీఆర్ఎస్‌కు పెరిగిన విరాళాలు
- 2025-26 ఆర్థిక సంవత్సరంలో రూ.16.4 కోట్లుగా నమోదు
- గత ఏడాదితో పోలిస్తే పెరిగిన పార్టీ ఫండ్స్
- ఈసీకి సమర్పించిన నివేదికలో వెల్లడించిన బీఆర్ఎస్

2




## మేం ట్యాంపరింగ్ చేస్తే 400 సీట్లు వచ్చేవి
### - కాంగ్రెస్‌పై ఈటల ఫైర్

- ఓట్ల ట్యాంపరింగ్ ఆరోపణలపై కాంగ్రెస్‌కు బీజేపీ కౌంటర్
- రాహుల్ గాంధీని ప్రతిపక్ష నేత పదవి నుంచి తొలగించాలని డిమాండ్
- సోనియా గాంధీ ఓటుపై రాహుల్ సమాధానం చెప్పాలన్న అరవింద్

2



### అదుపుతప్పి మాట్లాడితే
## మహిళలతో కొట్టిస్తా
### : కొండా సురేఖ



- నోరు అదుపులో పెట్టుకోకపోతే మహిళలతో కొట్టిస్తానన్న కొండా సురేఖ
- వరంగల్‌లో ప్రతిపక్ష నేతలకు, పార్టీలోని కొందరికి హెచ్చరిక
- ప్రతిపక్ష నేతలు గాల్లో కత్తులు తిప్పుతున్నారంటూ వ్యాఖ్య
- కాంగ్రెస్‌లో వర్గ విభేదాలు పక్కనపెట్టాలని నేతలకు సూచన

2

## దేవుడి పేరుతో రాజకీయాలు వద్దు
### - మంత్రి పొన్నం ప్రభాకర్

- దేవుడి పేరుతో రాజకీయాలు చేయడం సరికాదన్న పొన్నం
- ప్రతి ఒక్కరి విశ్వాసాలను గౌరవించడం మన సంస్కృతి అని వ్యాఖ్య
- ఆలయాల అభివృద్ధి ప్రభుత్వ బాధ్యత అని స్పష్టీకరణ



**నేటి శుభోదయ, హైదరాబాద్ :** రాజకీయ ప్రయోజనాల కోసం దేవుడి పేరును వాడుకోవడం సరికాదని, అది ఎవరికీ మేలు చేయదని తెలంగాణ రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ప్రతి వ్యక్తికి తమ తమ దేవతలపై విశ్వాసం ఉంటుందని, ఇతరుల నమ్మకాలను గౌరవించడం భారతీయ సంస్కృతిలో భాగమని ఆయన పేర్కొన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో పలు కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారని పొన్నం ప్రభాకర్ తెలిపారు. రాష్ట్రంలోని దేవాలయాలను అభివృద్ధి చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని ఆయన స్పష్టం చేశారు. వేములవాడ రాజన్న, భద్రాద్రి రాముడు, కొండగట్టు ఆంజనేయ స్వామి సహా అన్ని ఆలయాల పట్ల తనకు గౌరవం, విశ్వాసం ఉన్నాయని చెప్పారు. వ్యక్తిగతంగా తనకు శివుడు ఆరాధ్య దైవమని ఆయన పేర్కొన్నారు. ప్రజల విశ్వాసాలను ప్రభుత్వం గౌరవిస్తుందని, రాష్ట్ర వ్యాప్తంగా ఆలయాల అభివృద్ధికి కట్టుబడి ఉందని అన్నారు.

## బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలపై దాడి వివాదం.. హైకోర్టు కీలక ఆదేశాలు

**మొదటిపేజీ తరువాయి..** స్పష్టం చేసింది. అసెంబ్లీ వ్యవహారాల్లో స్పీకర్‌కు ఉన్న అధికారాలను కూడా ఈ సందర్భంగా ప్రస్తావించింది. ఈ వ్యవహారంపై దాఖలైన పిటిషన్‌ను విచారించిన ధర్మాసనం గతంలో ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను తాజాగా సవరించింది. మహిళా ఎమ్మెల్యేల పట్ల పోలీసులు వ్యవహరించిన తీరుపై పూర్తి వివరాలను సేకరించాలని ఆదేశించింది. అసెంబ్లీ వర్షాకాల సమావేశాల సందర్భంగా గేటు వద్ద ఈ ఘర్షణ చోటుచేసుకున్న విషయం తెలిసిందే. పోలీసులు తమతో దురుసుగా ప్రవర్తించారని బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలు ఆరోపించారు. ఈ వ్యవహారం హైకోర్టుకు చేరింది. తాజాగా కోర్టు ఇచ్చిన ఆదేశాలతో ఈ అంశం మరోసారి రాజకీయంగా చర్చనీయాంశమైంది.

## అధికారంలో లేకున్నా తగ్గని జోరు.. బీఆర్ఎస్ పార్టీకి పెరిగిన విరాళాలు

**మొదటిపేజీ తరువాయి..** తెలంగాణలో అధికారం కోల్పోయి ప్రతిపక్ష పాత్ర పోషిస్తున్న బీఆర్ఎస్ పార్టీకి సంబంధించిన ఓ ఆసక్తికర విషయం వెలుగులోకి వచ్చింది. అధికారంలో లేనప్పటికీ పార్టీకి విరాళాలు తగ్గకపోగా, గతేడాది కంటే పెరగడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.2025-26 ఆర్థిక సంవత్సరానికి గానూ బీఆర్ఎస్ పార్టీకి రూ.16.4 కోట్ల విరాళాలు అందినట్లు ఎన్నికల కమిషన్‌కు సమర్పించిన తాజా నివేదికలో ఆ పార్టీ పేర్కొంది. అంతకుముందు ఆర్థిక సంవత్సరంలో (2024-25) పార్టీకి రూ.15.1 కోట్ల విరాళాలు అందాయి. ప్రతిపక్షంలోకి వచ్చాక కూడా పార్టీకి నిధుల ప్రవాహం పెరగడం గమనార్హం. సాధారణంగా అధికారంలో ఉన్న పార్టీలకే కార్పొరేట్ సంస్థలు, వ్యాపారవేత్తల నుంచి భారీగా విరాళాలు అందుతాయనేది రాజకీయాల్లో సహజంగా వినిపించే మాట. అయితే, తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలో ఉండగా, ప్రతిపక్షంలో ఉన్న బీఆర్ఎస్‌కు విరాళాలు పెరగడం ఈ వాదనకు భిన్నంగా ఉంది. ఇది పార్టీ ఆర్థికంగా ఇంకా బలంగానే ఉందని సూచిస్తోందని విశ్లేషకులు భావిస్తున్నారు. రాష్ట్రంలో 2028లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. అధికారాన్ని నిలబెట్టుకోవాలని కాంగ్రెస్, తిరిగి గద్దెనెక్కాలని బీఆర్ఎస్, తొలిసారి పాగా వేయాలని బీజేపీ తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయి. ఇలాంటి కీలక తరుణంలో బీఆర్ఎస్‌కు నిధులు పెరగడం పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపే అంశంగా మారింది.

## అదుపుతప్పి మాట్లాడితే మహిళలతో కొట్టిస్తా

### - కొండా సురేఖ

**మొదటిపేజీ తరువాయి..** మాజీ మంత్రి, ఎమ్మెల్యే కొండా సురేఖ తనదైన శైలిలో రాజకీయ ప్రత్యర్థులకు తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. మంగళవారం వరంగల్‌లో నిర్వహించిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ, నోరు అదుపులో పెట్టుకోకపోతే మహిళలతో దేహశుద్ధి చేయిస్తానని ఘాటుగా హెచ్చరించారు. కొంతమంది నేతల తీరుపై కొండా సురేఖ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. "ఇష్టానుసారం మాట్లాడితే మహిళలతో చిత్తుచిత్తుగా కొట్టిస్తాం. ఒక్కో మహిళ నలుగురిని కొడుతుంది, జాగ్రత్త. ప్రతిపక్ష నేతలు గాలిలో కత్తులు తిప్పుతున్నారు" అంటూ ఆమె ధ్వజమెత్తారు. కొందరు నేతలు తమ హద్దులు మీరుతున్నారని, అలాంటి వారిని ఎట్టిపరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. అదే సమయంలో పార్టీ అంతర్గత పరిణామాలపైనా ఆమె స్పందించారు. కాంగ్రెస్ నేతలంతా విభేదాలను పక్కన పెట్టి, పార్టీ బలోపేతం కోసం సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. నాయకులంతా ఐక్యంగా ఉంటేనే పార్టీ ప్రగతి పథంలో ముందుకు సాగుతుందని ఆమె సూచించారు.

## మేం ట్యాంపరింగ్ చేస్తే 400 సీట్లు వచ్చేవి : కాంగ్రెస్‌పై ఈటల ఫైర్

**మొదటిపేజీ తరువాయి..** ఓట్ల ట్యాంపరింగ్ విషయంలో కాంగ్రెస్ పార్టీ చేస్తున్న ఆరోపణలపై బీజేపీ ఎంపీలు ఈటల రాజేందర్, ధర్మపురి అర్వింద్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. తాము ఓట్లను ట్యాంపరింగ్ చేసి ఉంటే లోక్‌సభలో 400 సీట్లు గెలిచేవాళ్లమని, కేవలం 240 సీట్లతో ఎందుకు సరిపెట్టుకుంటామని ఈటల రాజేందర్ ప్రశ్నించారు. కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీని చూసి ప్రజలు ఛీ కొడుతున్నారని, భారత ప్రజాస్వామ్యాన్ని ఆయన నవ్వులపాలు చేస్తున్నారని మంగళవారం ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ విమర్శించారు. ఈవీఎంలను రాజీవ్ గాంధీ హయాంలోనే ప్రవేశపెట్టారని, వీవీప్యాట్‌లను మోదీ ప్రభుత్వం తీసుకొచ్చిందని ఈటల గుర్తుచేశారు. ఇదే అంశంపై ధర్మపురి అర్వింద్ మాట్లాడుతూ, రాహుల్ గాంధీ ఉన్నంతవరకు 'కాంగ్రెస్ ముక్త్ భారత్' సాధ్యమేనని ఎద్దేవా చేశారు. "పౌరసత్వానికి ముందే సోనియా గాంధీకి ఓటు ఎలా వచ్చిందో రాహుల్ చెప్పాలని" ఆయన డిమాండ్ చేశారు. ఎన్నికల్లో గెలవలేకే కాంగ్రెస్ పార్టీ లేనిపోని సమస్యలను సృష్టిస్తోందని అర్వింద్ ఆరోపించారు. దేశాన్ని, హిందువులను కించపరచడమే లక్ష్యంగా రాహుల్ పనిచేస్తున్నారని విమర్శించారు. రాహుల్ గాంధీని ప్రతిపక్ష నేత పదవి నుంచి వెంటనే తొలగించాలని ఆయన డిమాండ్ చేశారు.

## ఆసియా క్రీడల్లో నీరూ ధండా చారిత్రక స్వర్ణం.. అభినందించిన ప్రధాని మోదీ

**మొదటిపేజీ తరువాయి..** జపాన్‌లో జరుగుతున్న ఆసియా క్రీడలు 2026లో భారత షూటర్లు అద్భుత ప్రదర్శన చేశారు. మహిళల ట్రాప్ ఈవెంట్‌లో నీరూ ధండా చారిత్రక స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకుంది. ఆసియా క్రీడల చరిత్రలో ఈ విభాగంలో వ్యక్తిగత స్వర్ణం సాధించిన తొలి భారతీయ మహిళగా ఆమె రికార్డు సృష్టించింది. ఇదే ఈవెంట్‌లో మహిళల జట్టు రజత పతకాన్ని గెలుచుకుని భారత్ ఖాతాలో మరో పతకాన్ని చేర్చింది. ఈ చారిత్రక విజయాలపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హర్షం వ్యక్తం చేశారు. విజేతలను అభినందిస్తూ ఎక్స్ లో పోస్టులు పెట్టారు. "నీరూ ధండా భారత్‌కు చారిత్రక విజయాన్ని అందించింది. ఆసియా క్రీడల ట్రాప్ ఈవెంట్‌లో వ్యక్తిగత స్వర్ణం గెలిచిన తొలి భారత మహిళగా నిలిచిన ఆమెకు అభినందనలు. ఆమె అద్భుతమైన కచ్చితత్వం, నిలకడ దేశానికి గర్వకారణం. ఈ విజయం ఎందరో యువ క్రీడాకారులకు స్ఫూర్తినిస్తుంది" అని మోదీ పేర్కొన్నారు. అలాగే, టీమ్ ఈవెంట్‌లో రజతం గెలిచిన మనీషా, నీరూ, ఆషిమాలను కూడా ప్రధాని అభినందిస్తూ, వారి టీమ్‌వర్క్‌ను ప్రశంసించారు. మంగళవారం జరిగిన ఫైనల్‌లో నీరూ ధండా అత్యంత నిలకడైన ప్రదర్శన కనబరిచింది. మొత్తం 28 హిట్లు సాధించి అగ్రస్థానంలో నిలిచింది. చైనాకు చెందిన సన్ యునోంగ్ (26 హిట్లు) రజతం గెలుచుకోగా, కువైట్‌కు చెందిన హజర్ అబ్దుల్‌మాలిక్ (21 హిట్లు) కాంస్యంతో సరిపెట్టుకుంది. అంతకుముందు క్వాలిఫికేషన్ రౌండ్‌లోనూ 118 పాయింట్లతో నీరూ అగ్రస్థానంలో నిలవడం విశేషం. మరోవైపు, మహిళల ట్రాప్ టీమ్ ఈవెంట్‌లో నీరూ ధండా, ఆషిమా అహ్లావత్, మనీషా కీర్‌లతో కూడిన భారత బృందం రజత పతకాన్ని కైవసం చేసుకుంది. క్వాలిఫికేషన్ రౌండ్‌లో ఈ ముగ్గురూ సంయుక్తంగా 328 స్కోరు సాధించి రెండో స్థానంలో నిలిచారు. ఈ విభాగంలో చైనా (346) స్వర్ణం గెలుచుకోగా, కువైట్ (325) కాంస్య పతకం దక్కించుకుంది. అయితే, ఆషిమా, మనీషా వ్యక్తిగత ఫైనల్స్‌కు అర్హత సాధించలేకపోయారు.

## బుల్లెట్ ట్రైన్ పేరుతో రియల్ ఎస్టేట్ దందా

### - కాంగ్రెస్‌పై కేటీఆర్ ఫైర్

**మొదటిపేజీ తరువాయి..**
బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్టు పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం పెద్ద ఎత్తున రియల్ ఎస్టేట్ కుంభకోణానికి పాల్పడుతోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర ఆరోపణలు చేశారు. తమ పార్టీ అభివృద్ధికి గానీ, బుల్లెట్ ట్రైన్‌కు గానీ వ్యతిరేకం కాదని, కానీ దాని ముసుగులో రైతుల భూములను లాక్కోవాలని చూస్తే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. శంషాబాద్ విమానాశ్రయం వద్ద వేల ఎకరాల ప్రభుత్వ భూమి అందుబాటులో ఉండగా, తరతరాలుగా రైతులు సాగు చేసుకుంటున్న బహదూర్‌పల్లి వ్యవసాయ భూములను ఎందుకు సేకరిస్తున్నారని కేటీఆర్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఒక రైల్వే స్టేషన్ కోసం వెయ్యి ఎకరాలు అవసరమా? అని నిలదీశారు. రైతుల భూములపై సుమారు 4,000 మంది పోలీసులను మోహరించడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. "ప్రభుత్వం వద్ద సరైన పత్రాలు ఉంటే వాటిని రైతులకు చూపించాలి, అంతేకానీ పోలీసులను పెట్టి భయపెట్టడం ఎందుకు?" అని సీఎం రేవంత్ రెడ్డిని ఉద్దేశించి ప్రశ్నించారు. "ఏడాదిన్నరలో మీ ఆశీస్సులతో కేసీఆర్ తిరిగి అధికారంలోకి వస్తారు. మీ పట్టాలు మీకే ఇప్పిస్తాం. మీకోసం హైకోర్టుకు వెళ్లిన కార్తీక్ రెడ్డి ద్వారానే మీకు పట్టాలు అందేలా చూస్తాం," అని రైతులకు కేటీఆర్ భరోసా ఇచ్చారు. రైతులు అధైర్యపడొద్దని, ఐక్యంగా ఉండాలని సూచించారు. రైతులకు న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ పార్టీ రాజకీయంగా, న్యాయపరంగా అండగా నిలుస్తుందని ఆయన హామీ ఇచ్చారు.

## దసరా వేళ పాలపిట్టలను బంధిస్తే కఠిన చర్యలు..

### అటవీశాఖ హెచ్చరిక

**మొదటిపేజీ తరువాయి..**
దసరా పండుగ సందర్భంగా పాలపిట్టలను పట్టుకుని పంజరాల్లో బంధించడం, ప్రదర్శించడం వంటి చర్యలను ఉపేక్షించేది లేదని, ఇలాంటి పాల్పడితే కఠిన చర్యలు తప్పవని అటవీ దళాల అధిపతి (హెడ్ ఆఫ్ ఫారెస్ట్ ఫోర్స్) వినయ్ కుమార్ స్పష్టం చేశారు. ఈ మేరకు క్షేత్రస్థాయి అధికారులకు ఆయన కీలక ఆదేశాలు జారీ చేశారు. నిన్న హైదరాబాద్‌లోని అరణ్యభవన్‌లో అటవీ శాఖ అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో పాలపిట్టల సంరక్షణ, ప్రమాదకరమైన చైనా మాంజా నియంత్రణపై ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా వినయ్ కుమార్ మాట్లాడుతూ.. విజయదశమి రోజు పాలపిట్టను చూడటం శుభ సూచకంగా భావించే సంప్రదాయం ఉందని, అయితే కొందరు ఇదే అదనుగా వాటిని పట్టుకుని పంజరాల్లో బంధించి ప్రదర్శిస్తున్నారని అన్నారు. ఇలా చేయడం వల్ల పక్షులు తీవ్రమైన ఒత్తిడికి గురవుతాయని, ఆహారం తీసుకోక బలహీనపడి ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. గత ఏడాది దసరా సమయంలో బంధించిన 28 పాలపిట్టలను స్వాధీనం చేసుకుని తిరిగి విడిచిపెట్టిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. పాలపిట్టలను బంధించడం వన్యప్రాణి సంరక్షణ చట్టం ప్రకారం నేరమని స్పష్టం చేశారు.

**స్వేచ్ఛగా చూడటమే సంప్రదాయం**

విజయదశమి రోజు పాలపిట్టను చూడాలనే నమ్మకం తరతరాలుగా కొనసాగుతోందని, తెలంగాణ సంస్కృతిలో దీనికి ప్రత్యేక స్థానం ఉందని అధికారులు తెలిపారు. అయితే, ఆ సంప్రదాయం ప్రకారం పాలపిట్టను దాని సహజ ఆవాసంలో స్వేచ్ఛగా ఎగురుతుండగా చూడాలి తప్ప, పంజరంలో బంధించి చూడటం కాదని వారు స్పష్టం చేశారు. దసరా ఉత్సవాలు జరిగే ప్రదేశాలు, ముఖ్యంగా ఆలయాల వద్ద పాలపిట్టలను పంజరాల్లో ఉంచి ప్రదర్శించకుండా పర్యవేక్షించాలని దేవాదాయ శాఖ అధికారులకు అటవీశాఖ సూచించింది. ఎక్కడైనా ఇలాంటి ఘటనలు కనిపిస్తే వెంటనే తమకు సమాచారం అందించాలని ప్రజలను కోరారు.

**చైనా మాంజాపైనా ఉక్కుపాదం**

ఇదే సమావేశంలో సంక్రాంతి పండుగ నేపథ్యంలో వినియోగించే ప్రమాదకరమైన చైనా మాంజాపైనా అధికారులు చర్చించారు. గాజు పొడి పూసిన ఈ మాంజా వల్ల పక్షులు తీవ్రంగా గాయపడి మరణిస్తున్నాయని, కొన్నిసార్లు మనుషులకు కూడా ప్రాణాపాయం కలిగిస్తోందని వినయ్ కుమార్ పేర్కొన్నారు. రాష్ట్రంలో చైనా మాంజా అమ్మకాలు, నిల్వలు, వినియోగాన్ని పూర్తిగా నిరోధించేందుకు సంబంధిత శాఖలతో కలిసి సమన్వయంతో పనిచేయాలని ఆయన అధికారులను ఆదేశించారు.

## డేటింగ్ యాప్ మోసం: జూబ్లీహిల్స్ పబ్‌లో యువకుడికి రూ. 29,000 బిల్లు!

**డేటింగ్ యాప్‌లో పరిచయమైన యువతితో డేట్‌కు వెళ్లిన యువకుడు**

**జూబ్లీహిల్స్ పబ్‌లో రూ. 29,000 బిల్లు వేసి వసూలు**

**పబ్ యాజమాన్యంతో యువతి కుమ్మక్కైందని బాధితుడి ఆరోపణ**

**బాధితుడు హేమంత్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు**

**నేటి శుభోదయ, హైదరాబాద్ :** హైదరాబాద్‌లో ఆన్‌లైన్ డేటింగ్ యాప్‌ల ముసుగులో జరుగుతున్న మోసాలు మరోసారి వెలుగులోకి వచ్చాయి. డేటింగ్ యాప్ ద్వారా పరిచయమైన ఓ యువతితో కలిసి డేట్‌కు వెళ్లిన యువకుడు, ఏకంగా రూ. 29,000 బిల్లు చెల్లించాల్సి రావడంతో దిగ్భ్రాంతికి గురయ్యాడు. ఈ ఘటన నగరంలోని జూబ్లీహిల్స్‌లో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే, హేమంత్ అనే యువకుడికి 'క్వాక్-క్వాక్' అనే డేటింగ్ యాప్ ద్వారా దివ్య అనే యువతి పరిచయమైంది. వీరిద్దరూ జూబ్లీహిల్స్‌లోని '36 కెమిస్ట్రీ' పబ్‌లో కలుసుకున్నారు. అయితే, అక్కడ గడిపిన కొద్దిసేపటికే పబ్ యాజమాన్యం రూ. 29,000 బిల్లు వేసిందని హేమంత్ ఆరోపిస్తున్నాడు. ఇది పక్కా ప్రణాళికతో జరిగిన హనీట్రాప్ అని, సదరు



యువతి పబ్ యాజమాన్యంతో చేతులు కలిపి తనను మోసం చేసిందని హేమంత్ ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ ఘటనపై బాధితుడు వెంటనే జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. హేమంత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. దర్యాప్తు ప్రాథమిక దశలో ఉన్నందున పూర్తి వివరాలు వెల్లడించడానికి పోలీసులు నిరాకరించారు. ఈ ఉదంతంతో డేటింగ్ యాప్‌ల వినియోగదారుల్లో మరోసారి ఆందోళన వ్యక్తమవుతోంది.

# గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటర్ల నమోదుకు మాజీ ఎంపీ నామ శ్రీకారం

- **కుటుంబ సభ్యుల వివరాలు నమోదుతో గ్రాడ్యుయేట్ ఓటర్ ఎన్‌రోల్‌మెంట్ ప్రారంభించిన మాజీ ఎంపీ నామ**
- **గ్రాడ్యుయేట్ ఓటర్ల నమోదుపై నామ ప్రత్యేక దృష్టి : మాజీ ఎంపీ నామ**
- **అర్హులైన గ్రాడ్యుయేట్లందరూ ఓటర్లుగా నమోదు కావాలి : మాజీ ఎంపీ నామ**





**ఖమ్మం, సెప్టెంబర్ 29, నేటి శుభోదయ :** వరంగల్–ఖమ్మం–నల్గొండ నియోజకవర్గం గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానానికి సంబంధించి కొత్త ఓటర్ల నమోదు ప్రక్రియలో భాగంగా బీఆర్ఎస్ మాజీ లోక్‌సభా పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వర రావు ఓటర్ల నమోదు కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఖమ్మంలోని తన క్యాంప్ కార్యాలయంలో ముందుగా తన కుటుంబ సభ్యుల గ్రాడ్యుయేట్ వివరాలను నమోదు చేయించారు. నామ సతీమణి చిన్నమ్మ, కుమారులు పృథ్వీ తేజ, భవ్య తేజ ల తో పాటు కమ్మ రవి, కమ్మ జ్యోత్స్న, కిలారి ఉదయ్, రమ్యకృష్ణ, నామ సాయిరాం, కావ్య, రవీందర్, ప్రసన్న కుమారి తదితర 15 మంది కుటుంబ సభ్యుల వివరాలు నమోదు చేయించారు. అనంతరం పలువురు గ్రాడ్యుయేట్ల వివరాల నమోదుకు శ్రీకారం చుట్టారు. కార్యక్రమంలో భాగంగా సుమారు 30 మంది గ్రాడ్యుయేట్ల వివరాలను నమోదు చేయించారు. ఈ సందర్భంగా నామ మాట్లాడుతూ అర్హత కలిగిన ప్రతి గ్రాడ్యుయేట్ ఓటరుగా నమోదు చేసుకునేలా కృషి చేయాలని పార్టీ నాయకులు, కార్యకర్తలకు సూచించారు. ఓటరు నమోదు ప్రక్రియపై గ్రాడ్యుయేట్లకు అవగాహన కల్పిస్తూ, అవసరమైన సహకారం అందించాలని తెలిపారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటర్ల నమోదు కీలకమైనందున అర్హులైన పట్టభద్రులందరి వివరాలను సేకరించి నమోదు చేయించే దిశగా బీఆర్ఎస్ శ్రేణులు పనిచేయాలని నామ సూచించారు. ఖమ్మం నగరంతో పాటు ఉమ్మడి జిల్లాలోని వివిధ నియోజకవర్గాల్లో ఆయా ప్రాంతాల్లో ఉన్న గ్రాడ్యుయేట్లను సంప్రదించి, నమోదు ప్రక్రియను విస్తృతంగా చేపట్టాలని తెలిపారు. ఇటీవల పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కూడా గ్రాడ్యుయేట్ ఓటర్ల ఎన్‌రోల్‌మెంట్‌పై పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేసిన నేపథ్యంలో నామ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. గడువు లోపు గ్రాడ్యుయేట్ ఓటర్ల నమోదు ప్రక్రియను విస్తృతంగా చేపట్టి, అర్హులైన వారందరి వివరాలను నమోదు చేయించాలని నామ సూచించారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, సోషల్ మీడియా టీం ఈ ఎన్‌రోల్మెంట్ డ్రైవ్‌లో చురుగ్గా పాల్గొని, అర్హులైన ప్రతి గ్రాడ్యుయేట్‌తో దరఖాస్తు చేయించాలని నామ సూచించారు.

# ఖమ్మం అర్బన్ మండల కబడ్డీ, వాలీబాల్ విజేతలకు బహుమతి ప్రధానం



**ఖమ్మం, సెప్టెంబర్ 29, నేటి శుభోదయ :** న్యూ విజన్ పాఠశాల క్రీడా మైదానంలో ఖమ్మం అర్బన్ మండల్ నార్త్ లెవెల్ గేమ్స్ అండర్ 14 బాలుర కబడ్డీ విన్నర్ ఆఫ్ నిర్మల్ హృదయ్ స్కూల్, రన్నర్ ఆఫ్ పి ఎం సి, జెడ్ పి హెచ్ ఎస్ మల్లెమడుగు వాలీబాల్ రన్నర్ ఆఫ్ జిహెచ్ఎస్ ఇందిరానగర్ విన్నర్స్ బ్లూమింగ్ మైన్ సెంట్రల్ స్కూల్ విజేతలుగా నిలిచారని ఎస్ జి ఎఫ్ మండల కార్యదర్శి బియ్యని కృష్ణయ్య, కన్వీనర్ అబద్ అలీ ఒక ప్రకటనలో తెలియజేశారు. ఖమ్మం అర్బన్ మండలం నార్త్ కన్వీనర్ అబద్ అలీ మాట్లాడుతూ క్రీడల ద్వారా స్పోర్ట్స్‌మెన్ మానసిక శారీరక,ఆరోగ్యం, నాయకత్వ లక్షణాలు అభివృద్ధి చెందుతాయని ఇదే స్ఫూర్తిని ప్రదర్శించి జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలలో రాణించాలని ఆశీర్వదించారు . మండల కమిటీ సభ్యులు నాగుల్ మీర , రాము నాగ ప్రసాద్ , రోజ, సంపత్ కుమార్, విజయ కుమారి, మరియు ఆర్గనైజింగ్ పిడీలు సంపత్ కుమార్ ప్రసాద్, నాగేంద్ర, సతీష్, లక్పతి, వెంకటేశ్వర్లు వేణు, శంకర్ తులసి ప్రైవేట్ స్కూలు పిఈటి ,పి డి లు పూర్తి సహకారం అందించి టోర్నమెంట్ విజయం కావడానికి సహకారం అందించిన అందరికీ కృతజ్ఞతలు తెలియజేసిన సెక్రటరీ బి కృష్ణయ్య తెలియజేశారు.

# క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ చట్టం పకడ్బందీగా అమలు చేయాలి : అదనపు కలెక్టర్ శ్రీజ

- **పెండింగ్‌లో ఉన్న ఆసుపత్రుల పర్మినెంట్ రిజిస్ట్రేషన్, రెన్యువల్స్‌ను పూర్తి చేయాలి**
- **ఆసుపత్రుల్లో పార్కింగ్, ఇతర ప్రమాణాలపై ప్రత్యేక దృష్టి**
- **లోపాలున్న డయాగ్నస్టిక్ కేంద్రాలపై చట్టప్రకారం చర్యలు**





**ఖమ్మం, సెప్టెంబర్ 29, నేటి శుభోదయ :** క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ (రిజిస్ట్రేషన్ అండ్ రెగ్యులేషన్) చట్టం–2010ను జిల్లాలో సమర్థవంతంగా అమలు చేయడంతో పాటు, వైద్య సేవలందించే సంస్థలు నిర్దేశిత ప్రమాణాలను తప్పనిసరిగా పాటించేలా చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ లో క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ యాక్ట్–2010 క్రింద జిల్లా స్థాయి అప్రోప్రియేట్ అథారిటీ కమిటీ సమావేశం నిర్వహించారు. అదనపు కలెక్టర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ పారస్ కుమార్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. రామారావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లాలో క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ చట్టం అమలు, రిజిస్ట్రేషన్లు, రెన్యువల్స్, తనిఖీలు, ఆసుపత్రులు, క్లినిక్స్, డయాగ్నస్టిక్ కేంద్రాల స్థితిగతులపై కమిటీ సమీక్షించింది.

**పెండింగ్ రిజిస్ట్రేషన్లు, రెన్యువల్స్ పూర్తి చేయాలి**

జిల్లాలో పర్మినెంట్ రిజిస్ట్రేషన్, పర్మినెంట్ రిజిస్ట్రేషన్ రెన్యువల్‌కు సంబంధించిన పెండింగ్ దరఖాస్తులను పరిశీలించిన అదనపు కలెక్టర్, ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న ఆసుపత్రుల పర్మినెంట్ రిజిస్ట్రేషన్, రెన్యువల్ ప్రక్రియను వచ్చే నెలలోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. రిజిస్ట్రేషన్, రెన్యువల్ ప్రక్రియలో నిబంధనలు, కనీస ప్రమాణాలు, అవసరమైన అనుమతులను క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు.

**పార్కింగ్ విషయంలో ఆసుపత్రుల వర్గీకరణ**

ఆసుపత్రులకు అనుమతులు ఇచ్చే సమయంలో పార్కింగ్ సౌకర్యాన్ని పరిశీలించాలని అదనపు కలెక్టర్ స్పష్టం చేశారు. ఆసుపత్రుల్లో పార్కింగ్ సదుపాయంపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని ఆదేశించారు. అదే సమయంలో 10 పడకల లోపు ఉన్న నర్సింగ్ హోమ్‌ల విషయంలో పార్కింగ్ అంశాన్ని అనవసరంగా ప్రతిబంధకంగా మార్చకుండా, నిబంధనలకు అనుగుణంగా వాటిని వర్గీకరించి, అర్హత ఉన్న సంస్థలకు అనుమతులు మంజూరు చేయాలని సూచించారు.

**లోపాలున్న డయాగ్నస్టిక్ కేంద్రాలపై కఠిన చర్యలు**

జిల్లాలో ఇప్పటికే 16 డయాగ్నస్టిక్ కేంద్రాలను తనిఖీ చేయగా, పలు లోపాలు గుర్తించినట్లు అధికారులు కమిటీ దృష్టికి తీసుకువచ్చారు. ఈ నేపథ్యంలో ఆయా సంస్థలకు నోటీసులు జారీ చేసి, గుర్తించిన లోపాలను నిర్దేశిత గడువులోగా సరిదిద్దుకునేలా చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. లోపాలను సరిదిద్దని సంస్థలకు రిజిస్ట్రేషన్ ఇవ్వకూడదని, గడువు అనంతరం కూడా నిబంధనలు పాటించని సంస్థలపై క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ చట్టం ప్రకారం సంస్థలను సీజ్ చేసి చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు.

**రిజిస్ట్రేషన్ ప్రక్రియపై సమీక్ష**

2026 జూలై 27 నుంచి ఇప్పటి వరకు ప్రొవిజనల్ రిజిస్ట్రేషన్‌కు సంబంధించి 29 దరఖాస్తులు అందగా, 20 ప్రొవిజనల్ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లు జారీ చేసినట్లు, 9 దరఖాస్తులు ప్రక్రియలో ఉన్నట్లు సమావేశంలో తెలిపారు. పర్మినెంట్, రెన్యువల్ పర్మినెంట్ రిజిస్ట్రేషన్‌కు సంబంధించి 52 దరఖాస్తులు అందగా, 16 దరఖాస్తులు ప్రక్రియలో ఉన్నట్లు, 24 దరఖాస్తులను ట్రాఫిక్ క్లియరెన్స్ కోసం ఖమ్మం పోలీస్ కమిషనర్ కార్యాలయానికి పంపినట్లు వివరించారు. ట్రాఫిక్ అంశం కారణంగా 3 దరఖాస్తులకు సిఫార్సు చేయలేదని అధికారులు తెలిపారు.

**నిబంధనల ఉల్లంఘనలపై చర్యలు**

క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ చట్టం ప్రకారం వైద్య సంస్థలు రిజిస్ట్రేషన్, మౌళిక సదుపాయాలు, సిబ్బంది, పరికరాలు, రికార్డుల నిర్వహణ తదితర కనీస ప్రమాణాలను పాటించేలా నిరంతరం పర్యవేక్షించాలని అదనపు కలెక్టర్ సూచించారు. నిబంధనలను ఉల్లంఘించే సంస్థలకు ముందుగా నోటీసులు జారీ చేసి, నిర్దేశిత గడువులోగా లోపాలను సరిదిద్దుకునే అవకాశం కల్పించాలని, గడువు అనంతరం కూడా నిబంధనలు పాటించని సంస్థలపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలో క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ చట్టం అమలును మరింత పటిష్టం చేసి, ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందేలా చూడాలని అధికారులను ఆదేశించారు.ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రామారావు, డిసిహెచ్ఎస్ డాక్టర్ రాజశేఖర్, జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ నరేందర్, కమిటీ సభ్యులు, సంబంధిత వైద్య అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# 1న జాబ్ మేళా : జిల్లా ఉపాధి అధికారిణి మాధవి

**ఖమ్మం, సెప్టెంబర్ 28, నేటి శుభోదయ :** ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని నిరుద్యోగ యువతీ, యువకులకు ప్రైవేటు రంగంలో ఉద్యోగాలు కల్పించేందుకు అక్టోబర్ 1 న (గురువారం) జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారిణి ఎన్. మాధవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఉద్యోగ మేళా స్థానిక టీటీడీసీ (హవేలీ రెస్టారెంట్ ఎదురుగా) లో చేపడుతున్నట్లు అన్నారు. ఫ్లిప్కార్ట్ ప్రైవేటు లిమిటెడ్ సంస్థలో ఫీల్డ్ ఎగ్జిక్యూటివ్ అండ్ డెలివరీ ఎగ్జిక్యూటివ్ పోస్టుల భర్తీకి ఎంపికలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మొత్తం ఖాళీలు 20 వున్నట్లు, విద్యార్హత ఎస్సెస్సి (పదో తరగతి) ఉత్తీర్ణత లేదా ఆపైన ఉండాలని, వయస్సు 18 నుండి 40 సంవత్సరాల మధ్య ఉన్న పురుషులు/మహిళలు అర్హులని, జీతం నెలకు 17,000 రూపాయలు + ఇన్సెంటివ్‌లు ఇవ్వబడతాయని ఉపాధి అధికారిణి అన్నారు. అభ్యర్థులకు తప్పనిసరిగా ద్విచక్ర వాహనం (బైక్) ఉండాలని, ఖాళీలు ఖమ్మంలోనే ఉంటాయని, అర్హత, ఆసక్తి ఉన్న ఉమ్మడి ఖమ్మం జిల్లా నిరుద్యోగ యువతీ యువకులు తమ విద్యా అర్హతల సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలతో అక్టోబర్ 1 న (గురువారం) ఉదయం 10.00 గంటలకు టీటీడీసీ వద్ద జరిగే జాబ్ మేళాకు హాజరు కావాలని జిల్లా ఉపాధి అధికారిణి ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# నేటి నుంచి ఉమ్మడి ఖమ్మం జిల్లా అండర్ 14/17 బాల బాలికల లాన్ టెన్నిస్ ఎంపికలు

**ఖమ్మం, సెప్టెంబర్ 29, నేటి శుభోదయ :** ఈనెల 30వ తేదీన ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియం నందు ఉమ్మడి ఖమ్మం జిల్లా అండర్ 14 అండర్ 17 బాలబాలికల లాన్ టెన్నిస్ ఎంపికలు జరుగుతాయని ఉమ్మడి ఖమ్మం జిల్లా ఎస్జీఎఫ్ కార్యదర్శులు యాస రామారావు, బి బావ్ సింగ్ తెలియజేశారు.ఈ ఎంపికలకు ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని అర్హత కలిగినటువంటి బాలబాలికలు పాల్గొనవచ్చు. సెప్టెంబర్ 30వ తేదీన ఉదయం 9 గంటలకు స్థానిక ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియం లాన్ టెన్నిస్ కోర్టు నందు రిపోర్ట్ చేయగలరు. ఈ ఎంపికలకు వచ్చే క్రీడాకారులు అండర్ 14 విభాగంలో 01.01.2013 తర్వాత జన్మించి 6 నుంచి పై తరగతులు చదువుతున్నటువంటి క్రీడాకారులు అర్హులు. అండర్ 17 విభాగంలో 01.01.2010 తర్వాత జన్మించి 6వ తరగతి నుండి ఇంటర్మీడియట్ వరకు చదువుతున్నటువంటి క్రీడాకారులు అర్హులు. ఈ ఎంపికలకు వచ్చేటటువంటి క్రీడాకారులు ఒరిజినల్ స్టడీ సర్టిఫికెట్, ఎస్ జి ఎఫ్ ఎలిజిబిలిటీ ఫామ్, ఆధార్ కార్డ్ జిరాక్స్, పుట్టిన తేదీ ధ్రువపత్రం, ఇంటర్మీడియట్ విద్యార్థులు అయితే పదవ తరగతి మార్కుల మెమో, బోనిఫైడ్ సర్టిఫికెట్, ఆధార్ కార్డు జిరాక్స్ ,పుట్టినతేదీ ధ్రువపత్రంతో హాజరు కావాల్సి ఉంటుంది. మరిన్ని వివరాలకు కోచ్ కైలాస్ యాదవ్ 7979940287 ను సంప్రదించగలరు.

# లారీ ప్రమాదంలో గాయపడ్డ పోలీసు వాహన డ్రైవర్ రాకేష్ మృతి



**తిరుమలాయపాలెం, సెప్టెంబర్ 29, నేటి శుభోదయ :** వినాయక నిమజ్జన విధులు ముగించుకుని తిరిగి వస్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన పోలీసు వాహన డ్రైవర్ కొత్తపల్లి రాకేష్ (22) మంగళవారం మృతి చెందాడు. గత బుధవారం తెల్లవారుజామున ఒంటిగంట సమయంలో నిమజ్జన విధులు ముగించుకొని స్టేషన్కు వస్తున్న క్రమంలో ఎస్సై కూచిపూడి జగదీష్‌తో కలిసి పోలీసు వాహనం నడుపుతున్న రాకేష్ వరంగల్ సైడు వెల్తున్న లారీ ఢీకొట్టడంతో ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో ఎస్సై జగదీష్‌తో పాటు డ్రైవర్ రాకేష్ తీవ్రంగా గాయపడ్డారు. తలకు బలమైన గాయాలైనవి ఎస్,ఐ, రాకేష్‌ను తొలుత ఖమ్మంలోని స్తంభాద్రి ఆస్పత్రికి తరలించి, అనంతరం మెరుగైన వైద్యం కోసంరాకేష్ ను హైదరాబాద్ కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. రాకేష్ మృతితో కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు.

# అల్లె సాయి కిరణ్ సతీమణి రూపా దేవిని పరామర్శించిన డీసీసీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్



**ఖమ్మం, సెప్టెంబర్ 29, నేటి శుభోదయ :** ఖమ్మం నగరంలో గల 48వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ అల్లే సాయి కిరణ్ సతీమణి రూపాదేవి కుటుంబాన్ని ఖమ్మం డీసీసీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ పరామర్శించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను కలిసి వారి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వారికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ తరపున ఎల్లప్పుడూ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# తోక తలయ ఆడిస్తుంది

- ఆర్పీలపై చర్యలు తీసుకోవడానికి వెనుకాడుతున్న అధికారులు
- సమావేశంలో కనీసం అవగాహన కల్పించని అధికారులు
- అసలు ఏం జరుగుతుందని పేర్కొంటున్న మహిళా సంఘాల సభ్యులు

**ఖమ్మం, మధిర, సెప్టెంబర్ 18, నేటి శుభోదయ :** తోక తలై ఆడిస్తుందన్న విషయం నానుడి కాదు ఇక్కడ నిజమవుతుంది అదేంటంటే మున్సిపాలిటీలో మహిళా సంఘాల సభ్యులకు రుణాలు ఇప్పించడం ఏర్పాటు చేసిన ఎస్ఎల్ఎఫ్ లకు ఆర్పీలను ఏర్పాటు చేశారు. వారు పేద ప్రాంతాల్లో మహిళలను గుర్తించి వారిని పదిమందిని సభ్యులుగా చేసి వారికి రుణాలు ఇప్పించాలి. మధిర మున్సిపాలిటీలో 22 వార్డులు ఉండగా 28 మంది ఆర్పీలు, 162 గ్రూపులు ఉన్నాయి. వాటిల్లో ఇప్పటివరకు ఐదు కోట్ల రూపాయలు రుణాలు అందించారు. ఈ రుణాలు అందించే సమయంలో కొందరు ఆర్పీలు తమకు వాటాలు ఇవ్వాల్సిందేనని గట్టిగా డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయమై అనేకసార్లు అధికారుల దృష్టికి తీసుకువెళ్లిన కనీసం పట్టించుకోవటం లేదు మహిళా సంఘాల సమావేశాలు నిర్వహించిన సమయంలో అధికారులు వెళ్లి రుణాలు ఇప్పించిన సమయంలో ఎటువంటి డబ్బులు ఇవ్వాల్సిన పనిలేదని మహిళ మహిళా సంఘాల సభ్యులకు అవగాహన కల్పించాల్సిన అవసరం కానీ, వారు పట్టించుకోకపోవడంతో ఆర్పీలు తమ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఈ విషయంపై తోక తలయాడిస్తుంది అని నానుడి నిజం అవుతుంది అధికారులు మహిళా సంఘాల వ్యవహారంలో ఆర్పీల రుణాలు మంజూరు సమయంలో తీసుకుంటున్న డబ్బులు పై విచారణ నిర్వహించడానికి కూడా వెనకాడుతున్నారు అంటే పరిస్థితి ఏ విధంగా ఉందో అర్థమవుతుంది ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని మహిళా సంఘాల సభ్యులు కోరుతున్నారు.

# పేదలకు సీఎంఆర్ఎఫ్ కొండంత అండ

- ఖమ్మం 42వ డివిజన్‌లో చెక్కుల పంపిణీ



**ఖమ్మం, సెప్టెంబర్ 29, నేటి శుభోదయ :** నిరుపేదల ఆరోగ్య భద్రతకు ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) కొండంత అండగా నిలుస్తోందని మార్కెట్ కమిటీ చైర్మన్ యరగర్ల హనుమంతరావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఖాదర్ బాబా పేర్కొన్నారు. నగరంలోని 42వ డివిజన్‌లో మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను మంగళవారం లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆపద సమయంలో వైద్య ఖర్చుల నిమిత్తం ఆర్థిక ఇబ్బందులు పడుతున్న పేద కుటుంబాలను ఆదుకునేందుకు ప్రభుత్వం సీఎంఆర్ఎఫ్ ద్వారా భరోసా కల్పిస్తోందని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందేలా కృషి చేస్తున్నామని వివరించారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సహకారంతో పేద ప్రజలకు అండగా నిలిచేందుకు ఈ చెక్కులు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ మేయర్ నీరజ, మాజీ డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహార్, స్థానిక కార్పొరేటర్ పాకలపాటి విజయనిర్మల శేషగిరి, డివిజన్ అధ్యక్షులు గౌస్, షాదీఖానా డైరెక్టర్ సమద్ , స్థానిక నాయకులు రమా, షాహిన్, సమీనా, జానీ, షమీం, రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.

# రక్తదానం, ప్రాణదానం

- స్వచ్ఛంద రక్తదాన శిబిరంలో డీఎంహెచ్ఓ డాక్టర్ రామారావు పిలుపు



**ఖమ్మం, సెప్టెంబర్ 29, నేటి శుభోదయ :** ప్రమాదాలు, అత్యవసర శస్త్రచికిత్సలు, ప్రసవాలు మరియు తలసేమియా వంటి వ్యాధులతో పోరాడుతున్న రోగులకు రక్తం ఎంతో అవసరమని, ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారిని కాపాడేందుకు ఆరోగ్యవంతులైన యువత స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి (డీఎంహెచ్ఓ) డాక్టర్ రామారావు పిలుపునిచ్చారు.జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవం సందర్భంగా ఖమ్మం ప్రభుత్వ మెడికల్ కాలేజ్ ( జడ్ పి సెంటర్), ప్రభుత్వ ఎస్సార్ అండ్ బిజీ ఎన్ ఆర్ డిగ్రీ కళాశాలలో మంగళవారం ప్రత్యేక రక్తదాన శిబిరాలను నిర్వహించారు. ఈ శిబిరాలను డాక్టర్ రామారావు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తదానం, ప్రాణదానం, రక్తానికి ప్రత్యామ్నాయం మరొకటి లేదని, మనం ఇచ్చే ఒక్క యూనిట్ రక్తం ముగ్గురు వ్యక్తుల ప్రాణాలను కాపాడుతుందని వివరించారు. అపోహలు వీడండి: 18 నుంచి 65 ఏళ్ల మధ్య వయస్సు ఉండి, 45 కేజీల కంటే ఎక్కువ బరువు ఉన్న ఆరోగ్యవంతులైన స్త్రీ, పురుషులు ఎవరైనా ప్రతి 3-4 నెలలకోసారి నిరభ్యంతరంగా రక్తదానం చేయవచ్చని తెలిపారు. రక్తదానం చేయడం వల్ల శరీరంలో కొత్త రక్తం ఉత్పత్తి అయి ఆరోగ్యం మెరుగుపడుతుందే తప్ప ఎలాంటి బలహీనత రాదని స్పష్టం చేశారు. యువతదే కీలక పాత్ర: సమాజంలో రక్తదానంపై ఉన్న అపోహలను తొలగించి, గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ప్రజలకు అవగాహన కల్పించడంలో విద్యార్థులు, యువత ముందుండాలని సూచించారు.అనంతరం విద్యార్థులు, వైద్య సిబ్బందితో కలిసి రక్తదాన ఆవశ్యకతపై ప్రతిజ్ఞ చేయించారు. శిబిరంలో స్వచ్ఛందంగా రక్తదానం చేసిన పలువురు విద్యార్థులను, యువకులను అధికారులు అభినందించారు.ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నరేంద్ర, అడిషనల్ డీఎంహెచ్ఓ డాక్టర్ ఎల్. ప్రవీణ, ప్రభుత్వ మెడికల్ కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్ శంకర్, డిస్ట్రిక్ట్ ఎయిడ్స్ కంట్రోల్ యూనిట్ ప్రతినిధి నాగయ్య, కళాశాలల అధ్యాపక బృందం, వైద్యులు, పారామెడికల్ సిబ్బంది, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

# ఖమ్మం నగరంలో మాజీ ఎంపీ నామ పర్యటన

- పలు కుటుంబాలను పరామర్శించిన మాజీ ఎంపీ నామ





**ఖమ్మం, సెప్టెంబర్ 29, నేటి శుభోదయ :** ఖమ్మం నగరంలో మంగళవారం నాడు బీఆర్ఎస్ మాజీ లోక్‌సభా పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు పర్యటించారు ఈ పర్యటనలో భాగంగా మాజీ డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణంతో కలిసి పలు కుటుంబాలను ఆయన పరామర్శించారు. అందులో ముందుగా ఖమ్మం కార్పొరేషన్‌లోని నగర మినీ ట్రాలీ యూనియన్ అధ్యక్షుడు, సీనియర్ నాయకుడు నున్నా మాధవరావు మృతిచెందిన విషయం తెలుసుకుని ఆయన స్వగృహానికి వెళ్లి పార్థివ దేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. అక్కడ నుండి చర్చ్ కాంపౌండ్‌లో ఉన్న మున్నూరు కాపు సంఘం నాయకులు, ప్రముఖ పారిశ్రామికవేత్త పొదిలి రవికుమార్ నివాసానికి వెళ్లి ఇటీవల మృతి చెందిన వారి తండ్రి దేవేంద్రనాథ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు అనంతరం నేతాజీ నగర్ రోడ్ నంబర్ 4లో ఆర్టీసీ కండక్టర్ సామినేని లక్ష్మీనారాయణ మృతి చెందిన విషయం తెలుసుకుని ఆయన నివాసానికి చేరుకుని కుమారుడు ఉదయ్ కిరణ్‌తో పాటు కుటుంబ సభ్యులను ఓదార్చారు. తదుపరి కూసుమంచి మండలం గట్టు సింగారం గ్రామానికి చెందిన రిటైర్డ్ హెడ్‌మాస్టర్ వెల్లంపల్లి కిషన్‌రావు ఇటీవల మృతిచెందిన విషయం తెలుసుకుని ఆయన కుమారుడి స్వగృహానికి వెళ్లి కుటుంబ సభ్యులను కలిసి సానుభూతి తెలిపారు. అక్కడ నుండి బైపాస్ రోడ్, జర్నలిస్ట్ కాలనీ వాస్తవ్యులు సీనియర్ జర్నలిస్ట్ వడ్డే రామారావు తండ్రి, సీపీఐ (ఎంఎల్) నాయకుడు వడ్డే నాగయ్య ఇటీవల మృతి చెందగా ఆయన నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను కలిసి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఆ తర్వాత డోర్నకల్ మండలం ములకలపల్లి గ్రామానికి చెందిన ఇంజం భద్రమ్మ అనారోగ్య కారణాలతో మృతిచెందగా ఆమె కుమారుడు ధర్మరాజు గృహానికి వెళ్లి నామ కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమాల్లో మాజీ సుడా చైర్మన్ బచ్చు విజయ్ కుమార్, నాయకులు కనకమేడల సత్యనారాయణ, మోరంపూడి ప్రసాద్ రావు, గొడ్డేటి మాధవరావు, వాకదాని కోటేశ్వరరావు, తాత ప్రసాద్, చల్లగుండ్ల రఘు, హనుమంతరావు, కట్టా వెంకటేశ్వరరావు, బంధం నాగేశ్వరరావు, పొదిల రాజేష్, జీవీవీఎల్ నరసింహారావు, దొడ్డా రామారావు, తిరుమలశెట్టి జయప్రకాష్, సరిపూడి గోపి సందేశ్, రేగళ్ల కృష్ణ ప్రసాద్, పగడాల రవి, మహేష్, సరిపూడి వెంకటేశ్వర్లు, అప్పారావు, లగడపాటి నవీన్, హరికృష్ణ, నానబాల హరీష్ తదితరులు పాల్గొన్నారు.

# పాలస్తీనా, క్యూబా ప్రజల సార్వభౌమత్వ పోరాటాలకు సంఘీభావం తెలుపుదాం : విద్యావేత్త రవిమారుతి పిలుపు



**ఖమ్మం, సెప్టెంబర్ 29, నేటి శుభోదయ :** పాలస్తీనా క్యూబా ప్రజల పోరాటం అప్పులు స్వేచ్ఛ స్వయం నిర్ణయ అధికారం కోసం జరుగుతున్నదని, వారి పోరాటాలకు భారత ప్రజలు సంఘీభావం తెలపడం, మద్దతు ఇవ్వటం అవసరమైనదని విద్యావేత్త రవి మారుతి పిలుపు నిచ్చారు. మంగళవారం ఖమ్మంలో రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పార్టీ కేంద్ర కమిటీ పిలుపులో భాగంగా పాలస్తీనా,క్యూబా ప్రజల సార్వభౌమత్వ పోరాటాలకు సంఘీభావంగా సభను నిర్వహించడం జరిగింది. పార్టీ జిల్లా కార్యదర్శి సివై పులయ్య సభకు అధ్యక్షత వహించారు. భారత శ్రామిక ప్రజలు పాలస్తీనా క్యూబా లకు సంఘీభావం తెలపటం మన స్వాతంత్ర పోరాటంతో లోతుగా అనుసంధానమైన ఒక సూత్రాన్ని పునరుద్ఘాటించటం, మనకోసం మనం కోరుకున్న స్వేచ్ఛను, ఇతర ప్రాంతాల్లో స్వేచ్ఛ, సార్వభౌమత్వం కోసం పోరాడుతున్న ప్రజలకు మద్దతు ఇవ్వటం మన కర్తవ్యంగా భావించాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రజల స్వేచ్ఛ, గౌరవాన్ని బల ప్రయోగంతో చెరిపి వేయలేమని పాలస్తీనా విముక్తి పోరాటం మనకు గుర్తు చేస్తుందని, రోజువారి వార్తలలో కుటుంబాలు, పిల్లలు, కార్మికులు,యువత నిరాశ్రయత్వం, విధ్వంసం, తీవ్రమైన మానసిక బాధలను ఎదుర్కొంటున్న ప్రజలు కనిపిస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పాలస్తీనా ప్రజల స్వేచ్ఛ,గౌరవం, హక్కుల కోసం, స్వయం నిర్ణయం, అధికారం కోసం చేస్తున్న పోరాట ఆకాంక్షలకు మనం సంఘీభావం తెలపటం అవసరమని ఆయన అన్నారు. వలస ఆధిపత్యాన్ని భగత్ సింగ్ సవాల్ చేసినందువల్ల భారతదేశ స్వాతంత్ర్య పోరాటానికి మరింత విస్తృతమైన ప్రాధాన్యత లభించిందని, నేడు ఆధిపత్యం ఆక్రమణ బలవంతం భవ్య ఒత్తిడిని ఎదుర్కొంటున్న ప్రజలకు మనం చూపే సంఘీభావం, అంతర్జాతీయవాద స్ఫూర్తిని సజీవంగా ఉంచుతుందని ఆయన అన్నారు. టీపిటిఎఫ్ పూర్వ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి మనోహర్రాజు మాట్లాడుతూ నేడు భారతదేశంలో బిజెపి, ఆర్ఎస్ఎస్ ప్రభుత్వం కూడా అమెరికా సామ్రాజ్యవాద ఒత్తిడికి తలొగ్గి,వాణిజ్య ఒప్పందం చేసుకుని, మన వ్యవసాయ రంగానికి ఉరిత్రాలు బిగిస్తున్నదని ఆయన విమర్శించారు. రష్యా ఆయిల్ కొనవద్దనే ఆంక్షలకు తలొగ్గడం ద్వారా మన ఆయిల్ ఖర్చు పెరిగి, ప్రజలపై భారం పెరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. అదాని మీద మీద కేసు రద్దు కోసం తప్పించి,అమెరికా ఆంక్షలకు లొంగుతున్నదని,ఇరాన్ మీద దురాక్రమణ ను ఖండించలేదని, పాలస్తీనా నరమేధాని ఖండించలేదని, దురహంకారి,ఉన్మాది ఇజ్రాయిల్ను పితృదేశమని కితాబి చ్చి దాన్ని మృత్యు హేళను సమర్థించినట్లయినదని ఆయన విమర్శించారు. ఈ నేపథ్యంలో సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటమే భగత్ సింగ్ సందేశం, స్ఫూర్తి అని భారతదేశం నుంచి పాలస్తీనా, క్యూబా వరకు స్వేచ్ఛ కోసం జరిగే పోరాటం మనందరినీ కలుపుతుందని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ డివిజన్ కార్యదర్శి వర్గ సభ్యులు ఆవుల అశోక్, బందెల వెంకయ్య, జిల్లా నాయకులు ఎస్కే లాల్మియా, కే శ్రీనివాస్,సి హెచ్ శిరోమణి, టీ ఝాన్సీ, పి శోభ,తిమ్మిడి హనుమంతరావు,ఎన్ వి రాకేష్,రెంటాల యాదగిరి, సోమనపల్లి వెంకటేశ్వర్లు, గోగుల సోములు,పి వై ఎల్ జె భరత్, పి డి ఎస్ యు టీ లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# కృత్రిమ మేధ అవగాహన సదస్సు



**ఖమ్మం, సెప్టెంబర్ 29, నేటి శుభోదయ :** స్థానిక ఎస్ ఆర్ బి జిఎన్ఆర్ కళాశాల టీ ఎస్కేసిలో -కెరీర్ గైడెన్స్ ఆధ్వర్యంలో తెలంగాణ కళాశాల విద్య కమీషనరేట్ తో ఎంఓయు కుదుర్చుకున్న సంస్థ భారత్ కేర్స్ (సీఎస్ఆర్ బాక్స్ గ్రూప్) ప్రతినిధి నాగసాయి క్రృత్రిమమేదస్సు, సైబర్ సెక్యూరిటీ లపై అవగాహన సదస్సు ను మంగళవారం నిర్వహించారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మొహ్మద్ జాకిరుల్లా ఒక ప్రకటనలో తెలిపారు. రానున్న రోజుల్లో అనేక రంగాల్లో క్రృతిమ మేధ కీలకమైనదని విద్యార్థులు ఉపాధి అవకాశాల కోసం ప్రత్యేక అధ్యానంచేయాలని తెలిపారు. కార్యక్రమంలో టీ ఎస్ కేసి కోఆర్డినేటర్ డా.చందా సుధాకర్, కెరీర్ గైడెన్స్ సెల్ ఆఫీసర్ డాక్టర్ రాజశేఖర్, మెంటార్ వేలాద్రి, విద్యార్థులు పాల్గొన్నారు.

# గుండెను కాపాడుకుంటేనే ఆరోగ్యకరమైన జీవితం

- **ప్రపంచ హృదయ దినోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమం**





**ఖమ్మం, సెప్టెంబర్ 29, నేటి శుభోదయ :** ప్రపంచ హృదయ దినోత్సవాన్ని పురస్కరించుకొని గుండె ఆరోగ్యం, గుండె సంబంధిత వ్యాధుల నివారణ, అత్యవసర సమయాల్లో ప్రాణాలను కాపాడే చర్యలపై అవగాహన కార్యక్రమాన్ని ఖమ్మం డిస్ట్రిక్ట్ ఫారెస్ట్ ఆఫీస్‌లో నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ప్రోగ్రామ్ ఆఫీసర్ అరుణదేవి, డీ పీ హెచ్ ఎన్ ఓ శేషు పద్మ, ఫారెస్ట్ డివిజనల్ ఆఫీసర్, అర్బన్ తహసీల్దార్ రామకృష్ణ, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ దేవిశ్రీ, డి సి ఎం రఘురామ్ , హెచ్ ఈ ఓ బి వీరన్నతో పాటు ఫారెస్ట్, తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది, ఏ ఎం ఎం లు శారద, ప్రసన్న, , ఆశ లు రమాదేవి, వెంకటలక్ష్మి , లక్ష్మి ,స్వరూప, పాపమ్మ, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆరోగ్యకరమైన గుండె కోసం ప్రతిరోజూ పాటించాల్సిన జాగ్రత్తలను వైద్య సిబ్బంది వివరించారు. ప్రతిరోజూ కనీసం 30 నిమిషాలు నడక లేదా వ్యాయామం చేయాలని, ఉప్పు, చక్కెర, అధిక కొవ్వు పదార్థాల వినియోగాన్ని తగ్గించాలని సూచించారు. కూరగాయలు, పండ్లు, పప్పు ధాన్యాలు, సంపూర్ణ ధాన్యాలతో కూడిన సమతుల్య ఆహారం తీసుకోవాలని తెలిపారు.అలాగే పొగతాగడం, పొగాకు వినియోగానికి దూరంగా ఉండాలని, అధిక రక్తపోటు, మధుమేహం, అధిక కొలెస్ట్రాల్, అధిక బరువును నియంత్రణలో ఉంచుకోవాలని సూచించారు. ఒత్తిడిని తగ్గించుకోవడం, తగినంత నిద్ర పొందడం, క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడం ద్వారా గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గించుకోవచ్చని వివరించారు.గుండె అకస్మాత్తుగా ఆగిపోయిన సమయంలో సి పి అర్ ప్రాధాన్యతను వివరించారు. బాధితుడు స్పందించకపోతే వెంటనే అత్యవసర వైద్య సహాయం కోరడం, పరిస్థితిని గుర్తించడం, ఛాతీపై కంప్రెషన్లు ఎలా ఇవ్వాలనే అంశాలను ప్రాక్టికల్ డెమో చేసి చూపించారు.

# త్రివేణిలో వినూత్నంగా 'ప్రపంచ హృదయ దినోత్సవం

- **డాక్టర్ వి. సీతారాం చేతుల మీదుగా విద్యార్థులకు సి.పి.ఆర్ ప్రత్యక్ష ప్రదర్శనగుండె ఆరోగ్యంపై అవగాహన కల్పించిన ప్రముఖ కార్డియాలజిస్ట్**






**ఖమ్మం, సెప్టెంబర్ 29, నేటి శుభోదయ :** ప్రపంచ హృదయ దినోత్సవం సందర్భంగా ఖమ్మంలోని త్రివేణి పాఠశాలలో విద్యార్థులకు గుండె ఆరోగ్యంపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉస్మానియా, నిమ్స్ సంస్థలలో గోల్డ్ మెడల్స్ సాధించి, 'అబ్దుల్ కలాం అవార్డు' గ్రహీత, కర్నూలు ప్రభుత్వ వైద్య కళాశాల ప్రొఫెసర్ అయిన ప్రముఖ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్ డా. వి. సీతారాం ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా డా. వి. సీతారాం మాట్లాడుతూ విద్యార్థులు జంక్‌ఫుడ్‌కు దూరంగా ఉంటూ, పోషకాహారం తీసుకోవాలని సూచించారు. అర్ధరాత్రి వరకు ఫోన్లలో రీల్స్ చూడటం తగ్గించి, సరిపడా నిద్రపోవాలని, శబ్ద కాలుష్యానికి దూరంగా ఉండాలని తెలిపారు. అలాగే అత్యవసర సమయంలో ప్రాణాలు కాపాడే సి.పి.ఆర్. పద్ధతిని విద్యార్థులకు ప్రత్యక్షంగా చేసి చూపించారు.పాఠశాల డైరెక్టర్ డా. గొల్లపూడి వీరేంద్ర చౌదరి మాట్లాడుతూ విద్యార్థులు చిన్ననాటి నుంచే సరైన ఆహార నియమాలు, ఆరోగ్యకరమైన జీవనశైలి అలవాట్లను పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు.పాఠశాల ప్రిన్సిపాల్ రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ గుండె ఆరోగ్యంపై అవగాహన పెంపొందించడంలో ఇటువంటి కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు. ఈ రోజుల్లో మారుతున్న జీవనశైలి వల్ల గుండెపోటు ప్రమాదం పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. "అధిక మానసిక ఒత్తిడి ఫిజికల్ యాక్టివిటీ లేదా వ్యాయామం లేకపోవడం, జంక్ ఫుడ్ మరియు అధిక నూనె పదార్థాలు తినడం, వేళకు నిద్రపోకపోవడం, అనారోగ్యకరమైన అలవాట్లే గుండెపోటు రావడానికి ప్రధాన కారణాలు" అని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సి.ఆర్.ఓ కాట్రగడ్డ మురళి కృష్ణ, వైస్ ప్రిన్సిపల్స్ స్వప్న, ముస్తఫా, క్యాంపస్ ఇంచార్జ్ విక్టర్ చార్లెస్, ట్రాన్స్‌పోర్ట్ ఇంచార్జ్ సందీప్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# విజయవంతంగా రెండు నెలలు పూర్తి చేసుకున్న మధిర 'సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్

- **11 మండలాల్లోని 27,700 మంది విద్యార్థులకు రోజూ పోషకాహార అల్పాహారం**
- **సమతుల్య మెనూతో విద్యార్థుల్లో పెరుగుతున్న ఏకాగ్రత, హాజరు శాతం**









**ఖమ్మం, మధిర, సెప్టెంబర్ 29, నేటి శుభోదయ :** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'స్కూల్ బ్రేక్‌ఫాస్ట్' ప్రోగ్రామ్‌లో భాగంగా మధిరలో ఏర్పాటు చేసిన సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్ విజయవంతంగా రెండు నెలల రన్‌ను పూర్తి చేసుకుంది. 2026 జూలై 27న రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రారంభించిన ఈ బృహత్తర కార్యక్రమం, ఆయన నిరంతర పర్యవేక్షణ, మార్గదర్శకత్వంలో నిరంతరాయంగా కొనసాగుతోంది.ఈ కేంద్రీకృత వంటశాల ద్వారా మధిరతో పాటు సమీపంలోని 11 మండలాల్లో ఉన్న 575 ప్రభుత్వ పాఠశాలలు, 10 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదువుతున్న సుమారు 27,700 మంది విద్యార్థులకు రోజువారీగా రుచికరమైన, శుభ్రమైన పోషకాహారాన్ని అందిస్తున్నారు. ఈ కార్యక్రమానికి హరే కృష్ణ మూవ్‌మెంట్ చారిటబుల్ ఫౌండేషన్ ఇండియా అమలు భాగస్వామిగా వ్యవహరిస్తోంది.ఎన్ఐఎన్ ఆధ్వర్యంలో సమతుల్య మెనూ విద్యార్థుల శారీరక, మానసిక వికాసానికి అవసరమైన పోషకాలు అందించేలా నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్ నేతృత్వంలో ప్రత్యేక అల్పాహార పట్టికను రూపొందించారు. వారంలో ప్రతిరోజూ వైవిధ్యమైన ఆహారంతో పాటు రోజు విడిచి రోజు వేడి పాలను అందిస్తున్నారు.

--- వారపు అల్పాహార మెనూఒకటవ రోజు ఇడ్లీ – సాంబార్, రెండో రోజు పూరి – ఆలూ కుర్మా, మూడో రోజు దోశ – చట్నీ, నాల్గవ రోజు ఉప్మా – చట్నీ, ఐదో రోజు మిల్లెట్ ఇడ్లీ – సాంబార్, ఆరో రోజు బోండా – చట్నీ అందిస్తున్నారు.

--- అత్యాధునిక వంటశాల – వేగవంతమైన పంపిణీఅధిక సంఖ్యలో విద్యార్థులకు నిర్ణీత సమయానికి వేడివేడిగా అల్పాహారం అందించేందుకు ఈ కిచెన్‌లో ఆధునిక యంత్రాలను ఉపయోగిస్తున్నారు. గంటకు 5,400 ఇడ్లీలు, 3,600 పూరీలు, 2,000 దోశలు ఉత్పత్తి సామర్థ్యం కలిగిన అత్యాధునిక వంటశాల కలిగి, ఆధునిక పరిశుభ్రతా ప్రమాణాలు పాటిస్తూ తయారు చేసిన అల్పాహారాన్ని ప్రత్యేక వాహనాల ద్వారా సకాలంలో పాఠశాలలు, కళాశాలలకు చేరవేస్తున్నారు.

--- ప్రభుత్వ వ్యయం వివరాలువిద్యార్థుల స్థాయిని బట్టి ప్రభుత్వం అల్పాహారానికి అయ్యే వ్యయాన్ని భరిస్తోంది. ప్రాథమిక పాఠశాల (1–5 తరగతులు): రూ. 11.50 (ప్రతి విద్యార్థికి)ఉన్నత పాఠశాల (6–10 తరగతులు): రూ. 13.50 (ప్రతి విద్యార్థికి) జూనియర్ కళాశాల: రూ. 13.50 (ప్రతి విద్యార్థికి) పాలు (రోజు విడిచి రోజు): విద్యార్థికి రూ. 1.08 చొప్పున కేటాయింపు.

--- సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ కు హరే కృష్ణ మూవ్‌మెంట్ కృతజ్ఞతలుఉదయాన్నే పోషకాహారం అందడం వల్ల విద్యార్థులు ఖాళీ కడుపుతో తరగతుల్లో కూర్చోవాల్సిన అవసరం తప్పిందని, దీనివల్ల వారి ఏకాగ్రతతో పాటు పాఠశాలల్లో హాజరు శాతం మెరుగవుతోందని నిర్వాహకులు తెలిపారు. ఈ వంటశాల నిర్మాణానికి కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద ఆర్థిక సహాయం అందించిన సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ కు హరే కృష్ణ మూవ్‌మెంట్ చారిటబుల్ ఫౌండేషన్ ఇండియా ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేసింది.

# రక్తదానం ప్రాణదానం




**ఖమ్మం, సెప్టెంబర్ 29, నేటి శుభోదయ :** ఆపదలో ఉన్న వారికి మానవతా దృక్పథంతో రక్తం దానం చేయడం ప్రాణాన్ని నిలబెట్టినట్లేనని ఎస్ఆర్ బిజి ఎన్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మొహ్మద్ జాకీరుల్లా అన్నారు. మంగళవారం నాడు ప్రభుత్వ ఆసుపత్రి రక్తనిధి కేంద్రం కళాశాల ఎన్ ఎస్ ఎస్ ఎన్.సి.సి,ఐక్యూఏసి ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో 80 మంది విద్యార్థులు పాల్గొన్నారని తెలిపారు.కార్రక్రమంలో జిల్లా మెడికల్ హెల్త్ ఆఫీసర్ డా.రామారావు, అడిషనల్ డిఎమ్ హెచ్ ఓ డా.ప్రవీణ , మెడికల్ సూపరింటెండెంట్ డా.ఎం.నరేందర్, బ్లడ్ బ్యాంక్ ఇంచార్జ్ డా.టీ.శ్రీకాంత్ ఐ.క్యూఏసి కోఆర్డినేటర్ డా.సునంద, ఎగ్జామ్స్ కంట్రోలర్ డా.సత్యవతి, ఎన్.ఎస్.ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్స్ డా.ఎం.పిచ్చయ్య, డా.ధర్మయ్య,ఎన్.సి.సి ఆఫీసర్ డా.ఓంకార్ పాల్గొన్నారు.

# ఢిల్లీ గడ్డపై మరోసారి పామాయిల్ వాణిని గట్టిగా వినిపించిన మంత్రి తుమ్మల



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 29, నేటి శుభోదయ :** దేశ రాజధాని ఢిల్లీ గడ్డపై రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మరోసారి పామాయిల్ రైతుల తరుపున తన వాణి ని గట్టిగా వినిపించారు. మంగళవారం వివిధ రాష్ట్రాల వ్యవసాయ శాఖ మంత్రులు, వ్యవసాయ అధికారుల సమక్షంలో ఢిల్లీలో కేంద్ర ప్రభుత్వం ఖరీఫ్ సాగుపై సదస్సు నిర్వహించింది. ఈ సదస్సులో మంత్రి తుమ్మల మాట్లాడుతూ క్రూడ్ పామాయిల్ పై దిగుమతి సుఖాన్ని తగ్గించటం వల్ల దేశీయ పామాయిల్ రైతులు నష్టపోతున్నారని, మంత్రి తుమ్మల తన వాదనను గట్టిగా వినిపించారు. దిగుమతి సుంకాన్ని తగ్గిస్తూ తీసుకున్న నిర్ణయాన్ని పునరాలోచన చేసుకోవాలని మంత్రి తుమ్మల తెలిపారు. గత వారం రోజులు నుండి మంత్రి తుమ్మల దిగుమతి సుంకం పై కేంద్ర ప్రభుత్వానికి దక్షిణాది రాష్ట్రాల ముఖ్యమంత్రులకి లేఖల ద్వారా ఆయన వాణి ని గట్టిగా వినిపించారు.

# ఐ.సి.టి.సి. కౌన్సిలర్లకు సమీక్షా సమావేశం : జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. గణేశ్వర్





**మెదక్, సెప్టెంబర్ 29, నేటి శుభోదయ :** జిల్లాలో హెచ్.ఐ.వి. ఎయిడ్స్ విభాగంలో పనిచేస్తున్న డాప్కో,ఐ.సి.టి.సి. కౌన్సిలర్లకు సమీక్షా సమావేశం జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కార్యాలయంలో లెప్రసి, ఎయిడ్స్ ప్రోగ్రాం ఆఫీసర్ డా. హరిప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించగా స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటి డిప్యూటీ డైరెక్టర్ ప్రియదర్శిని,జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. గణేశ్వర్ పాల్గొన్నారు.జిల్లాలో హెచ్.ఐ.వి. వైరస్ లోడ్ ను తగ్గించాలని, ట్రీట్మెంట్ తీసుకుంటున్నావారిని రెగ్యులర్ గా ఫాలో అప్ చేయాలనీ, ప్రజల్లో ముఖ్యంగా విద్యార్థుల్లో హెచ్.ఐ.వి. పట్ల అవగాహన కల్పించాలని, హెచ్.ఐ.వి. పేషంట్లను మానవత దృక్పదంతో ఆదరించాలని, వారి జీవన ప్రమాణాలను పెంచాలని, వారిలో నిరాశ నిస్పృహలను దూరం చేయాలనీ, హెచ్.ఐ.వి. ఇన్ఫెక్షన్ లేని సమాజాన్ని నిర్మించాలని రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ డిప్యూటీ డైరెక్టర్ ప్రియదర్శిని తెలిపారు. జిల్లాలో హెచ్.ఐ.వి.ఎయిడ్స్ వ్యాప్తిని అదుపులో ఉంచామని, జిల్లా ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ద్వారా ప్రజల్లో నిరంతరం అవగాహన కల్పిస్తున్నామని, ప్రజల వద్దకే వెళ్లి హెచ్.ఐ.వి. స్క్రీనింగ్ చేపట్టాలని, ముఖ్యంగా విద్యార్థులు, యువకులను టార్గెట్ చేసి వారికి పూర్తి అవగాహన కల్పించాలని, హెచ్.ఐ.వి. ఇన్ఫెక్షన్ కు దూరంగా ఉంచాలని, యూత్ ను క్రీడలు, ఇతర నైపుణ్యాలలో ఇన్వాల్వ్ చేయాలనీ జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. గణేశ్వర్ తెలిపారు.కార్యక్రమంలో హెచ్.ఐ.వి.ఎయిడ్స్ ప్రోగ్రాం ఆఫీసర్ డా. హరిప్రసాద్, పి.ఎం.ఓ. శంకర్ రాతోడ్, మాస్ మీడియా ఆఫీసర్ అన్వర్, డాప్కో, ఐ.సి.టి.సి., కౌన్సిలర్లు పాల్గొన్నారు.

## ఖమ్మం–భద్రాచలం, ఖమ్మం–సత్తుపల్లి మార్గాల్లో డీలక్స్ బస్సు సర్వీస్లకు ఎక్స్‌ప్రెస్ ఛార్జీలు

**ఖమ్మం, సెప్టెంబర్ 18, నేటి శుభోదయ :** తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టిజిఎస్ ఆర్ టిసి) ప్రయాణికుల సౌకర్యార్థం ఖమ్మం–భద్రాచలం, ఖమ్మం–సత్తుపల్లి మార్గాల్లో నడిచే డీలక్స్ బస్సులకు ఎక్స్‌ప్రెస్ ఛార్జీలను ది.30.09.2026 నుండి అమలు చేస్తుంది. ఖమ్మం – భద్రాచలం డీలక్స్ బస్సులలో ఛార్జ్ రూ.180 /– ఉండగా ఇప్పుడు ఎక్స్ప్రెస్ చార్జ్ రూ.170 /– గా మార్చబడినది. ఖమ్మం – సత్తుపల్లి డీలక్స్ బస్సులలో ఛార్జ్ రూ. 130/– ఉండగా ఇప్పుడు రూ.120/– గా మార్చబడింది. ఈ డీలక్స్ రూట్ మొత్తం అన్ని స్టేజిలలో ఎక్స్‌ప్రెస్ చార్జీలు వర్తించును. ప్రయాణికులు ఈ మార్పును గమనించి, సంబంధిత డీలక్స్ బస్సు సేవలను వినియోగించుకోవాలని డిపో మేనేజర్ శివప్రసాద్ తెలిపారు.

## డీలక్స్ బస్సులకు ఎక్స్‌ప్రెస్ ఛార్జీలు : డిపామేజర్ జంగయ్య





**భద్రాచలం, సెప్టెంబర్ 29, నేటి శుభోదయ :** ప్రయాణికుల సౌకర్యార్థం ఖమ్మం–భద్రాచలం మార్గాల్లో నడిచే డీలక్స్ బస్సులకు ఎక్స్‌ప్రెస్ ఛార్జీలను మాత్రమే వసూలు చేయనున్నారు. ఈ నిర్ణయం బుధవారం నుండి అమలవుతుందని ఆర్ టి సీ భద్రాచలం డిపో మేనేజర్ పి. జంగయ్య తెలిపారు. ఖమ్మం – భద్రాచలం డీలక్స్ బస్సులలో ఛార్జ్ రూ. 180 /– ఉండగా, ఇప్పుడు రూ. 160 /– గా మార్చినట్లు తెలిపారు . ఈ రూట్ లో మొత్తం అన్ని స్టేజీ లలో డీలక్స్ బస్సులకు ఎక్స్ ప్రెస్ చార్జీలు వర్తించుననీ ఆయన చెప్పారు. ప్రయాణికులు ఈ మార్పును గమనించి, సంబంధిత డీలక్స్ బస్సు సేవలను వినియోగించుకోవాలని పి. జంగయ్య కోరారు.

## ఉపాధి హామీ, సదరమ్ విభాగాల్లో అక్రమాలపై చర్యలు తీసుకోవాలి

- జనగామ జిల్లా కలెక్టర్‌కు టీపీఆర్‌పీ అధ్యక్షుడు జిలుకర రవికుమార్ విజ్ఞప్తి



**జనగామ, సెప్టెంబర్ 29, నేటి శుభోదయ :** జనగామ జిల్లాలో ఉపాధి హామీ పథకం, సదరమ్ క్యాంపులు, పింఛన్ల మంజూరులో జరుగుతున్నట్లు ఆరోపణలు వస్తున్న అక్రమాలపై సమగ్ర విచారణ చేపట్టి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని తెలంగాణ ప్రజా రాజ్యం పార్టీ (టీపీఆర్‌పీ) వ్యవస్థాపక అధ్యక్షుడు జిలుకర రవికుమార్ జిల్లా కలెక్టర్‌ను కోరారు. ఉపాధి హామీ పథకంలో దీర్ఘకాలంగా ఒకే ప్రాంతంలో పనిచేస్తున్న సిబ్బందిని తక్షణమే బదిలీ చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. పదేళ్లకు పైగా ఒకే చోట సిబ్బంది|గ్రామీణాభివృద్ధి శాఖ పరిధిలోని పలు విభాగాల సిబ్బందికి బదిలీలు జరుగుతున్నప్పటికీ, ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న డీఆర్‌డీఏకు చెందిన మండల, జిల్లా స్థాయి సిబ్బందిలో కొందరు 10 నుంచి 15 ఏళ్లుగా ఒకే ప్రాంతంలో కొనసాగుతున్నారని రవికుమార్ ఆరోపించారు. మండల స్థాయిలో ఏపీఓలు, టెక్నికల్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లు దీర్ఘకాలంగా ఒకే చోట పనిచేయడం వల్ల పరిపాలనా సమస్యలు, అభివృద్ధి పనులకు ఆటంకాలు ఏర్పడుతున్నాయని పేర్కొన్నారు.దీర్ఘకాలంగా ఒకే చోట పనిచేస్తున్న సిబ్బందిపై సమీక్ష నిర్వహించి, అవసరమైన చోట ఇతర మండలాలకు బదిలీ చేయాలని ఆయన కోరారు. ప్రజలకు, ప్రజాప్రతినిధులకు ఇబ్బందులు కలగకుండా పారదర్శకంగా పరిపాలన సాగేందుకు జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. సదరమ్ సర్టిఫికెట్లు, పింఛన్లపై విచారణ చేయాలి.సదరమ్ క్యాంపుల్లో కొందరు అధికారులు, వైద్యులు కుమ్మక్కై అనర్హులకు సైతం అధిక శాతం వైకల్యం ఉన్నట్లు ధ్రువీకరణ పత్రాలు జారీ చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయని రవికుమార్ తెలిపారు. ఇలాంటి ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని కోరారు.అర్హులైన దివ్యాంగులు, వృద్ధులు, గీత కార్మికులు, ఒంటరి మహిళలకు అందాల్సిన సంక్షేమ ప్రయోజనాలు అనర్హులకు చేరకుండా కఠినమైన పరిశీలన చేపట్టాలని సూచించారు. ప్రతి గ్రామంలో పింఛన్ల లబ్ధిదారుల అర్హతను పరిశీలించి, అనర్హులుగా తేలిన వారి విషయంలో నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలనీ కోరారు. ఉపాధి హామీ పథకంలో నిర్వహిస్తున్న సామాజిక తనిఖీల తరహాలోనే పింఛన్లు, సదరమ్ ధ్రువీకరణ పత్రాలపై కూడా సామాజిక తనిఖీలు నిర్వహించాలని రవికుమార్ డిమాండ్ చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు నిజమైన అర్హులైన పేదలకు చేరేలా జిల్లా యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన కోరారు.

## అధికారం లో రైతు-కూలీల భాగస్వామ్యంనే మార్పుకుమూలం

- ఏఐకెయంయస్ జాతీయ మహాసభల్లో సామాజిక శాస్త్రవేత్త ప్రొ.మనోరంజన్ మహంతి పిలుపు





**ఖమ్మం, సెప్టెంబర్ 29, నేటి శుభోదయ :** అధికారంలో రైతు–కూలీల భాగస్వామ్యం పొందిన రోజే రైతు–కూలీల విముక్తికి అర్థం ఉంటుందని ,ఆదిశగా ఏఐకెయంయస్ తన వ్యూహాన్ని రూపొందించుకోవాలని డిల్లీ యూనివర్సిటీ ప్రొఫెసర్, సామాజిక శాస్త్రవేత్త ప్రొ.మనోరంజన్ మహంతి ఉద్బోధించారు.మంగళవారం స్థానిక వైరా రోడ్డులోని పియస్ఆర్ పంక్షన్ హాలు(అజ్మీర్ సింగ్ హాలు)లో అఖిల భారత కిసాన్ మజ్దూర్ సభ నాల్గవ జాతీయ మహాసభలలో ప్రారంభిస్తూ ఆయన ప్రారంభ ఉపన్యాసం చేశారు.దేశంలోఆహారంతోసహా అనేక ఉత్పత్తి ప్రదాతలైన రైతులు,కూలీలు, కార్మికుల అవసరాలు, హక్కుల పై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అశ్రద్ద చూపుతున్నాయని అన్నారు.వారిలో గ్రామీణ ప్రాంతాల్లో నివశిస్తున్న మెజారిటీ ప్రజలైన రైతు కూలీలు మరింత వివక్షత,అణచివేత కు గురి అవుతున్నారు.వారిలోదళితులు, గిరిజనులు,మహిళలు, పిల్లలు మరింత ఆకలి, పేదరికం,పోషకాహారం లోపం, సామాజిక అణచివేత, కనీస సౌకర్యాలు కొరతతో పేదరికం లో జీవిస్తున్నారని అన్నారు.కేవలం రైతు–కూలీల సమస్యలు,హక్కుల కోసమే కాకుండా అధికారాన్ని సాధించడమే అంతిమ పరిష్కారం అవుతుందని సూచించారు.అదికారం సాదించడం అంటే కేవలం నిర్ణయాలు తీసుకునే నిర్మాణాల్లో ప్రాతినిధ్యం మాత్రమేకాదు.ఉత్పాదక ఆస్తులు పొందకలిగి ఉండడం, సామాజిక, ఆర్థిక, రాజకీయ లక్ష్యాలను సాధించడానికి సంఘటిత మయ్యే సామర్థ్యం కలిగి ఉండాలని అన్నారు.ఆదివాసీ ప్రాంతంలో జల్,జంగీల్,జమీన్ హక్కులను కాపాడాలని అంటే గిరిజన ప్రాంతాల్లో కార్పోరేట్ దోపిడీ కి వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు.ప్రస్తుతం కేంద్రంలో ఉన్న నరేంద్ర మోడీ ప్రభుత్వం భూమి,నదులు,గనులు,అడవులు ఆత్మనిర్భర్ భారత్ పేరుతో కార్పోరేట్ శక్తులకు దారాదత్తం చేస్తుందని దుయ్యబట్టారు.రైతులు ప్రభుత్వాలు భావిస్తున్నట్లు లబ్దిదారులు కాదు హక్కు దారులని ఆయన అన్నారు.నరేంద్రమోడీ పాసీస్ట్ ప్రభుత్వం మెడలు వంచిన పంజాబ్ రైతు ఉద్యమం,కాక్రోచ్ యువత జంతర్ మంతర్ పోరాటంను ఆయన ప్రశంసించారు.వికశిత్ భారత్ వ్యతిరేకి భారత దేశం వ్యతిరేకి ఎంత మాత్రం కాదని అన్నారు.పాలకులు చెబుతున్నట్లు 7.8 శాతం పెరుగుదల రేటులో రైతుకూలీల స్థానం ఎక్కడని ప్రశ్నించారు.బిజెపి , ఆర్యస్యస్ వందేళ్ళు గా కల్చరల్ అంటే హిందూ భావజాలం వ్యాప్తి, సాంస్కృతిక మార్పు, సరస్వతి విద్యాలయాలు ద్వారా, ఆర్యస్యస్ శాఖల వ్యాప్తి ద్వారా అధికారం చేపట్టారని, స్థిరీకరణ ప్రయత్నం చేస్తున్నారని,ఆభావజాలాన్ని ఓడించాలంటే వివిధ వర్గాలుగా చీలి ఉన్న శ్రామిక వర్గాలు పునాది నుండి అబివృద్ధి , ఐక్యం కావాలని అన్నారు.ఏఐకెయంయస్ సాంప్రదాయిక సంస్థాగత రూపాలు,పోరాటాలతో పాటు శ్రామిక అధికారం కోసం మూడు కోణాల్లో పోరాడాలని పిలుపు నిచ్చారు.నాణ్యమైన విద్యా, వైద్యం,ఉపాధి, సుస్థిర అభివృద్ధి కోసం దిగువ స్థాయి పంచాయతీ రాజ్ సంస్థల నుండి అంచెలంచెలుగా అధికారం కోసం పోరాడాలని అన్నారు.కార్పోరేట్ సంస్థలు, సామ్రాజ్య వాదం తదితర శ్రేణులను ఎదిరించడానికి ప్రాధమిక స్థాయి నుండి అంత ర్జాతీయ స్థాయి వరకు కలిసివచ్చే స్వపక్షియ శక్తులతో ఐక్య కార్యాచరణ అవసరం అన్నారు.శ్రామిక ప్రజలు అనైక్యత ను పాలక పక్షం తమ ప్రయోజనాల కు వాడుకుంటుంది.సమానత్వం, న్యాయం, స్వేచ్ఛ,పరస్పరత,సుస్థిరత,సూత్రాలపై ఆదారపడిన సమాజం నిర్మాణం లక్ష్యంగా ఏఐకేయంయస్ తీర్మాణాలు ఉండాలని ఆశించారు.దేశవ్యాప్తంగా రైతు–కూలీలను ఐక్యపరచి నాయకత్వం వహించే దిశగా ఈ ఏఐకేయంయస్ మహాసభల నిర్ణయాలు ఉండాలని ఆకాంక్షించారు.సభకు ఏఐకెయంయస్ జాతీయ అధ్యక్షులు వేములపల్లి వెంకటరామయ్య అధ్యక్షత వహించారు.తొలుత ఆహ్వాన సంఘం అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ యంయఫ్ గోపినాథ్,టి.వేణు ప్రతినిధులకు ఆహ్వానం పలుకుతూ ప్రసంగించారు.దేశంలోని నలుమూలల నుంచి హాజరైన రైతుకూలీ సంఘాలు సభలో సంఘిబావ ప్రసంగాలు చేశారు.తమిళనాడుకు చెందిన పీజెంట్ లిబరేషన్ ఫ్రంట్ నేత సెల్వరాజ్ మాట్లాడుతూ మనందరి ఉమ్మడి శత్రువు అయిన కార్పోరేట్,సెప్రాన్ ఫాసిజం కు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఓరిస్సా గిరిజన రైతు సలహాదారు విజయ్ ఉపాధ్యాయ మాట్లాడుతూ కార్పోరేట్ శక్తులు గిరిజన పంచాయతీలకు ఉన్న పీసా చట్టాలను కూడా కాలరాచి దోపిడీ కి పాల్పడుతున్నాయని అన్నారు.ఉత్తరప్రదేశ్ కిసాన్ ఏక్తా రైతు నాయకుడు ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ దేశ సంపదను అదానీ,అంబానీ లాంటి కొందరు ఆశ్రిత పెట్టబడీ దారులను వ్యవసాయ రంగం పై దోపిడీ కి ఉసిగొల్పుతుందని అన్నారు.ఏఐకేయుయస్ నాయకుడు కెచ్చెల రంగయ్య, ఏఐకేయంయస్ జాతీయ ప్రధాన కార్యదర్శి అశీస్ మిట్టల్,ఉపాధ్యక్షులు నిర్భయ సింగ్,జెవి చలపతిరావు, కార్యదర్శి బాలచంద్ర షడంగి, సుశాంత్ ఝ, రవీంద్ర సింగ్ భాటియా, జితేంద్ర సింగ్,టీజర్, జలంధర్ సింగ్,శంభూప్రసాద్ సింగ్, సుధాకర్,వి.కోటేశ్వర రావు,చిట్టిపాటి వెంకటేశ్వర్లు,తేజ్ జీత్ చౌదరి,మామిడాల బిక్షపతి, దుర్గాప్రసాద్,గాదె దివాకర్,పిఓడ్యు జాతీయ సమన్వయ కర్త గాదె ఝాన్సీ,ఐయఫ్ టియు జాతీయ కార్యదర్శి టి.శ్రీనివాస్,పిడియస్యు జాతీయ సమన్వయ కర్త మహేష్ తదితరులు ప్రారంభ సభలో ప్రసంగించారు.ఏఐకెయంయస్ నాల్గవ జాతీయ మహాసభలు ప్రారంభ సూచికగా ఏఐకేయంయస్ జాతీయ పతాకాన్ని తొలుత ఆసంస్థ జాతీయ అధ్యక్షులు వేములపల్లి వెంకట్రామయ్య ఆవిష్కరణ చేశారు.మహాసభల ప్రారంభం కు ముందు వివిధ రాష్ట్రాల కళాకారులు తమ పాటలతో అలరించారు.ఓంగోలు అరుణోదయ కళాకారులు ప్రదర్శించిన ఆజాదీ నృత్యం సభికులను ఆకట్టుకుంది.మంగళవారం ఇక్కడ ప్రారంభం అయిన మహాసభల్లో దేశంలోని 16 రాష్ట్రల నుండి 450 మంది ఏఐకేయంయస్ ప్రతినిధులు పాల్గొంటున్నారు.వివిధ రాష్ట్రల రైతుకూలీ ఉద్యమాలు, ఏఐకేయంయస్ భవిష్యత్తు కార్యాచరణ పై ప్రతినిధులు రెండు రోజుల సమావేశాల్లో చర్చిస్తారు.

## ఎల్లలు దాటిన మానవత్వం, వైద్యానికి ప్రాంతం లేదు

- ఆపదలో ఆపద్బాంధవుడు, గాయపడిన యువకుడికి డాక్టర్రాజశేఖర్ గౌడ్ చేయూత
- రోడ్డుప్రమాదంలో తీవ్రంగా గాయపడిన యువకుడిని స్వయంగా ఆస్పత్రికి తరలించిన డీసీహెచ్ఎస్ డాక్టర్ రాజశేఖర్ గౌడ్




**ఖమ్మం, సెప్టెంబర్ 29, నేటి శుభోదయ :** విధి నిర్వహణ ముగించుకుని తిరిగి వెళ్తున్న ఖమ్మం డీసీహెచ్ఎస్ డాక్టర్ రాజశేఖర్ గౌడ్ రోడ్డుప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తిని చూసి మానవత్వంతో స్పందించిన ఘటన ఖమ్మం నగరంలో చోటుచేసుకుంది. కలెక్టరేట్ సమీపంలో జరిగిన ప్రమాదంలో మధ్యప్రదేశ్‌కు చెందిన అభిషేక్ అనే యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు.వాటర్ క్యాన్లతో వెళ్తున్న ఆటో ట్రాలీ ప్రమాదానికి గురికావడంతో అభిషేక్ రోడ్డుపై తీవ్ర గాయాలతో పడిపోయాడు. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు అక్కడ గుమిగూడారు. అదే సమయంలో కలెక్టరేట్‌లో విధులు ముగించుకుని తిరిగి వెళ్తున్న డీసీహెచ్ఎస్ డాక్టర్ రాజశేఖర్ గౌడ్ అక్కడి పరిస్థితిని గమనించారు. వెంటనే తన వాహనాన్ని ఆపి ప్రమాదానికి సంబంధించిన వివరాలను తెలుసుకున్నారు. అప్పటికే అటువైపు నుంచి 108 అంబులెన్స్ వెళ్లినప్పటికీ ప్రమాద బాధితుడిని తరలించకపోవడంతో, పరిస్థితిని గమనించిన డాక్టర్ రాజశేఖర్ గౌడ్ ఏమాత్రం ఆలస్యం చేయకుండా గాయపడిన అభిషేక్‌ను తన కారులో ఎక్కించుకుని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.ఆసుపత్రికి చేరుకున్న అనంతరం బాధితుడి పరిస్థితిని స్వయంగా పరిశీలించగా ఈ ప్రమాదంలో అభిషేక్ కుడీ తొడ భాగం విరిగినట్లుగా గుర్తించి అక్కడి వైద్యులతో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. అవసరమైన వైద్య సహాయం అందేలా చర్యలు తీసుకుని, బాధితుడి పరిస్థితిని పర్యవేక్షించారు.ఒక జిల్లా స్థాయి వైద్యాధికారిగా తన విధులకే పరిమితం కాకుండా, ఆపదలో ఉన్న ఓ అపరిచితుడిని సొంత మనిషిలా భావించి తక్షణమే స్పందించిన డాక్టర్ రాజశేఖర్ గౌడ్ తీరు పలువురి ప్రశంసలు అందుకుంది.పరిచయం లేదు. ప్రాంతం తెలియదు. అయినా ఆపదలో ఉన్న ప్రాణాన్ని కాపాడాలనే మానవత్వంతో ముందడుగు వేశారు. వైద్యుడిగా తన బాధ్యతను ఆస్పత్రి గోడలకే పరిమితం చేయకుండా, రోడ్డుపైనే ఆచరణలో చూపించిన డాక్టర్ రాజశేఖర్ గౌడ్ సేవాభావం అందరికీ ఆదర్శంగా నిలిచింది."వైద్యానికి ఎల్లలు లేవు, మానవత్వానికి హద్దులు లేవు" అన్న మాటకు డాక్టర్ రాజశేఖర్ గౌడ్ స్పందన ప్రత్యక్ష నిదర్శనంగా నిలిచింది.

# ఖరీఫ్ 2026 ధాన్యం కొనుగోళ్లలో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలి : అదనపు కలెక్టర్ శ్రీనివాస రెడ్డి

- కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే గోదాములకు తరలించాలి
- ప్రతి రవాణా వాహనానికి జీపీఎస్ ట్రాకర్ ఏర్పాటు
- 7 రకాల సన్నరకం ధాన్యానికే క్వింటాకు రూ.500 అదనపు ప్రోత్సాహకం
- మౌళిక వసతులు పూర్తిస్థాయిలో ఏర్పాటు చేసిన తర్వాతే కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలి
- వర్షం నుంచి ధాన్యాన్ని రక్షించుకునేందుకు టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలి
- ఖరీఫ్ 2026 ధాన్యం కొనుగోలు సన్నద్ధతపై అధికారులతో సమీక్షించిన అదనపు కలెక్టర్







**ఖమ్మం, సెప్టెంబర్ 29, నేటి శుభోదయ :** రీఫ్ (వర్షాకాలం) 2026 ధాన్యం కొనుగోళ్లలో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి అధికారులను ఆదేశించారు.మంగళవారం కలెక్టరేట్‌లో ఖరీఫ్ ధాన్యం కొనుగోలు సన్నద్ధతపై సంబంధిత అధికారులతో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి, లా అండ్ ఆర్డర్ అదనపు డీసీపీ ప్రసాదరావుతో కలిసి సమీక్షించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు, నాణ్యత, రవాణా, నిల్వ, మౌళిక వసతులు, రైతులకు కల్పించాల్సిన సౌకర్యాలపై అధికారులతో సమీక్షించారు.అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ గతానికి భిన్నంగా ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో ధాన్యం కొనుగోలు చేసిన అనంతరం కొనుగోలు కేంద్రాల నుంచి వ్యవసాయ మార్కెట్ యార్డుల్లోని గోదాములకు లేదా గుర్తించిన ఫంక్షన్ హాళ్లకు, రైస్ మిల్లుల్లోని ఖాళీ ప్రదేశాలకు ధాన్యాన్ని తరలించాల్సి ఉంటుందని తెలిపారు. కొనుగోలు చేసిన ధాన్యం ముందుగా ప్రభుత్వ నియంత్రణలో ఉంటుందని పేర్కొన్నారు.బ్యాంకు గ్యారంటీలు చెల్లించి, గతంలో పెండింగ్‌లో ఉన్న సీఎంఆర్ బియ్యం డెలివరీని పూర్తిచేసిన రైస్ మిల్లులకే భవిష్యత్తులో ధాన్యం కేటాయింపులు చేయడం జరుగుతుందని తెలిపారు.రైస్ మిల్లర్ల పాత్ర లేకుండానే ముందుగా ధాన్యం కొనుగోలు చేస్తున్నందున, ధాన్యం నాణ్యతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులను ఆదేశించారు.ఒక రోజులో కొనుగోలు కేంద్రం నుంచి ఎన్ని బస్తాలను రవాణా చేయగలుగుతారో అంత పరిమాణంలోనే ధాన్యాన్ని తూకం వేయాలని సూచించారు. రైస్ మిల్లుల మాదిరి గానే ధాన్యం నిల్వ చేసే గోదాముల వద్ద కూడా వేయింగ్ యంత్రాలను ఏర్పాటు చేసి, బరువు పరిశీలించిన అనంతరం ధాన్యాన్ని దించుకోవాలని తెలిపారు.ప్రతి లారీ, ట్రాక్టర్ తదితర ధాన్యం రవాణా వాహనాలకు జీపీఎస్ ట్రాకర్ తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని, ప్రత్యేక యాప్ ద్వారా అన్ని వాహనాల రవాణాను పర్యవేక్షించేలా చర్యలు తీసుకోనున్నట్లు అదనపు కలెక్టర్ తెలిపారు.తాధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.అనుమతులు ఎంత?.. నిర్మాణం ఎంత?నిబంధనలు పాటిస్తున్నారా?.. ఉల్లంఘిస్తున్నారా?ఫిర్యాదులపై ఇప్పటివరకు తీసుకున్న చర్యలేమిటి?అనే అంశాలపై సమగ్ర క్షేత్రస్థాయి తనిఖీలు నిర్వహించి వాస్తవాలను ప్రజల ముందుంచాలని కోరుతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు ఉన్నట్లు తేలితే బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని, అధికారుల నిర్లక్ష్యం ఉంటే దానిపైనా ఉన్నతాధికారులు విచారణ జరపాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

### 7 రకాల సన్నరకం ధాన్యానికే రూ.500 అదనపు ప్రోత్సాహకం

ప్రభుత్వం గుర్తించిన ఏడు రకాల ధాన్యాలను బిబిటి 5204, ఆర్ ఎన్ ఆర్ 15048, హెచ్ ఎంటి సోనా , జై శ్రీరామ్, కేఎన్ఎన్ 1638, డబ్ల్యూజిఎల్ 44, కేఎన్ఎన్ 7715 మాత్రమే సన్నరకంగా పరిగణించి, వాటికి క్వింటాకు అదనంగా రూ.500 ప్రోత్సాహకం అందించనున్నట్లు తెలిపారు. ఈ ఏడు రకాల ధాన్యం నమూనాలను ప్రతి ధాన్యం కొనుగోలు కేంద్రంలో అందుబాటులో ఉంచాలని సూచించారు.గ్రేడ్-'ఏ ' ధాన్యానికి క్వింటాకు రూ.2,461, సాధారణ రకం ధాన్యానికి క్వింటాకు రూ.2,441 ధర ఉండగా, గుర్తించిన ఏడు రకాల సన్నరకం ధాన్యానికి అదనంగా రూ.500 ప్రోత్సాహకం కలిపి క్వింటాకు రూ.2,961 లభించనున్నట్లు తెలిపారు.ప్రతి కొనుగోలు కేంద్రంలో రిజిస్టర్లను పక్కాగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. రైతు కొనుగోలు కేంద్రానికి వచ్చిన వెంటనే ధాన్యంలో తేమ శాతం, ఇతర వివరాలను రిజిస్టర్‌లో నమోదు చేయాలని, కొనుగోలు చేసిన పంటకు సంబంధించిన ట్యాబ్ ఎంట్రీలను ఎప్పటి కప్పుడు పూర్తి చేయాలని సూచించారు.ప్రతి కొనుగోలు కేంద్రంలో వ్యవసాయ శాఖకు చెందిన ఏఈఓ లేదా ఒక వాలంటీర్ అందుబాటులో ఉండేలా చూడాలని అన్నారు. కొనుగోలు కేంద్రాల ఇన్‌చార్జీలు కూడా సన్నరకం ధాన్యాన్ని గుర్తించేలా చర్యలు తీసుకోవాలని, వ్యవసాయ శాఖ బృందం సన్నరకం ధాన్యం రకాన్ని ధృవీకరించాలని తెలిపారు.

### అక్టోబర్ 1 నుంచి 325 కొనుగోలు కేంద్రాల ఏర్పాటు

జిల్లాలో ఖరీఫ్ సీజన్ కోసం 325 ధాన్యం కొనుగోలు కేంద్రాలను అక్టోబర్ 1, 2026 నుంచి ఏర్పాటు చేయాలని ప్రతిపాదించి నట్లు తెలిపారు. నవంబర్ 15 నుంచి కొనుగోలు కేంద్రాలకు ధాన్యం రావడం ప్రారంభమయ్యే అవకాశం ఉందని, డిసెంబర్‌లో ధాన్యం రాక మరింత పెరుగుతుందని తెలిపారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని జనవరి వరకు కొనుగోలు కేంద్రాలు నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు.

### సన్న, సాధారణ రకం ధాన్యానికి ప్రత్యేక ప్రదేశాలు

ప్రతి కొనుగోలు కేంద్రంలో సన్నరకం, సాధారణ రకం ధాన్యానికి ప్రత్యేకంగా ప్రదేశాలను గుర్తించి స్పష్టమైన డిమార్కేషన్ చేయాలని అదనపు కలెక్టర్ సూచించారు. ధాన్యం తడవకుండా అవసరమైన టార్పాలిన్లను అందుబాటులో ఉంచాలని తెలిపారు. నవంబర్‌లో తుపాన్ల ప్రభావం ఉండే అవకాశం ఉన్నందున ప్రతిరోజూ ధాన్యంపై టార్పాలిన్ కప్పడం తప్పనిసరిగా చేయాలని అన్నారు.

### మౌళిక వసతులు లేకుండా కొనుగోలు కేంద్రాలు ప్రారంభించవద్దు

ఎలక్ట్రానిక్ వేయింగ్ యంత్రాలు, తేమ కొలిచే యంత్రాలు, ఆటోమేటిక్ ప్యాడీ క్లీనర్లు, డిజిటల్ తదితర అవసరమైన మౌళిక వసతులు అందుబాటులో ఉన్న తర్వాతే కొనుగోలు కేంద్రాలను ప్రారంభించా లని అదనపు కలెక్టర్ స్పష్టం చేశారు.జిల్లాలోని 325 కొనుగోలు కేంద్రాలకు అవసరమైన పరికరాల లభ్యతను పరిశీలించి, కొరత ఉన్న పరికరాలను వెంటనే సమకూర్చాలని అధికారులను ఆదేశించారు.

### ధాన్యం నాణ్యతా ప్రమాణాలు

ధాన్యం కొనుగోలు సమయంలో నిర్దేశించిన నాణ్యతా ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని అదనపు కలెక్టర్ తెలిపారు. మట్టి పెడ్డలు, రాళ్లు గరిష్టంగా 1 శాతం, చెడిపోయిన, రంగు మారిన, మొలకెత్తిన, పురుగుతిన్న ధాన్యం 5 శాతం, పూర్తిగా తయారుకాని, ముడుచుకుపోయిన ధాన్యం 3 శాతం, తక్కువ రకాల మిశ్రమం 6 శాతం వరకు ఉండాలని, తేమ శాతం గరిష్టంగా 17 శాతం ఉండాలని తెలిపారు. నాణ్యతా ప్రమాణాల విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు లేకుండా కొనుగోలు ప్రక్రియను నిర్వహించాలని అదనపు కలెక్టర్ అధికారులను ఆదేశించారు.అంతకుముందు కొనుగోళ్లు, లోడింగ్, ఆన్ లోడింగ్ లపై రూపొందించిన సిపిఎస్ యాప్ అవగాహన కల్పించారు.ఈ సమావేశంలో పౌర సరఫరాల శాఖ అధికారి చందన్ కుమార్, డీసీఓ గంగాధర్, డిఎం సివిల్ సప్లయిస్ మల్లికార్జున్, మండల ప్రత్యేక అధికారులు, వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# SIR ఫేజ్-2లో భాగంగా సాయి నగర్ వార్డు కార్యాలయంలో BLOల పనితీరు పర్యవేక్షణ



**నాగోల్, సెప్టెంబర్ 29, నేటి శుభోదయ :** SIR ఫేజ్-2 కార్యక్రమంలో భాగంగా ఈరోజు నాగోల్ డివిజన్ పరిధిలోని సాయి నగర్ వార్డు కార్యాలయాన్ని సందర్శించి, అక్కడ విధులు నిర్వహిస్తున్న BLOల పనితీరును నాగోల్ డివిజన్ తాజా మాజీ కార్పొరేటర్ చింతల అరుణ సురేందర్ యాదవ్ పర్యవేక్షించారు.ఈ సందర్భంగా BLOల వద్దకు వచ్చిన SIR నోటీసుల వివరాలను పరిశీలించి, సంబంధిత నోటీసులను అర్హులైన ఓటర్లకు ఇంటింటికీ వెళ్లి అందజేయాలని సూచించారు. ఓటర్లకు నోటీసులపై పూర్తి అవగాహన కల్పిస్తూ, అవసరమైన వివరాలు మరియు పత్రాలను సేకరించి, అర్హులైన ప్రతి ఒక్కరూ తమ ఓటరు నమోదును సక్రమంగా పూర్తి చేసుకునేలా అవగాహన కల్పించాలని తెలిపారు.అలాగే ఇంటింటి పర్యటనలో భాగంగా ఓటర్లకు SIR ప్రక్రియపై అవగాహన కల్పించడం, అవసరమైన పత్రాలు అందుబాటులో ఉంచుకోవడం, ఓటరు జాబితాలో తమ పేరు మరియు వివరాలను పరిశీలించుకోవడం వంటి అంశాలపై ప్రజలకు వివరించాలని సూచించారు.అర్హత ఉన్న ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండాలి... ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత కీలకం" అని చింతల అరుణ సురేందర్ యాదవ్, పేర్కొన్నారు. ఎస్ ఐ ఆర్ ప్రక్రియలో BLOలకు ప్రజలు సహకరించి, అవసరమైన సమాచారాన్ని అందించాలని కోరారు.ఈ కార్యక్రమంలో బీజేపీ జి.ఎస్.ఐ డివిజన్ అధ్యక్షులు ఎర్ర వినోద్ రెడ్డి, బీజేపీ సీనియర్ నాయకులు సిద్ధాల ఐలయ్య గారు, సంజీవరెడ్డి రావుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ భూమిని కాపాడాలంటూ వృద్ధుడి న్యాయపోరాటం.

- అధికారులు స్పందించకపోవడంతో మీడియాని ఆశ్రయించినాడు.




**నిజామాబాద్, సెప్టెంబర్ 29, నేటి శుభోదయ :** నిజామాబాద్ జిల్లా ప్రెస్ క్లబ్ లో నందిపేట మండలం చిమ్రాజ్ పల్లి ప్రభుత్వ భూమిని కొందరు కబ్జా కు పాల్పడుతున్నారని ఆ గ్రామానికి చెందిన పూర్ణచంద్రరావు ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశం నిర్వహించారు.చిమ్రాజ్ పల్లి గ్రామానికి చెందిన పూర్ణచంద్రరావు గత కొన్ని రోజులుగా అధికారుల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నప్పటికీ ఎలాంటి లాభం లేకుండా పోయింది.మాజీ సర్పంచ్ గణేష్,మాజీ సర్పంచ్ దివ్య భర్త రాజు తప్పుడు పత్రాలను సృష్టించి ప్రభుత్వ భూమిని కబ్జా చేయడానికి ప్రయత్నిస్తున్నారని అన్నారు.పక్కనే ఉన్న తన స్థలాన్ని కూడా ఆక్రమించుకోవడానికి ప్రయత్నిస్తున్నారని తెలిపారు.అధికారులు భూ కబ్జాదారులకు అండగా నిలుస్తున్నారని కబ్జా చేసిన భూమిని గతంలో పట్టాలు కలిగి ఉన్న ప్రజలకు తిరిగి ఇవ్వాలని అధికారులను కోరారు.

# జుట్టు తిరుపతి ఇంటికి ఎమ్మెల్యే



**తలకొండపల్లి, సెప్టెంబర్ 29, నేటి శుభోదయ :** తలకొండపల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షులు కాసు శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో జుట్టు తిరుపతి ముదిరాజ్ నివాసానికి కల్వకుర్తి శాసనసభ్యులు కసిరెడ్డి నారాయణరెడ్డి విచ్చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే జుట్టు తిరుపతి ముదిరాజ్ కుటుంబ సభ్యులను, ముఖ్యంగా వారి భార్య పద్మమ్మ ఇటీవల అనారోగ్యానికి గురై స్టంట్ వేసుకున్న సందర్భంగా వారిని ఆప్యాయంగా పరామర్శించి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు.కుటుంబ సమస్యలు, ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకుని ధైర్యం చెప్పారు..అనంతరం స్థానిక సమస్యలు, మండలంలో పార్టీ బలోపేతంపై చర్చించినట్లు మండల పార్టీ అధ్యక్షుడు కాసు శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ కార్యకర్తలకు, వారి కుటుంబాలకు అండగా ఉంటుందని ఎమ్మెల్యే ఈ సందర్భంగా భరోసా ఇచ్చారు.పార్టీ కోసం కష్టపడిన ప్రతి కార్యకర్తను గుర్తుంచుకుంటామని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యులు,మండల నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# పోలీసు అధికారులను సన్మానించిన భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి



**హైదరాబాద్, సెప్టెంబర్ 29, నేటి శుభోదయ :** గణేష్ ఉత్సవాలు, నిమజ్జన కార్యక్రమాలను ప్రశాంతంగా, విజయవంతంగా నిర్వహించిన నారాయణగూడ పోలీసు అధికారులను భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి (BGUS) ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. విధి నిర్వహణలో అంకితభావం ప్రదర్శించిన నారాయణగూడ సీఐ (SHO) సైదేశ్వర్, అడ్మిన్ ఎస్ఐ నాగేష్, ఎస్ఐలు శ్రీకాంత్ రెడ్డి, నాగరాజు, శ్రావణి, సాయి సందీప్‌లకు శాలువా కప్పి సత్కరించారు.ఉత్సవాలు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా శాంతియుతంగా ముగిసేలా సహకరించినందుకు పోలీసు శాఖకు ఉత్సవ సమితి నాయకులు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సమితి ఖైరతాబాద్ కన్వీనర్ కొయ్యాడ నర్సింగ్ గౌడ్, హిమాయత్‌నగర్ డివిజన్ కన్వీనర్ గోపిశెట్టి ప్రమోద్, కో-కన్వీనర్ గోపి, ధీరేందర్ బియానీ, మల్లికార్జున్, మహేష్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

నేటి శుభోదయ
ప్రతి క్షణం - ప్రజల కోసం
తెలుగు దినపత్రిక
బుధవారం | హైదరాబాద్
30 - 09 - 2026
www.netisubhodaya.com



# ప్రసవం వేళ ఊపిరి కష్టమైనా.. తల్లీబిడ్డను కాపాడిన వైద్యులు

- **పోలియో, వెన్నెముక వంకర, ఊపిరితిత్తుల వ్యాధి, పల్మనరీ హైపర్‌టెన్షన్‌తో బాధపడుతున్న 37 ఏళ్ల గర్భిణికి విజయవంతంగా ప్రసవం**





**సూర్యాపేట , సెప్టెంబర్ 29, నేటి శుభోదయ :** తీవ్రమైన ఊపిరితిత్తుల సమస్యలు, పల్మనరీ హైపర్‌టెన్షన్‌తో బాధపడుతున్న 37 ఏళ్ల గర్భిణికి మలక్‌పేట్ యశోదా సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి వైద్యులు విజయవంతంగా ప్రసవం నిర్వహించారు. మంగళవారం కోదాడ పట్టణంలోని పబ్లిక్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వైద్యులు ఈ వివరాలను వెల్లడించారు.చిన్ననాటి నుంచి పోలియోతో పాటు కైఫోస్కోలియోసిస్ (వెన్నెముక వంకర), రిస్ట్రిక్టివ్ లంగ్ డిసీజ్, టైప్–2 రెస్పిరేటరీ ఫెయిల్యూర్‌తో బాధపడుతున్న సదరు మహిళ 34 వారాల 4 రోజుల గర్భంతో తీవ్రమైన శ్వాస సమస్యతో ఆసుపత్రిలో చేరినట్లు వైద్యులు తెలిపారు. పరిస్థితి క్లిష్టంగా ఉండటంతో ఆమెను ఐసీయూలో చేర్చి బీఐపీఏపీ ద్వారా శ్వాస సహాయం అందిస్తూ నిరంతరం పర్యవేక్షించారు.పల్మనాలజీ, కార్డియాలజీ, గైనకాలజీ, అనస్థీషియా, నియోనాటాలజీ విభాగాలకు చెందిన నిపుణులు సమన్వయంతో చికిత్స అందించారు. అనంతరం రీజినల్ అనస్థీషియా ద్వారా సిజేరియన్ నిర్వహించగా, 2.2 కిలోల బరువున్న మగ శిశువు సురక్షితంగా జన్మించాడు.ప్రసవం అనంతరం కూడా తల్లిని ఐసీయూలో ఉంచి బీఐపీఏపీ ద్వారా శ్వాస సహాయం కొనసాగించారు. ఆరోగ్యం మెరుగుపడిన అనంతరం ఆమెను ఆసుపత్రి నుంచి డిశ్చార్జి చేసినట్లు వైద్యులు తెలిపారు.అత్యంత క్లిష్టమైన హైరిస్క్ గర్భధారణను వివిధ విభాగాలకు చెందిన వైద్య నిపుణుల సమన్వయంతో విజయవంతంగా నిర్వహించినట్లు ఆసుపత్రి యాజమాన్యం వెల్లడించింది.ఈ సమావేశంలో డాక్టర్లు రామకృష్ణ, యుగంధర్ బట్టు, మేనేజింగ్ డైరెక్టర్ వాసు కిరణ్ రెడ్డి, వెంకటరత్నాకర్ తదితరులు పాల్గొన్నారు.

# వృద్ధాప్యాన్ని సంతోషంగా గడపాలి..

## ఘనంగా విశ్రాంత ఉద్యోగుల సామూహిక జన్మదిన వేడుకలు.



**సూర్యాపేట, సెప్టెంబర్ 29, నేటి శుభోదయ :** రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు రావేళ్ల సీతా రామయ్య..విశ్రాంత ఉద్యోగులు ఆరోగ్యకరమైన అలవాట్లతో తమ వృద్ధాప్య జీవితాన్ని సంతోషంగా గడపాలని అ సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు రావేళ్ల సీతారామయ్య అన్నారు. మంగళవారం కోదాడ పట్టణంలోని సంఘ భవనంలో అధ్యక్షులు వేనేపల్లి శ్రీనివాసరావు అధ్యక్షతన సెప్టెంబర్ నెలలో జరుపుకునే విశ్రాంత ఉద్యోగుల సామూహిక జన్మదిన వేడుకల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు.సుదీర్ఘ కాలం ప్రభుత్వానికి సేవలు అందించిన పెన్షనర్లు విశ్రాంతి జీవితంలో ఆరోగ్యాన్ని పరిరక్షించుకుంటూ సామాజిక సేవలో భాగస్వాములు కావాలని కోరారు. విశ్రాంత ఉద్యోగులకు చెల్లించాల్సిన ఆర్థిక ప్రయోజనాలు, బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని, పెన్షనర్ల హక్కుల పరిరక్షణకు సంఘం ఎల్లప్పుడూ ముందుంటుందని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో అధ్యక్షులు వేనేపల్లి శ్రీనివాసరావు, కార్యదర్శి పందిరి రఘువర ప్రసాద్, ఆర్థిక కార్యదర్శి తమ్మన బోయిన వీరబాబు,రాష్ట్ర కౌన్సిలర్ పొట్ట జగన్మోహన్ రావు,ఉపాధ్యక్షులు జి భ్రమరాంబ, గులాం యాస్థాని, బాలేమియా, విద్యాసాగర్ రావు పెన్షనర్లు పాల్గొన్నారు.

# అశుభ్ర వాతావరణంలో టిఫిన్ సెంటర్

- **తార్నాక విజయ డైరీ ముందు యథేచ్ఛగా వ్యాపారం**
- **అధికారుల పర్యవేక్షణ ఎక్కడ.?**
- **ప్రజల ఆరోగ్యంపై మున్సిపల్ అధికారులకు శ్రద్ధ లేదా.?**





**సికింద్రాబాద్, సెప్టెంబర్ 29, నేటి శుభోదయ :** తార్నాక విజయ డైరీ ముందు నిర్వహిస్తున్న ఓ టిఫిన్ సెంటర్‌పై స్థానికులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. టిఫిన్ సెంటర్ పరిసర ప్రాంతాల్లో పరిశుభ్రత పూర్తిగా లోపించడం, ఆహార పదార్థాల తయారీలో నాణ్యతా ప్రమాణాలు పాటించడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సంబంధిత అధికారులు క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించి చర్యలు తీసుకోవాల్సి ఉన్నప్పటికీ అసలు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.మదర్ డైరీకి సంబంధించిన రూమ్‌ను ఉపయోగించుకుంటూ టిఫిన్ సెంటర్ నిర్వహిస్తున్నారనే ఆరోపణలు కూడా ఉన్నాయి. ఆ ప్రదేశం ఏ ప్రయోజనం కోసం కేటాయించబడింది.? అక్కడ ఆహార వ్యాపారం నిర్వహించేందుకు అనుమతులు ఉన్నాయా.? ఫుడ్ సేఫ్టీ నిబంధనలు, మున్సిపల్ అనుమతులు, పారిశుధ్య ప్రమాణాలు పాటిస్తున్నారా.? అనే అంశాలపై అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. కొంతమంది మున్సిపల్ అధికారులకు ప్రతినెల మామూళ్లు అందుతున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి.

**నాసిరకం ఆహారంతో ఆరోగ్యానికి ముప్పు.?**

టిఫిన్ల తయారీలో ఉపయోగించే ముడి పదార్థాల నాణ్యత, వంట చేసే ప్రదేశం పరిశుభ్రత, తాగునీటి నాణ్యత, వంట నూనెల వినియోగం వంటి అంశాలపై అధికారులు తనిఖీలు నిర్వహించాల్సి ఉంది. అయితే ఇక్కడ నాణ్యతా ప్రమాణాలు పాటించడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. టిఫిన్లలో అధికంగా ఉప్పు, కారం ఉపయోగిస్తున్నారని, రుచి కంటే ఆరోగ్యానికి హాని కలిగించే విధంగా ఆహారం తయారు చేస్తున్నారని పలువురు పేర్కొంటున్నారు.అశుభ్ర వాతావరణంలో ఆహార పదార్థాలు తయారు చేస్తే వినియోగదారుల ఆరోగ్యంపై రోగాల ప్రభావం పడే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులు, ఆరోగ్య సమస్యలు ఉన్నవారు ఇటువంటి ఆహారం తీసుకుంటే కొత్త రోగాలు వచ్చే ప్రమాదం ఉందని వారు చెబుతున్నారు.

**ఫిర్యాదులు చేసిన చర్యలు శూన్యం.?**

సికింద్రాబాద్ నియోజకవర్గంలో మున్సిపల్ అనుమతులు లేకుండా రోడ్లు ఫుట్పాతులపై నిర్వహించే టిఫిన్ సెంటర్‌పై స్థానికులు పలుమార్లు అధికారులకు ఫిర్యాదులు చేసినప్పటికీ కనీస చర్యలు కనిపించడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యమే కారణమ లేక రాజకీయ ఒత్తిళ్లు ఉన్నాయా.? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అక్రమంగా వ్యాపారం సాగుతున్నదనే ఆరోపణలు నిజమైతే అధికారులు విచారణ జరిపి నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.స్థానిక రాజకీయ నాయకుల అండదండలతోనే టిఫిన్ సెంటర్ యథేచ్ఛగా కొనసాగుతోందన్న ఆరోపణలపైనా అధికారులు విచారణ చేయాల్సిన అవసరం ఉంది.

**అధికారుల తనిఖీలు ఎప్పుడు.?**

ప్రజల ఆరోగ్యంతో ముడిపడిన ఆహార వ్యాపారాలపై మున్సిపల్, ఫుడ్ సేఫ్టీ అధికారులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించాలని స్థానికులు కోరుతున్నారు. టిఫిన్ సెంటర్‌కు అవసరమైన అనుమతులు ఉన్నాయా.? ఆహార భద్రతా నిబంధనలు పాటిస్తున్నారా.? పరిశుభ్రత ప్రమాణాలు ఎలా ఉన్నాయి.? అనే అంశాలపై అధికారులు బహిరంగంగా స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని అధికారులు తక్షణమే స్పందించి ట్రేడ్ లైసెన్ లేని టిఫిన్ సెంటర్ల ను మూసివేయాలని ప్రజలు కోరుతున్నారు.

# బ్యూటిషన్ షన్నును అభినందించిన కోదాడ ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి.

**నిరుద్యోగ మహిళలకు బ్యూటిషన్ రంగం ఒక వరం లాంటిది - ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి**






**కోదాడ, సెప్టెంబర్ 29, నేటి శుభోదయ :** సూర్యాపేట జిల్లా కోదాడ పట్టణంలో షన్ను బ్యూటీ పార్లర్ ఆధ్వర్యంలో బ్యూటీ సెమినార్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కోదాడ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బ్యూటిషన్ రంగంలో ముందుకు వెళుతున్న మహిళలందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ఏఐ డిజిటల్ రావడంతో ఎంతోమంది మహిళలు నిరుద్యోగులుగా మారుతున్నారని అలాంటి వారు బాధ పడకుండా ఈ బ్యూటిషన్ రంగం ఒక వారం లాంటిది అన్నారు. రెండు రాష్ట్రాల నుంచి వచ్చిన మహిళలకు సన్మానం చేసి అనంతరం ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన బ్యూటిషన్ షన్నును కోదాడ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డి అభినందించారు. భవిష్యత్తులో మహిళల కోసం బ్యూటిషన్ రంగం అభివృద్ధికి దోహద పడేలా ఒక ప్రత్యేక బడ్జెట్ కేటాయిస్తానని ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులు హరి, రమా,రామ్ చరణ్, మేకప్ ఆర్గనైజేషన్ షన్ను, మేకప్ సపోర్టింగ్ టీం కళ్యాణి, రమ్యశ్రీ, సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

# 6 గ్యారెంటీలు, 420 హామీలు గాలికొదిలిన రేవంత్ రెడ్డి..

## కేంద్ర ప్రభుత్వంపై మాట్లాడే నైతిక హక్కు లేదు: రచ్చ శ్రీనివాస్




**నేటి శుభోదయ :** ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు రచ్చ శ్రీనివాస్ తీవ్రంగా ధ్వజమెత్తారు. తన వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర ప్రభుత్వంపై, బీజేపీపై అవాస్తవాలు ప్రచారం చేస్తున్నారని ఆయన మండి పడ్డారు. హామీల అమలులో ఘోర వైఫల్యంఅధికారంలోకి రాగానే 6 గ్యారెంటీలు అమలు చేస్తామని చెప్పి ప్రజలను మోసం చేశారు. 420 హామీలను గాలికొదిలేసి రైతులు, మహిళలు, యువతను నిలువునా వంచించారు. హామీలను నెరవేర్చాలనే బాధ్యతను పక్కనపెట్టి, కేంద్ర ప్రభుత్వంపై బురదజల్లి తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారు.రాజ్యాంగ సంస్థలపై అక్కసుకేంద్ర ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం చేసే ప్రక్రియలపై అనవసర ఆరోపణలు చేస్తూ, ప్రజలను రెచ్చగొట్టే విధంగా మాట్లాడటం ఒక ముఖ్యమంత్రి హోదాకు తగదు. ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగ సంస్థలను అగౌరవపరచడమే కాంగ్రెస్ విధానం. మతపరమైన విభజన రాజకీయాలురాజకీయ లబ్ధి కోసం శ్రీరాముడు, శివుడి మధ్య పేద–ధనిక తేడాలు చూపుతూ హిందూ సమాజ మనోభావాలను రేవంత్ రెడ్డి కించపరుస్తున్నారు. దేవుళ్లపై అనుచిత వ్యాఖ్యలు చేసి ప్రజల మధ్య చిచ్చుపెట్టే ఆలోచనను తక్షణమే మానుకోవాలి. కేంద్ర ప్రభుత్వంపై నిరాధార విమర్శలు చేయడం ఆపి, ముందుగా ప్రజలకు ఇచ్చిన 6 గ్యారెంటీలు, 420 హామీలను నెరవేర్చడంపై రేవంత్ రెడ్డి దృష్టి పెట్టాలని, లేనిపక్షంలో తెలంగాణ ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతారని రచ్చ శ్రీనివాస్ హెచ్చరించారు.భవదీయుడు,రచ్చ శ్రీనివాస్రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు,భారతీయ జనతా పార్టీ (BJP), తెలంగాణ.

# వీరన్న దేవాలయంన్ని పరిశీలించిన పోలీస్ ఉన్నంతధికారులు

- **కార్యక్రమంలో పాల్గొన్న లో గోల్కొండ గోషామహల్ జిల్లా ఇన్చార్జ్ వై శ్రీధర్**



**రాజేంద్ర నగర్, సెప్టెంబర్ 29, నేటి శుభోదయ :** శ్రీ హస్తాల వీరన్న దేవాలయం చింతల్ మెట్ ఉప్పరపల్లి లోని గుండం వద్ద దేవాలయం లో అక్రమ నిర్మాణ పనులు ఆపుట కొరకు నిన్న MRO రాజేంద్రనగర్ గార్కి అత్తాపూర్ పోలీస్ గార్కి ఎండోమెంట్ అధికారుల తో కలిసి ఫిర్యాదు ఇవ్వడం జరిగింది ఉదయం 11గం లకు MRO రాములు CI సీతయ్య అత్తాపూర్ హైడ్రా CI సైదులు ఎండోమెంట్ ఈఓ రామదాదేవి వచ్చి ఇన్స్పెక్షన్ చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో లో గోల్కొండ గోషామహల్ జిల్లా ఇన్చార్జ్ వై శ్రీధర్ వనపర్తి జిల్లా ఇన్చార్జ్ బొక్కా బాల్ రెడ్డి బిజెపి నాయకులు స్ విఠల్ వెంకట్ రెడ్డి విక్రమ్ చారి శ్రీను స్థానిక నాయకులు నర్సింగ్ యాదవ్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు ధన్యవాదాలు

Printed Published and Owned by Gongura Srinivas Rao, Printed at M R Publications, # 6-3-1880, Vanasthalipuram, Ranga Reddy (Dist), Telangana 500070. at H.No 8-7-12/671, Sai Colony, Madhuban Colony, Rajendranagar, Ranga Reddy District, Telangana-500077, Editor: Gongura Srinivas Rao, RNI Title Code :- RNI TELTEL/2024/89620

## పొదిల దేవేంద్రనాథ్ కుటుంబాన్ని పరామర్శించిన నామ నాగేశ్వరరావు



**ఖమ్మం, సెప్టెంబర్ 29, నేటి శుభోదయ :** ప్రముఖ వ్యాపారవేత్త, మున్నూరు కాపు రాష్ట్ర నాయకులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పొదిల రవికుమార్ తండ్రి పొదిల దేవేంద్రనాథ్ ఆగస్టు 29న మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ విషయం తెలుసుకున్న నామా గ్రూప్ ఆఫ్ కంపెనీస్ అధినేత, మాజీ పార్లమెంట్ సభ్యులు నామ నాగేశ్వర రావు ఖమ్మం నగరంలోని చర్చి కాంపౌండ్ వద్ద గల పొదిల కుటుంబ నివాసానికి వెళ్లి పరామర్శించారు.ఈ సందర్భంగా పొదిల దేవేంద్రనాథ్, శ్రీమతి పొదిల విజయలక్ష్మి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పొదిల రవి కుమార్‌తో పాటు కుటుంబ సభ్యులను పరామర్శించి, దేవేంద్ర నాథ్ మృతి పట్ల ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పిస్తూ వారి వెంట తాము ఉన్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, జిల్లా సీనియర్ నాయకులు మోరంపూడి ప్రసాద్ రావు, సీనియర్ నాయకులు గొడ్డేటి మాధవరావు, బోనకల్ మండల నాయకులు బంధం నాగేశ్వరరావు, పొదిల రవికుమార్ కుమారుడు పొదిల రాజేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు జీవీవీ ఎల్ నరసింహరావు, దొడ్డా రామారావు, తిరుమలశెట్టి జయప్రకాశ్, ఖానాపురం నాయకులు నానబాల హరీష్, లక్ష్మీపురం నాయకులు పాపారావు తదితరులు పాల్గొన్నారు.

## వి డి సి ల రద్దుకు కృషి చేయాలి: మంద కృష్ణ మాదిగకు తాళ్ళ రాంపూర్ బాధితుల వినతి







**నిజామాబాద్, సెప్టెంబర్ 29, నేటి శుభోదయ :** గ్రామాల్లో విలేజ్ డెవలప్‌మెంట్ కమిటీల (VDC) పేరుతో సాగుతున్న సాంఘిక బహిష్కరణలు, వివక్షపై పోరాటం చేసి VDC లను రద్దు చేయాలని తాళ్వరాంపూర్ VDC బాధితులు MRPS ఎమ్ ఆర్ పి ఎస్ వ్యవస్థాపకులు, పద్మశ్రీ మంద కృష్ణ మాదిగను కోరారు. సోమవారం హైదరాబాద్‌లో వీడీసీ వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో తాళ్లరాంపూర్ బాధితులు మంద కృష్ణ మాదిగను కలిశారు. ఈ సందర్భంగా తమ పట్ల జరుగుతున్న వెలివేత, సాంఘిక బహిష్కరణ, వివక్షను ఆయన దృష్టికి తీసుకెళ్లి విన్నవించారు. బాధితుల సమస్యలపై మంద కృష్ణ మాదిగ స్పందిస్తూ... నేటి ఆధునిక కాలంలో కూడా ఇటువంటి సాంఘిక బహిష్కరణల వంటి దురాగతాలు జరగడం ఎంతో సిగ్గుచేటని ఆవేదన వ్యక్తం చేశారు. వీడీసీ ల నిర్మూలన పోరాటంలో ఎమ్ ఆర్ పీ ఎస్ మరియు ఇతర అన్ని ప్రజాస్వామిక సంఘాల ద్వారా బాధితులకు పూర్తి అండగా ఉంటామని, ఇట్టి సమస్య పరిష్కారం దిశగా పోరాడతామని భరోసా ఇచ్చారు. వీడీసీ ల ఆధిపత్య ధోరణిని కూకటివేళ్లతో అణిచివేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వీడీసీ వ్యతిరేక పోరాట సమితి నాయకుడు బట్టు శ్రీధర్, బాధితులు దిబ్బ సుదర్శన్, నర్సా గౌడ్, నారాయణ గౌడ్, గంగాధర్, దేవదాస్, దేవన్న, జనార్దన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## వర్గ పోరాటాల ద్వారానే కుల వ్యవస్థను కూల్చుదాం

- ఏ ఐ యూ కె ఎస్ రాష్ట్ర అధ్యక్షులు వి ప్రభాకర్





**నిజామాబాద్ రూరల్ సిరికొండ, సెప్టెంబర్ 29, నేటి శుభోదయ :** సిరికొండ మండలం గడ్కోల్ గ్రామం లో పీడీ ఎస్ యూ పి వై ఎల్ – పి ఓ డబ్ల్యూ ల ఆధ్వర్యంలో సత్యశోధక్ సమాజ్ ఏర్పడి 154 సంవత్సరాల సందర్భంగా కుల నిర్మూలన సధస్సు ను ఏ ఐ పి కె ఎమ్ ఎస్ జిల్లా ప్రాధాన కార్యదర్శి రమేష్ అధ్యక్షతన నిర్వహించడం జరిగింది.ఈ సదస్సులో ఏ ఐ యూ కె ఎస్ రాష్ట్ర అధ్యక్షులు వి ప్రభాకర్, మరియు సిపిఐ (ఎంఎల్ )మాస్ లైన్ ఏలూరు జిల్లా కమిటీ కార్యదర్శి SK. గౌస్ మాట్లాడుతూ మహా రాష్ట్రలో మహాత్మ జ్యోతిరావు బాపూలే 1873లో సత్యసోధక్ సమాజ్ సంస్థను ఏర్పాటు చేసి, శూద్రులు, అతిశూద్రులు విద్యకు దూరం కావడం వలన కుల వ్యవస్థలో బానిసలుగా మారారు అని పూలే నమ్మారు. క్రాంతి జ్యోతి సావిత్రి భాయి పూలే అనగారిన వర్గాల కోసం ప్రత్యేక పాఠశాలలు ఏర్పాటు చేశారు. పూలే, సావిత్రిబాయి నిమ్న కులాల వారికి సమాన హక్కులు కల్పించడం, దోపిడి పీడనకు వ్యతిరేకంగా పోరాడారు. అంటరానితనంపై దళిత సామాజిక వర్గాల ప్రజలను ఐక్యం చేసి లింగ వివక్షతపై మంచి నీటి సమస్యలపై పోరాడారు. గులాంగిరి గ్రంథం! ద్వారా సమాజంలో కుల వివక్షత బానిసత్వానికి ఏ విధంగా దారితీసిందో చారిత్రక ఆధారాలతో ఎండగట్టారు. తమిళనాడులో ద్రావిడ ఉద్యమ పితామహుడుగా పేరొందిన తంతై ఈవి రామస్వామి 1879 –1973 కుల నిర్మూలనకు హేతుబద్ధమైన విప్లవాత్మక మార్గాలను ఎంచుకున్నారు. 1925లో కులాధిపత్యాన్ని మూఢనమ్మకాలను అంతం చేయడానికి వెనుకబడిన వర్గాలలో ఆత్మగౌరవ ఉద్యమాలు చేపట్టారు. పేర్ల నుండి కుల గుర్తింపు తొలగింపు ఆత్మగౌరవ వివాహాలు వంశపార పర్య విద్య పై పోరాటాలు చేశారు. కేరళ లోని వైకోం ఆలయ వీధుల్లో దళితుల నడకపై ఉన్న నిషేధాన్ని ఎత్తివేయడానికి పోరాటం చేసి విజయం సాధించారు. శతాబ్దాల కాలం నుండి సమాజంలో కుల నిర్మూలన కొరకు అనేక సంస్కరణ ఉద్యమాలు జరిపినప్పటికీ వేల సంవత్సరాల నుండి వేళ్ళునికొని ఉన్న కుల వ్యవస్థ మారలేదు. కార్ల్ మార్క్స్ భారత దేశంలో కుల వ్యవస్థ పై దాని నిర్మూలనపై తన చారిత్రక భౌతికవాదం (హిస్టరికల్ మెటీరియలిజం ) సిద్ధాంతం ఆధారంగా విశ్లేషణ చేశారు. 1853లో ది ఫ్యూచర్ రిజల్ట్స్ ఆఫ్ బ్రిటిష్ రూల్ ఇన్ ఇండియా (ది ఫ్యూచర్ రిజల్ట్స్ of బ్రిటిష్ రూల్ ఇన్ ఇండియా ) అనే వ్యాసంలో మరియు తన ప్రసిద్ధ గ్రంథంలో దాస్ కాపిటల్ (దాస్ కాపిటల్ ) లో కుల వ్యవస్థ గురించి రాశారు. కుల వ్యవస్థ అనేది కేవలం మతపరమైన నమ్మకం కాదు, అది ఆర్థిక పునాది కలిగిన వంశపారపర్య శ్రమ విభజన అన్నారు. ఉత్పత్తి సాధనాలతో మరియు సాంకేతికలో మార్పులు వచ్చినప్పుడు పాత శ్రమ విభజన ( కులం) దానంతట అదే బల హీనపడుతుందని మార్క్స్ అన్నారు. నేటి పెట్టుబడి దారి సమాజంలో మార్క్సిజం , లేనింజం, మావో ఆలోచన విధానం సిద్ధాంతంతో వర్గ పోరాటం ద్వారానే కుల వ్యవస్థ అంతం అవుతుందని గౌస్ అన్నారు. ఈ కార్యక్రమంలోసిపిఐ (ఎంఎల్ ) మాస్ లైన్ రాష్ట్ర నాయకులు P రామకృష్ణ, సిపిఐ (ఎంఎల్ ) మాస్ లైన్ డివిజన్ కార్యదర్శి B దేవారం, సిరికొండ ధర్పల్లి మండల సంయుక్త కార్యదర్శి R రమేష్ లు, అధ్యక్షత వహించిన ఇ రమేష్, వేదిక పై ఆశీనులు ఆయినా గడ్కోల్ గ్రామ కార్యదర్శి ఎం లింబాద్రి, TUCI జిల్లా ఉపాధ్యక్షులు కె రాజేశ్వర్,AIUKS జిల్లా ప్రధానకార్యదర్శి B బాబన్న, జిల్లా నాయకురాలు P రమ, , సిరికొండ మండల ప్రధాన కార్యదర్శి ఇ జమున, పాల్గొన్న డివిజన్ కార్యదర్శి ఆర్ పుష్పలత, మండల అధ్యక్షురాలు బి లావణ్య, సిపిఐ (ఎంఎల్ )మాస్ లైన్ ఆర్మూర్ డివిజన్ నాయకులు ఆర్ దామోదర్,బి కిషోర్, ఎం నారగౌడ్, POW నాయకురాలు ఎస్ గంగామణి, TUCI జిల్లా సహాయకార్యదర్శి ఎం అనీస్, జిల్లా నాయకులు ఎస్ కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

## ఆయుష్మాన్ భారత్ కార్డుల నమోదుకు విశేష స్పందన

- బొబ్బిలి విజయ్‌రెడ్డి నాయకత్వంలో అవగాహన కార్యక్రమం



**నేరేడ్ మెట్, సెప్టెంబర్ 29, నేటి శుభోదయ :** పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆరోగ్య భద్రత కల్పించడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య పథకంపై ప్రజల్లో అవగాహన కల్పిస్తూ ఆరోగ్య కార్డుల నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రముఖ సంఘ సేవకులు బొబ్బిలి విజయ్‌రెడ్డి నాయకత్వంలో మల్కాజిగిరి పరిధిలోని హనుమంత్‌కృప అపార్ట్‌మెంట్‌తో పాటు వినాయక్‌నగర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఈ కార్యక్రమం కొనసాగింది.బొబ్బిలి విజయ్‌రెడ్డి చొరవతో నిర్వహించిన ఈ కార్యక్రమానికి స్థానికుల నుంచి విశేష స్పందన లభించింది. అర్హులైన ప్రజలకు ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య కార్డుల నమోదు విధానం, పథకం ద్వారా అందే వైద్య సేవలపై ఆరోగ్య సిబ్బంది అవగాహన కల్పించారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ ఆరోగ్య కార్డు నమోదు చేసుకుని ప్రభుత్వ ఆరోగ్య పథకాల ప్రయోజనాలను సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు సూచించారు.ప్రజలకు నమోదు ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆరోగ్య సిబ్బంది సహకారం అందించారు. ముఖ్యంగా పరిసర ప్రాంతాల్లోని అర్హులైన కుటుంబాలను గుర్తించి వారికి ఆరోగ్య కార్డుల ప్రాధాన్యతను వివరించారు.కార్యక్రమంలో బొబ్బిలి విజయ్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, చంటి బాబు, పరాస్‌మల్ జైన్ వినాయక్‌నగర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ మాధురి, ఏఎన్ఎం బి. మంగ, ఆశా కార్యకర్తలు ఝాన్సీ, సరిత, జ్యోతి తదితరులు పాల్గొన్నారు .

## భద్రాద్రి ఆలయ హుండీకి భారీగా కానుకలు.. రూ.2.12 కోట్లు.





**భద్రాద్రి కొత్తగూడెం, సెప్టెంబర్ 29, నేటి శుభోదయ :** భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి దేవస్థానంలో 98 రోజుల హుండీ లెక్కింపు సోమవారం భద్రతా ఏర్పాట్ల మధ్య నిర్వహించారు. హుండీ కానుకల ద్వారా దేవస్థానానికి రూ.2,12,40,214 నగదు ఆదాయం లభించినట్లు అధికారులు తెలిపారు.గత హుండీ లెక్కింపు జూన్ 22న నిర్వహించగా, తాజాగా 98 రోజుల అనంతరం హుండీ లెక్కింపు చేపట్టారు. నగదుతో పాటు 0.170 గ్రాముల మిశ్రమ బంగారం, 1 కిలో 400 గ్రాముల మిశ్రమ వెండి లభించినట్లు వెల్లడించారు.అదేవిధంగా అమెరికా డాలర్లు 545, ఖతార్ రియాళ్లు 11, యూఏఈ దిర్హామ్లు 135, ఇంగ్లాండ్ పౌండ్లు 110, నేపాల్ రూపాయలు 140, కువైట్ దినార్లు 6, కెనడా డాలర్లు 50, ఆస్ట్రేలియా డాలర్లు 60, యూరోలు 30, సింగపూర్ డాలర్లు 60, ఒమన్ బైసా 1, మలేషియా రింగిట్ 1, భూటాన్ న్గుల్ట్రమ్ 10, బహ్రెయిన్ దినార్ 1తో పాటు మలావి దేశానికి చెందిన క్వాచా కరెన్సీ కూడా హుండీలో లభించినట్లు అధికారులు తెలిపారు.హుండీ లెక్కింపు ప్రక్రియను దేవస్థానం ఈవో దామోదరరావు పర్యవేక్షించగా, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. వివిధ ప్రాంతాల నుంచి భద్రాచలానికి వచ్చే భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకుంటూ నగదు, బంగారం, వెండి, విదేశీ కరెన్సీని కానుకలుగా సమర్పిస్తున్నారు. హుండీ ద్వారా సమకూరే ఆదాయాన్ని నిబంధనల మేరకు దేవస్థాన అభివృద్ధి, భక్తులకు మౌలిక సౌకర్యాల కల్పన తదితర కార్యక్రమాలకు వినియోగిస్తారు.

## పోషక విలువలు కలిగిన ఆహారం అవసరం.



**ఏన్కూరు, సెప్టెంబర్ 29, నేటి శుభోదయ :** ప్రభుత్వం ఇచ్చిన మెనూ ప్రకారం అంగన్వాడీ కేంద్రాల ద్వారా గర్భిణీ స్త్రీలకు, బాలింతలకు, చిన్నారులకు పోషక విలువలు కలిగిన పదార్థాలు అందజేయాలని ఏన్కూర్ ఎంపీడీవో పి.భాగ్యశ్రీ అన్నారు. మండల పరిధిలోని మూల పోచారం గ్రామంలో అంగన్వాడీ కేంద్రాన్ని ఎంపీడీవో పి.భాగ్యశ్రీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కూరగాయలు, ఆకుకూరలు, పోషక విలువలు కలిగిన పదార్థాలు తినడం వల్ల రక్తం శాతం పెరిగి ఆరోగ్యకరంగా ఉంటారని, ఆమె అన్నారు. ఆమె వెంట అంగన్వాడీ సిబ్బంది తదితరులు ఉన్నారు.

# ఎస్సీ సహకార అభివృద్ధి సంస్థ ఈడీగా పి. విజయలక్ష్మి



**భద్రాద్రి కొత్తగూడెం, సెప్టెంబర్ 29, నేటి శుభోదయ :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా షెడ్యూల్డు కులాల సేవా సహకార అభివృద్ధి సంస్థ కార్య నిర్వాహక సంచాలకురాలిగా (ఇన్‌చార్జి) పి. విజయలక్ష్మి బాధ్యతలు స్వీకరించారు. జిల్లా కలెక్టర్, సంస్థ చైర్మన్ జారీ చేసిన ఉత్తర్వుల మేరకు ఆమెను ఈడీగా నియమించారు.జిల్లా కలెక్టర్, సంస్థ చైర్మన్ సమక్షంలో పి. విజయలక్ష్మి విధుల్లో చేరి, ఇప్పటివరకు కార్య నిర్వాహక సంచాలకుడిగా కొనసాగిన ఆర్. ఉపేందర్‌రావు నుంచి బాధ్యతలు స్వీకరించారు.

# గుండె ఆరోగ్యంపై విద్యార్థులకు అవగాహన.



**భద్రాద్రి కొత్తగూడెం, సెప్టెంబర్ 29, నేటి శుభోదయ :** ప్రపంచ హృదయ దినోత్సవాన్ని పురస్కరించుకుని భద్రాచలం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆరోగ్య అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ తుకారామ్ రాథోడ్ ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులకు గుండె ఆరోగ్యం, పోషకాహారం, వ్యాధుల నివారణ, మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా డాక్టర్ తుకారామ్ రాథోడ్ మాట్లాడుతూ చిన్న వయస్సు నుంచే ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని సూచించారు. సమతుల్య ఆహారం, క్రమం తప్పకుండా వ్యాయామం, తగినంత నిద్రతో పాటు పొగాకు, మద్యం, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని తెలిపారు. ఒత్తిడిని నియంత్రించుకోవడం ద్వారా గుండె ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చన్నారు. చెవుల ఆరోగ్యం, వినికిడి లోపాలు, పాముకాటు సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నషా ముక్త్ భారత్ అభియాన్‌పై కూడా అవగాహన కల్పించారు.కార్యక్రమంలో విద్యార్థులతో నషా ముక్త్ భారత్ ప్రతిజ్ఞ చేయించారు. ఏడీఎంహెచ్ఓ (టి), ఐటీడీఏ భద్రాచలం డాక్టర్ బి. సైదులు రక్తహీనత నివారణ, సమతుల్య ఆహారం, స్థానికంగా లభించే పోషకాహార పదార్థాల ప్రాధాన్యతను వివరించారు. డీపీఎంఓ మోహన్ తేజావత్ కుష్ఠు వ్యాధి లక్షణాలు, ముందస్తు గుర్తింపు, ఉచిత చికిత్స, వైకల్యాల నివారణపై అవగాహన కల్పించారు.కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జాన్ విల్సన్, ప్రొఫెసర్ సుందాకర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# చిన్నారి భవిష్యత్తుకు గ్రామస్తుల భరోసా

- మరణించిన కారోబార్ శివకుమార్ కుమార్తె పేరిట రూ.1.50 లక్షలు జమ
- సుకన్య సమృద్ధి యోజన ద్వారా ఆర్థిక భద్రతకు శ్రీకారం



**షాబాద్, సెప్టెంబర్ 29, నేటి శుభోదయ :** ఆపదలో ఉన్న కుటుంబానికి అండగా నిలిచి, తండ్రిని కోల్పోయిన 11 నెలల చిన్నారి భవిష్యత్తుకు గ్రామస్తులు భరోసా కల్పించారు. షాబాద్ మండలం లక్ష్మారావుగూడ గ్రామపంచాయతీ కారోబార్‌గా పని చేసిన గంటల శివకుమార్ ఇటీవల మృతి చెందడంతో ఆయన కుటుంబం విషాదంలో మునిగిపోయింది. ఈ నేపథ్యంలో గ్రామ సర్పంచ్ శ్రీరంగపురం కుమార్ ఆధ్వర్యంలో గ్రామ యువకులు, పెద్దలు మానవతా దృక్పథంతో ముందుకు వచ్చారు.రూ.1.50 లక్షలు సేకరించి చిన్నారి పేరిట పొదుపుశివకుమార్‌కు 11 నెలల చిన్నారి కుమార్తె ఉండటంతో ఆమె భవిష్యత్తుకు ఆర్థిక భరోసా కల్పించాలనే ఉద్దేశంతో గ్రామ యువకులు, పెద్దలు కలిసి రూ.1,50,000 సేకరించారు. ఆ మొత్తాన్ని చిన్నారి పేరిట సుకన్య సమృద్ధి యోజన పథకం కింద జమ చేశారు. చిన్నారి చదువు, భవిష్యత్ అవసరాలకు ఈ పొదుపు ఉపయోగపడేలా చర్యలు తీసుకున్నారు.ఆపదలో అండగా నిలిచిన గ్రామస్తులుకుటుంబంలో విషాదం చోటుచేసుకున్న సమయంలో గ్రామస్తులు ముందుకు వచ్చి ఆర్థిక సహాయం అందించడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. తండ్రిని కోల్పోయిన చిన్నారికి భవిష్యత్తులో ఆర్థిక ఇబ్బందులు తలెత్తకుండా ఇప్పటి నుంచే పొదుపు చేయడం మంచి ఆలోచనగా గ్రామస్తులు అభిప్రాయపడ్డారు.మానవత్వానికి నిదర్శనంగ్రామంలో ఒక కుటుంబానికి ఆపద వచ్చినప్పుడు తామంతా ఒక్కటేననే భావనతో యువకులు, పెద్దలు కలిసి సహాయం చేయడం గ్రామ ఐక్యతకు నిదర్శనమని పలువురు అన్నారు. చిన్నారి భవిష్యత్తు కోసం చేసిన ఈ ప్రయత్నం ఇతరులకు కూడా ఆదర్శంగా నిలుస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు, స్థానికులు పాల్గొని చిన్నారి కుటుంబానికి తమ మద్దతు తెలిపారు.

# సీఈసీ జ్ఞానేశ్వర్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలి

- మోర్తాడ్ మండల కేంద్రంలో మహాత్మా జ్యోతిబా పూలే విగ్రహం వద్ద డీఎస్ఎస్ నిరసన



**నిజామాబాద్ జిల్లా మోర్తాడ్, సెప్టెంబర్ 29, నేటి శుభోదయ :**
మోర్తాడ్ మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిబా పూలే విగ్రహం వద్ద డిఎస్ఎస్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా పాలెం రాజారామ్ మాట్లాడుతూ...కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రాజ్యాంగబద్ధమైన ఎన్నికల సంఘం పనితీరును తీవ్రంగా ప్రభావితం చేస్తోందని దళిత సంక్షేమ సంఘం (డిఎస్ఎస్) ప్రజాస్వామ్యంలో పౌరుల ఓటు హక్కును కాపాడవలసిన పూర్తి బాధ్యత ఎన్నికల సంఘానిదేనని స్పష్టం చేశారు. కానీ ప్రస్తుత ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్వర్ కుమార్ కేంద్ర ప్రభుత్వ ఒత్తిళ్లకు తలొగ్గి వ్యవహరిస్తున్నారని, అందుకే ఆయన తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.అలాగే, ఎన్నికల సంఘం పారదర్శకంగా పనిచేయాలని మరియు ఓటర్ల జాబితాను ప్రత్యేకంగా, సమగ్రంగా సవరించాల్సిన అవసరం ఎంతైనా ఉందని పేర్కొన్నారు. రాజ్యాంగ బద్ధ సంస్థల స్వయంప్రతిపత్తిని కాపాడుకోవడానికి డిఎస్ఎస్ నిరంతరం పోరాడుతుందని స్పష్టం చేశారు.ఈ నిరసన కార్యక్రమంలో డిఎస్ఎస్ మోర్తాడ్ మండల ఉపాధ్యక్షులు కాన్సిరాం మాల, ప్రధాన కార్యదర్శి జాంబవ చమార్, సలహాదారులు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.పాల్గొన్నారు.

# ఫార్మర్ రిజిస్ట్రీని వేగవంతం చేసి 70 శాతం లక్ష్యాన్ని త్వరగా అధిగమించాలి: జిల్లా కలెక్టర్ మను చౌదరి







**మేడ్చల్, సెప్టెంబర్ 29, నేటి శుభోదయ :**
జిల్లాలో ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియను వేగవంతం చేసి త్వరలోనే 70 శాతం లక్ష్యాన్ని అధిగమించాలని జిల్లా కలెక్టర్ మను చౌదరి క్షేత్రస్థాయి సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రానున్న ఖరీఫ్ సీజన్‌లో ధాన్యం కొనుగోళ్ల సన్నాహాలు, రైతుల సంక్షేమంపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డితో కలిసి ఆయన పాల్గొన్నారు.రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోళ్లు సజావుగా జరిగేలా ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ప్రతి మండలంలో కనీసం ఒక ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల వద్ద స్థల కొరత, ధాన్యం రవాణాలో జాప్యం లేకుండా ప్రత్యామ్నాయ గోదాములు, అదనపు నిల్వ స్థలాలను ముందుగానే గుర్తించాలని తెలిపారు.అన్ని కొనుగోలు కేంద్రాల్లో గన్నీ సంచులు, టార్పాలిన్ షీట్లు, సుత్తిలి, తేమ కొలిచే పరికరాలు, ధాన్యం శుభ్రపరిచే యంత్రాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల నుంచి గోదాములకు ధాన్యం తరలించేందుకు సరిపడా వాహనాలను సిద్ధంగా ఉంచాలని రవాణా కాంట్రాక్టర్లకు సూచించారు. గోదాముల వద్ద ధాన్యం దిగుమతి సమయంలో వాహనాల నిరీక్షణ, కూలీల కొరత వంటి సమస్యలు తలెత్తకుండా సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకోవాలని తెలిపారు.ధాన్యం ఆరబెట్టేందుకు కొనుగోలు కేంద్రాల సమీపంలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఖాళీ స్థలాలను తహసీల్దార్లతో సమన్వయం చేసుకుని గుర్తించాలని కలెక్టర్ సూచించారు. అకాల వర్షాల నుంచి ధాన్యాన్ని రక్షించేందుకు వాతావరణ హెచ్చరికలను ఎప్పటికప్పుడు రైతులకు తెలియజేయాలని, ధాన్యం తడవకుండా అవసరమైన ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు.ధాన్యం కొనుగోళ్ల సందర్భంగా రైతులకు ఏవైనా సమస్యలు ఎదురైతే అధికారులు, కొనుగోలు కేంద్రాల ఇన్‌చార్జులు ఓపికగా, సానుకూలంగా వ్యవహరిస్తూ సమస్యలను శాంతియుతంగా పరిష్కరించాలని కలెక్టర్ సూచించారు. వ్యవసాయ అధికారులు, సిబ్బంది, కాంట్రాక్టర్లను ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్న ఆయన, వాటిని పరిష్కరించడంతో పాటు అవసరమైన మేరకు వ్యవసాయ యంత్రాలను అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు.సమావేశంలో జిల్లా పౌరసరఫరాల శాఖ డీఎం సుగుణబాయి, పౌరసరఫరాల అధికారి శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి చంద్రకళ, వ్యవసాయ, పౌరసరఫరాల శాఖల అధికారులు, సిబ్బంది, కొనుగోలు కేంద్రాల ఇన్‌చార్జులు తదితరులు పాల్గొన్నారు.

# అంగడిపేట్ ఆంజనేయస్వామి ఆలయం వద్ద ఘనంగా పులిహోర పంపిణీ

- అన్నదానం మహాదానం: కొమురవెల్లి ఆలయ డైరెక్టర్ నంగునూరి సత్యనారాయణ
- మెతుకు లక్ష్మి శ్రీనివాస్ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో కార్యక్రమం





**గజ్వేల్, సెప్టెంబర్ 29, నేటి శుభోదయ :**
సిద్దిపేట జిల్లా గజ్వేల్ పరిధిలోని అంగడిపేట్ ఆంజనేయ స్వామి ఆలయం వద్ద మంగళవారం పులిహోర పంపిణీ కార్యక్రమం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మెతుకు లక్ష్మి శ్రీనివాస్ (కొల్లూర్) కుటుంబ సభ్యుల సౌజన్యంతో ఈ అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కొమురవెల్లి ఆలయ డైరెక్టర్ నంగునూరి సత్యనారాయణ మాట్లాడుతూ సమాజంలో అన్నదానం అన్ని దానాల కన్నా మిన్న అయినదని కొనియాడారు. భక్తుల ఆకలి తీర్చడం గొప్ప పుణ్యకార్యమని, ప్రతి మంగళవారం దాతల ఉదార స్వభావంతో ఇక్కడ పులిహోర పంపిణీ కార్యక్రమాన్ని దిగ్విజయంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సత్కార్యానికి సహకరిస్తున్న ప్రతి ఒక్కరికీ ఆ దేవుడి అనుగ్రహం ఎల్లప్పుడూ ఉంటుందని ఆయన ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య మహాసభ సిద్దిపేట జిల్లా ఉపాధ్యక్షులు మల్యాల భద్రయ్య, గజ్వేల్ ప్రజ్ఞాపూర్ వాసవి క్లబ్ అధ్యక్షులు గంగిశెట్టి వెంకటేశం, సీనియర్ నాయకులు అత్తెల్లి లక్ష్మయ్య, శ్రీహరి, శంకరయ్య, సిరిపురం సత్యనారాయణ, కైలాస ప్రశాంత్, ఉమేష్, ప్రసాద్, గందే సంతోష్, వెంకటేశం, రాములు తదితర ఆర్యవైశ్య నాయకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సేవా సంకల్ప అభియాన్‌లో భాగంగా అంగన్వాడీ ఉత్సవాల నిర్వహణ





**నాగోల్, సెప్టెంబర్ 29, నేటి శుభోదయ :** నాగోల్ డివిజన్ పరిధిలోని ప్రభుత్వ హైస్కూల్‌లో ఉన్న అంగన్వాడీ కేంద్రంలో ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ గారి జన్మదినోత్సవాలను పురస్కరించుకుని సేవా సంకల్ప అభియాన్లో భాగంగా అంగన్వాడీ ఉత్సవాల కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా అంగన్వాడీ కేంద్రంలోని చిన్నారులతో కొంత సమయం గడిపి, వారి ఆరోగ్యం, విద్య, పోషణ మరియు సమగ్ర అభివృద్ధికి అంగన్వాడీ కేంద్రాలు అందిస్తున్న సేవలను అభినందించారు.చిన్నారుల భవిష్యత్తుకు బలమైన పునాది వేయడంలో అంగన్వాడీ టీచర్లు, ఆయాలు, తల్లిదండ్రుల పాత్ర ఎంతో కీలకమని కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు పేర్కొన్నారు.అంగన్వాడీ టీచర్లను ఘనంగా సన్మానించి, వారి సేవలను అభినందించారు. అలాగే చిన్నారుల తల్లిదండ్రులను కూడా సత్కరించి, పిల్లల పెంపకం మరియు ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. చిన్నారులకు ఉపయోగపడే విధంగా ప్లేట్లను బహుమతులుగా అందజేశారు.ఈ సందర్భంగా చిన్నారులతో కలిసి కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు, అంగన్వాడీ సిబ్బంది మరియు తల్లిదండ్రులు సేవా కార్యక్రమాల ప్రాధాన్యతను వివరించారు. సమాజంలోని ప్రతి వర్గానికి సేవ చేయాలనే సంకల్పంతో సేవా కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నాగోల్ డివిజన్ తాజా మాజీ కార్పొరేటర్ చింతల అరుణ సురేందర్ యాదవ్, పాల్గొన్నారు. వారితో పాటు నాగోల్ డివిజన్ బీజేపీ అధ్యక్షులు పంగ శ్రీకాంత్, జి.ఎస్.ఐ డివిజన్ అధ్యక్షులు ఎర్ర వినోద్ రెడ్డి,బీజేపీ సీనియర్ నాయకులు సిద్దాల ఐలయ్య గారు, పంగ శ్యామ్ కుమార్, పద్మారెడ్డి, కాలం శెట్టి లయ, సంజీవరెడ్డి, గీతారెడ్డి, సుర్వి రాజు, రావుల శ్రీనివాస్, కె. శ్రీనివాస్, సరస్వతి, ఉమారాణి, మునేందర్ తదితరులు పాల్గొన్నారు.

## పేదింటి ఆడపిల్లల పెళ్లిళ్లకు కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ భరోసా



**కేశంపేట, సెప్టెంబర్ 29, నేటి శుభోదయ :** కేశంపేట మండల కేంద్రం ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం నిర్దవెల్లి గ్రామానికి చెందిన లబ్ధిదారులకు మంజూరైన కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద కుటుంబాల్లో ఆడపిల్లల వివాహాలకు ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. వివాహ సమయంలో ఆర్థిక ఇబ్బందులను అధిగమించేందుకు ఈ పథకాలు భరోసా కల్పిస్తున్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సహాయాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నిర్దవెల్లి గ్రామ సర్పంచ్ భాస్కర్ గౌడ్, ఉపసర్పంచ్ సపూరా ఆమేర్, నాయకులు దిద్దెల జంగయ్య, ముత్యాలు, బద్క మల్లయ్య, అజహార్, బోద మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## అన్నపురెడ్డిపల్లిలో కలెక్టర్ అంకిత్ విస్తృత పర్యటన...





**భద్రాద్రి కొత్తగూడెం, సెప్టెంబర్ 29, నేటి శుభోదయ :** అన్నపురెడ్డిపల్లి మండలంలో జిల్లా కలెక్టర్ అంకిత్ మంగళవారం విస్తృతంగా పర్యటించారు. నరసాపురం గ్రామంలో కొనసాగుతున్న భూ రీ సర్వే పనులను పరిశీలించిన ఆయన, మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల, కళాశాల, తెలంగాణ గిరిజన సంక్షేమ బాలికల పాఠశాల, జూనియర్ కళాశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు.నరసాపురంలో భూ రీ సర్వే పురోగతిని పరిశీలించిన కలెక్టర్.. గ్రామ విస్తీర్ణం, సరిహద్దులు, పట్టా భూములు, సర్వే నంబర్ల వివరాలను రికార్డులతో సరిపోల్చి పరిశీలించారు. ప్రతి సర్వే నంబర్‌కు సంబంధించిన విస్తీర్ణం, హక్కుదారులు, సంబంధిత శాఖల వివరాలను రెవెన్యూ, సర్వే, అటవీ తదితర శాఖల రికార్డుల ఆధారంగా పక్కాగా నిర్ధారించాలని అధికారులను ఆదేశించారు. సుమారు 1,058 ఎకరాల విస్తీర్ణం, 13.5 కిలోమీటర్ల గ్రామ సరిహద్దు ఉన్నందున సరిహద్దుల నిర్ధారణలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.గ్రామసభలో వచ్చిన అభ్యంతరాలు, సూచనలను పరిశీలించాలని పేర్కొన్న కలెక్టర్.. అన్నదైవం ప్రాజెక్టుకు సంబంధించిన భూములు, సర్వే నంబర్ 47లోని దేవాదాయ భూముల వివరాలను రికార్డుల ఆధారంగా నిర్ధారించాలని ఆదేశించారు. సర్వే నంబర్ 39లోని సుమారు 264 ఎకరాల భూమికి సంబంధించి రెవెన్యూ, అటవీ శాఖల రికార్డులను పరిశీలించి వాస్తవ హక్కుదారులు, భూమి వివరాలను తేల్చాలని సూచించారు. సర్వే నంబర్ 40లోని సుమారు 200 ఎకరాల భూమికి సంబంధించిన దానం, దత్తత, హక్కులు, బదలాయింపు రికార్డులను పూర్తిస్థాయిలో పరిశీలించాలని ఆదేశించారు. రైతులు, ప్రజల నుంచి వచ్చిన అభ్యంతరాలను నిబంధనల ప్రకారం పరిష్కరిస్తూ పారదర్శకంగా రీ సర్వే పూర్తి చేయాలని తెలిపారు.అనంతరం గురుకుల విద్యాసంస్థలను తనిఖీ చేసిన కలెక్టర్.. వంటశాలలు, స్టోర్ రూములు, ఆహార పదార్థాల నాణ్యత, మెనూ అమలు, పారిశుధ్యం, విద్యార్థులకు కల్పిస్తున్న వసతులను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి మెనూ, అల్పాహారం, రాగిజావ, చికెన్, ఏకరూప దుస్తులు, పాఠ్యపుస్తకాలు, విద్యా సామగ్రి, వసతి సౌకర్యాలపై వివరాలు తెలుసుకున్నారు.బాలికల గురుకుల వంటశాలను పరిశీలించిన ఆయన.. బియ్యం, పప్పులు తదితర సరుకులను సురక్షితంగా, మూతపెట్టి నిల్వ చేయాలని ఆదేశించారు. వంటశాలలో బల్లులు, ఎలుకలు, ఇతర కీటకాలు ప్రవేశించకుండా పటిష్టమైన చర్యలు చేపట్టాలని, ఆహార కలుషితం, ఫుడ్ పాయిజనింగ్‌కు ఎట్టి పరిస్థితుల్లోనూ తావులేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు.విద్యార్థుల ఆరోగ్యం, భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, గురుకులాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు పిచ్చిమొక్కలు, చెత్తాచెదారం తొలగించాలని సూచించారు. పాములు, విషపూరిత జంతువులు ప్రవేశించకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. విద్యార్థుల మధ్య సమస్యలు, వివాదాలు తలెత్తితే వెంటనే స్పందించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని తెలిపారు.ప్రభుత్వం విద్యార్థుల కోసం అందిస్తున్న ప్రతి సౌకర్యం, పథకం పూర్తిస్థాయిలో వారికి అందేలా అధికారులు బాధ్యతతో పనిచేయాలని కలెక్టర్ అంకిత్ ఆదేశించారు. ఈ పర్యటనలో తహసీల్దార్ స్వర్ణ, గురుకులాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సర్వే సిబ్బంది, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## మహిళల భద్రతపై 'షీ టీమ్స్' అవగాహన కార్యక్రమం




**పినపాక, సెప్టెంబర్ 29, నేటి శుభోదయ :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక మండలం ఈ బయ్యారం క్రాస్ రోడ్డు వద్ద పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మహిళల రక్షణ, భద్రత లక్ష్యంగా 'షీ టీమ్స్' అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ బయ్యారం ఎస్ఐ సురేష్ ప్రత్యేక ఆదేశాల మేరకు హెడ్ కానిస్టేబుల్ రాంబాబు, ఇతర పోలీసు అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొని స్థానిక మహిళలు, యువతులు, విద్యార్థినులకు పలు కీలక అంశాలపై దిశా నిర్దేశం చేశారు.ఈ సందర్భంగా హెడ్ కానిస్టేబుల్ రాంబాబు మాట్లాడుతూ... సమాజంలో మహిళల భద్రతకు పోలీస్ శాఖ అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. రద్దీ ప్రాంతాలు, బస్టాండ్లు, కళాశాలలు, పనిచేసే ప్రదేశాలలో ఎదురయ్యే ఈవ్‌టీజింగ్, వేధింపులు, ఆన్‌లైన్ ఫ్రాడ్స్ పట్ల మహిళలు ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఏదైనా సమస్య లేదా వేధింపులు ఎదురైతే భయపడకుండా ధైర్యంగా ముందుకు వచ్చి ఫిర్యాదు చేయాలని పిలుపునిచ్చారు మహిళలు తమపై జరిగే అన్యాయాలను సహించకుండా, చట్టాలపై అవగాహన పెంచుకొని తమ హక్కులను కాపాడుకోవాలని అధికారులు కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు పోలీసు సిబ్బంది, స్థానిక మహిళలు, యువతులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## చిన్నారి తన్విత శ్రీ కుటుంబాన్ని పరామర్శించిన సేవాలాల్ సేన నాయకులు



**ఏన్కూర్, సెప్టెంబర్ 29, నేటి శుభోదయ :** జూలూరుపాడు మండల పరిధిలోని వినోభానగర్ పంచాయతీ సర్పంచ్ గంగావత్ నవీన్ నాయక్ కుమార్తె చిన్నారి తన్విత శ్రీ అకాల మరణం చెందడం తీరని లోటని సేవాలాల్ సేన నాయకులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు.ఈ విషయం తెలుసుకున్న సేవాలాల్ సేన జాతీయ వ్యవస్థాపక అధ్యక్షులు భూక్యా సంజీవ్ నాయక్ మరియు రాష్ట్ర అధ్యక్షులు బానోత్ హుసేన్ నాయక్ విషయం తెలుసుకున్న నవీన్ నాయక్ కుటుంబ సభ్యులతో మాట్లాడి, తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు . అనంతరం సేవాలాల్ సేన ఖమ్మం జిల్లా అధ్యక్షులు భూక్యా నరసింహ నాయక్ సేవాలాల్ సేన నాయకులతో కలిసి నవీన్ నాయక్ నివాసానికి వెళ్లి, చిన్నారి చిత్రపటానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... చిన్నారి తన్వి త శ్రీ అకాల మరణం తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. ఇలాంటి విషాద సమయంలో మాటలతో ఓదార్చడం కూడా కష్టమే ని, లోటును తీర్చటం ఎవరి వల్ల కాదని కుటుంబ సభ్యులు మనోధైర్యాన్ని కలిగి ఉండాలని , దుఃఖాన్ని తట్టుకునే ధైర్యాన్ని ఆ భగవంతుడు వారి కుటుంబానికి ప్రసాదించాలని, చిన్నారి ఆత్మకు శాంతి చేకూర్చాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు భుక్య శివ నాయక్, జిల్లా ప్రధాన కార్యదర్శి భుక్యా వినోద్ కుమార్ రాథోడ్, జిల్లా నాయకులు బానోత్ రమేష్ నాయక్, ఏన్కూర్ మండల అధ్యక్షులు గుగులోత్ మజీలాల్ నాయక్, ఏన్కూర్ వర్కింగ్ ప్రెసిడెంట్ వాంకుడోత్ గోపి నాయక్, రఘునాథపాలెం మండల అధ్యక్షులు మాళోత్ వెంకటి నాయక్, రఘునాథపాలెం ప్రధాన కార్యదర్శి బానోత్ నవీన్ నాయక్ తదితర ముఖ్య నాయకులు పాల్గొని కుటుంబానికి తమ సానుభూతి తెలిపారు.

## ఉచిత గుండె వైద్య శిబిరానికి విశేష స్పందన

- ఉచితంగా ఈసీజీ, 2D ఎకో, లిపిడ్ ప్రొఫైల్, బ్లడ్ షుగర్ పరీక్షలు




**ములుగు, సెప్టెంబర్ 29, నేటి శుభోదయ :** వరల్డ్ హార్ట్ డే సందర్భంగా గ్రామీణ, పట్టణ ప్రజల ఆరోగ్య సంరక్షణే ధ్యేయంగా సిద్దిపేట జిల్లా ములుగు మండలంలోని 1250 పడకల ఆర్.వి.యం చారిటబుల్ ట్రస్ట్ హాస్పిటల్‌లో ఉచిత గుండె వైద్య శిబిరాన్ని నిర్వహించారు. లాభాపేక్ష లేకుండా సేవాభావంతో నిర్వహించిన ఈ శిబిరానికి పరిసర ప్రాంతాల ప్రజలు, గుండె సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న రోగులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. శిబిరానికి వచ్చిన రోగులకు ఈసీజీ, 2D ఎకో, లిపిడ్ ప్రొఫైల్ (కొవ్వు పరీక్ష), ఆర్‌బీఎస్ (ర్యాండమ్ బ్లడ్ షుగర్) వంటి కీలక వైద్య పరీక్షలను పూర్తిగా ఉచితంగా నిర్వహించారు. పరీక్షల అనంతరం అవసరమైన రోగులకు ఉచితంగా మందులను కూడా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలువురు రోగులు మాట్లాడుతూ గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో నివసించే తమలాంటి వారికి ఈ ఉచిత వైద్య శిబిరం ఎంతో ఉపయోగకరంగా ఉందన్నారు. తమలో దాగి ఉన్న గుండె సంబంధిత సమస్యలను ప్రాథమిక దశలోనే గుర్తించేందుకు ఈ పరీక్షలు ఎంతగానో దోహదపడ్డాయని సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస్, ప్రముఖ గుండె వైద్యులు డాక్టర్ భాను కిరణ్ రెడ్డి, వైద్య నిపుణులు డాక్టర్ లక్ష్మీనారాయణ, ఆర్.వి.యం హాస్పిటల్ సీఈఓ దేవరకొండ శ్రీనివాసరావు, వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్లు, పెన్షన్ల అర్హతలపై విస్తృత ఇంటింటి సర్వే: ఎంఈఓ నాగయ్య



**పినపాక, సెప్టెంబర్ 29, నేటి శుభోదయ :** పినపాక మండలం పాత రెడ్డిపాలెం గ్రామంలో ప్రభుత్వం అందించే ఇందిరమ్మ ఇళ్లు వివిధ రకాల పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల అర్హతలను నిర్ణయించేందుకు విస్తృత ఇంటింటి సర్వేను మంగళవారం నిర్వహించారు. ఎంపీడీవో ఆదేశాల మేరకు పాత రెడ్డిపాలెం గ్రామంలో ఈ క్షేత్రస్థాయి పరిశీలన కార్యక్రమం వేగవంతంగా సాగుతోంది స్థానిక సర్పంచ్ నాగకుమారి, ఉప సర్పంచ్ శ్రీనివాసరెడ్డి, పంచాయతీ కార్యదర్శి కృష్ణవేణి ప్రత్యక్ష పర్యవేక్షణలో అధికారుల బృందం ప్రతి ఇంటికీ తిరుగుతూ దరఖాస్తుదారుల వివరాలను క్షుణ్ణంగా పరిశీలిస్తోంది. లబ్ధిదారుల ఆర్థిక స్థితిగతులు, నివాస పరిణామాలు, ఇతర అర్హత ప్రమాణాలను క్షేత్రస్థాయిలో సేకరించి ఆన్‌లైన్ డేటాతో సరిపోలుస్తున్నారు.ఈ సందర్భంగా ఎంఈఓ నాగయ్య మాట్లాడుతూ... అర్హులైన పేదలకు ప్రభుత్వ సంక్షేమ ఫలాలు దక్కాలనే లక్ష్యంతోనే ఈ పారదర్శక సర్వే చేపట్టినట్లు వెల్లడించారు.అర్హులైన లబ్ధిదారుల వివరాలను త్వరలోనే పూర్తి చేసి, నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

## ధోబీఘాట్ అభివృద్ధికి స్థల పరిశీలనషెడ్, బోర్, ప్రహరీ నిర్మాణానికి చర్యలు



**నేరెడ్‌మెట్, సెప్టెంబర్ 29, నేటి శుభోదయ :** మైనంపల్లి హనుమంత్ ఆదేశాల మేరకు నేరెడ్‌మెట్ డివిజన్‌లోని బాలాజీనగర్‌లో ధోబీఘాట్ కోసం కేటాయించిన స్థలాన్ని సోమవారం పరిశీలించారు. ధోబీఘాట్ అభివృద్ధిలో భాగంగా అక్కడ షెడ్, బోర్‌తో పాటు ప్రహరీ నిర్మాణం చేపట్టేందుకు డీఈ సుదర్శన్‌తో కలిసి స్థల పరిశీలన నిర్వహించారు.ఈ సందర్భంగా స్థానిక అవసరాలను పరిశీలించి, ప్రజలకు ఉపయోగకరంగా ఉండేలా మౌలిక వసతుల ఏర్పాటుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. ధోబీఘాట్‌కు కేటాయించిన స్థలంలో అవసరమైన నిర్మాణ పనులను త్వరితగతిన చేపట్టాలని సూచించారు.అనంతరం బాలాజీ కాలనీ ప్రవేశ ద్వారం వద్ద రైల్వే ట్రాక్ కింద పేరుకుపోయిన భారీగా చెత్తను పరిశీలించారు. చెత్త పేరుకుపోవడంతో స్థానికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అధికారుల దృష్టికి తీసుకెళ్లి, జేసీబీ సహాయంతో చెత్తను వెంటనే పూర్తిగా తొలగించాలని కోరారు. పరిసర ప్రాంతాల్లో పారిశుద్ధ్య పరిస్థితులను మెరుగుపరిచేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు.ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు కొత్తపల్లి ఉపేందర్‌రెడ్డి, ఎస్.ఆర్. ప్రసాద్, సాయి, కృష్ణ, శంకర్, లక్ష్మణ్, రెహమాన్, మోహన్, అంజయ్య, శ్రీనివాస్తో పాటు ధోబీఘాట్ సభ్యులు, కాలనీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## గురుకుల టైం టేబుల్ మార్చాలి.

- **గురుకుల విద్యాలయాల సమస్యలు పరిష్కరించాలి.**
- **టిఎస్ యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పారుపల్లి నాగేశ్వరరావు డిమాండ్.**



**ఏన్కూర్, సెప్టెంబర్ 29, నేటి శుభోదయ :** గురుకుల పాఠశాలల టైం టేబుల్‌ను మార్చాలని , గురుకుల విద్యాలయాల సమస్యలను పరిష్కరించాలని టిఎస్ యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పారుపల్లి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక గురుకుల పాఠశాలను సందర్శించి ఉపాధ్యాయులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... విద్యార్థులకు, ఉపాధ్యాయులకు ఇబ్బందికరంగా ఉన్న అశాస్త్రీయ టైం టేబుల్ మార్చాలని డిమాండ్ చేశారు. గురుకుల ఉపాధ్యాయులకు 010 హెడ్ ద్వారా వేతనాలు చెల్లించాలని, హెల్త్ కార్డులు ఇవ్వాలని, ఉపాధ్యాయులకు నైట్ డ్యూటీలు మినహాయించి కేర్ టేకర్లను నియమించాలని, ఉపాధ్యాయులను బోధనకే పరిమితం పరిమితం చేయాలని, హాస్టళ్లకు రెగ్యులర్ వార్డెన్లను నియమించాలని, జూనియర్ లెక్చరర్స్‌కు గెజిటెడ్ హోదా కల్పించాలని కోరారు. విద్యార్థులకు ఏకరూప దుస్తులు, అవసరమైన మెటీరియల్ కిట్ అందించాలని కోరారు. ఉపాధ్యాయులపై ఒత్తిడి తగ్గించి ప్రశాంత వాతావరణం లో పనిచేసే విధంగా, నాణ్యమైన విద్య బోధించే విధంగా, పాజిటివ్ ఫలితాలు రాబట్టే విధంగా అధికారులు కృషి చేయాలని కోరారు. గురుకుల ఉపాధ్యాయులకు డిఏ బకాయిలను చెల్లించాలని, గురుకుల ఉపాధ్యాయులకు పారిటీ స్కేల్స్ ఇవ్వాలని, సిపిఎస్ రద్దు చేసి ఓపిఎస్ అమలు చేయాలని కోరారు. అనేక గురుకుల పాఠశాలలు అద్దె భవనాల్లో నడుస్తున్నందున సొంత భవనాలు నిర్మించాలని, అన్ని సౌకర్యాలు కల్పించి విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాంచంద్, పుల్లయ్య , రాఘవరావు, శంకర్రావు ,నరేష్ ,చంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## పితృపక్షాల సందర్భంగా ఘనంగా అన్నదానం

- **కీర్తిశేషులు గోలి వెంకటేశం జ్ఞాపకార్థం కార్యక్రమం**
- **పాల్గొన్న కొమురవెల్లి ఆలయ డైరెక్టర్ నంగునూరు సత్యనారాయణ**



**గజ్వేల్, సెప్టెంబర్ 29, నేటి శుభోదయ :** సిద్దిపేట జిల్లా గజ్వేల్ పరిధిలోని అంగడిపేట ఆంజనేయస్వామి ఆలయం వద్ద కీర్తిశేషులు గోలి వెంకటేశం జ్ఞాపకార్థం అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. పితృపక్షాల సందర్భాన్ని పురస్కరించుకొని 2వ వార్డు కౌన్సిలర్ గోలి మమత సంతోష్ మరియు వారి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ అన్నదాన కార్యక్రమంలో కొమురవెల్లి ఆలయ డైరెక్టర్ నంగునూరు సత్యనారాయణ, ఇటిక్యాల మాజీ సర్పంచ్ రావికంటి చంద్రశేఖర్, అయ్యప్ప దేవాలయం కమిటీ ప్రధాన కార్యదర్శి అయిత సత్యనారాయణ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్నదానం అన్ని దానాల్లోకెల్లా మహాదానమని కొనియాడారు. పితృపక్షాల పుణ్యదినాలను పురస్కరించుకొని ప్రతిరోజు అంగడిపేట ఆంజనేయస్వామి ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమాలు జరుగుతున్నాయని తెలిపారు. అందులో భాగంగానే కీర్తిశేషులు గోలి వెంకటేశం జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు ఈ రోజు అన్నదానాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు.ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు, గోలి మమతా సంతోష్ కుటుంబ సభ్యులు, స్థానిక ప్రముఖులు మరియు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ కొరకు స్థల పరిశీలన



**నిజామాబాద్, సెప్టెంబర్ 29, నేటి శుభోదయ :** అర్బన్ నియోజకవర్గానికి యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాల మంజూరు చేయాలని ప్రభుత్వానికి అనేకసార్లు కోరడం జరిగిందని అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ తెలిపారు.మంగళవారం గుండారం శివారులో స్థలాన్ని ఇచ్చారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ....పాఠశాలకు అవసరమైన 25 ఎకరాల స్థలం అర్బన్‌లో కష్టతరమవుతుందన్నారు.ఈ నేపథ్యంలో నగరానికి దగ్గరగా ఉన్న గుండారంలో పరిశీలించడం జరిగిందన్నారు.అలాగే నగరంలోనూ మరో స్థలాన్ని కూడా పరిశీలిస్తున్నామన్నారు.నియోజకవర్గం విద్యార్థులకు ఇంటిగ్రేటెడ్ స్కూల్ అందుబాటులోకి తీసుకురావడమే తన లక్ష్యమని పేర్కొన్నారు.ఇప్పటికే మొదటి దశలో జిల్లాలోని అన్ని నియోజక వర్గాలకు మంజూరయ్యాయన్నారు.రెండో దశలో అర్బన్‌లోనూ మంజూరయ్యేలా కృషి చేస్తున్నట్లు స్పష్టం చేశారు.ఎమ్మెల్యే వెంట రూరల్ తహసీల్దార్ వినయ్ సాగర్,టీఎస్ఈడబ్ల్యూఐసీ ఈఈ రవీందర్,బీజేపీ కార్పొరేటర్లు నాగోల్ల లక్ష్మీనారాయణ,జ్యోతి మురళి,ప్రసూన శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అన్నదాతలను నిలువునా ముంచిన కాంగ్రెస్ ప్రభుత్వం.

- **రుణమాఫీ,బోనస్,రైతు భరోసా హామీలను గాలికొదిలేసిన రేవంత్ సర్కార్.**
- **జిల్లా అధ్యక్షులు దినేష్ పటేల్ కులాచారి**





**నిజామాబాద్, సెప్టెంబర్ 29, నేటి శుభోదయ :** తెలంగాణ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని బీజేపీ జిల్లా అధ్యక్షులు దినేష్ పటేల్ కులాచారి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.రైతు హామీలను తక్షణమే నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ బీజేపీ కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మూడవ రోజు సైకిల్ యాత్రలో ఆయన పాల్గొన్నారు.ఈ సందర్భంగా దినేష్ పటేల్ కులాచారి మాట్లాడుతూ....రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఎన్నికల సమయంలో అన్నదాతలకు ఇచ్చిన ఏ ఒక్క హామీని కూడా చిత్తశుద్ధితో అమలు చేయలేదని మండిపడ్డారు.రైతులందరికీ ఏకకాలంలో ₹2 లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పి అర్ధాంతరంగా చేతులెత్తేశారని,అన్ని రకాల వరి పంటలకు బోనస్ ఇస్తామని నమ్మించి అన్నదాతలను నిలువునా మోసం చేశారన్నారు.రైతు భరోసా పథకం కింద ప్రతి ఎకరానికి విడతకు ₹7,500 చొప్పున ఏడాదికి ₹15,000 ఇస్తామని ఎన్నికల్లో గొప్పలు చెప్పి,అధికారంలోకి వచ్చాక నిధులు విడుదల చేయకుండా కాలయాపన చేస్తోందని దుయ్యబట్టారు.దీంతో ప్రభుత్వం నుంచి ప్రతి రైతుకు దాదాపు ₹1,50,000 వరకు రైతు భరోసా బకాయిలు రావాల్సి ఉందని,ఇంత పెద్ద మొత్తంలో అన్నదాతలకు బకాయి పడి మోసం చేయడం సిగ్గుచేటని ఆయన పేర్కొన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే స్పందించి రైతులకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేయాలని,లేనిపక్షంలో భారతీయ జనతా పార్టీ కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ప్రజా పోరాటాలు చేపడతామని హెచ్చరించారు.ఇదే క్రమంలో కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న నిరసనలపై స్పందిస్తూ....ఓట్ల తొలగింపు పేరుతో కాంగ్రెస్ నాయకులు చేస్తున్న ఆరోపణలు,ధర్నాలు కేవలం ప్రజలను తప్పుదోవ పట్టించడానికేనని స్పష్టం చేశారు.ఏ ఒక్క అర్హులైన పౌరుడి ఓటును తొలగించడం లేదని,కాంగ్రెస్ చేస్తున్న ప్రచారంలో ఎలాంటి వాస్తవం లేదని కొట్టిపారేశారు.ఈ సైకిల్ యాత్రలో కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు తిరుపతిరెడ్డి,పద్మా రెడ్డి,శంకర్ రెడ్డి,వెల్మ గంగారెడ్డి,హరీష్ రెడ్డి,చింత శ్రీనివాస్ రెడ్డి,ఆనంద్,గంగాధర్ యాదవ్,దిల్ ధర్,మధు తదితరులు పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి




**ఏన్కూర్, సెప్టెంబర్ 29, నేటి శుభోదయ :** ఏన్కూరు మండలం పరిధిలో గ్రామాల్లో ప్రజలకు ఆరోగ్య సేవలు సక్రమంగా అందించడంతో పాటు ప్రస్తుత వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండేందుకు ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశా కార్యకర్తలతో సమన్వయ సమావేశం నిర్వహించారు. డాక్టర్ బాలకృష్ణ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఎంపీడీవో పల్లి భాగ్య శ్రీ మాట్లాడుతూ..... గ్రామాల్లో ఆరోగ్య పరిస్థితులపై నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని, ప్రజలకు ప్రభుత్వ ఆరోగ్య సేవలపై అవగాహన కల్పించాలని సూచించారు. డాక్టర్ బాలకృష్ణ మాట్లాడుతూ.... వర్షాలు, వాతావరణ మార్పుల కారణంగా సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ఆశా కార్యకర్తలు గ్రామాల్లో ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. జ్వరం, దగ్గు, జలుబు తదితర లక్షణాలు ఉన్నవారిని గుర్తించి సకాలంలో వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పరిసరాల పరిశుభ్రత, దోమల నివారణ, స్వచ్ఛమైన తాగునీటి వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. పంచాయతీ కార్యదర్శులతో సమన్వయం చేసుకుంటూ ఆరోగ్య సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో షేక్ ఖాదర్ మియా, పంచాయతీ కార్యదర్శి కృష్ణ, ఆశా కార్యకర్తలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సిరికొండ గ్రామ పంచాయతీ సర్పంచ్ పాలకవర్గం ఆధ్వర్యంలో ఎమ్మెల్యే రేకులపల్లి భూపతిరెడ్డికి సమస్యల వినతిపత్రం సమర్పణ

**నిజామాబాద్ రూరల్ సిరికొండ, సెప్టెంబర్ 29, నేటి శుభోదయ :** నిజామాబాద్ రూరల్ సిరికొండ గ్రామ పంచాయతీ సర్పంచ్ మల్లెల సాయిచరణ్, ఆధ్వర్యంలో గ్రామ పాలకవర్గ సభ్యులు నిజామాబాద్ రూరల్ శాసనసభ్యులు రేకులపల్లి భూపతిరెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిసి, గ్రామాభివృద్ధికి సంబంధించి పలు కీలక సమస్యలపై వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా గ్రామంలోని ప్రధాన సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు సిరికొండ గ్రామానికి అదనంగా ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని, పెండింగ్‌లో ఉన్న ఇందిరమ్మ ప్లాట్లను తక్షణమే అర్హులకు పంపిణీ చేసి, వాటి నిర్మాణాలకు నిధులు మంజూరు చేయాలని గ్రామంలో శాశ్వత తాగునీటి ఎద్దడి నివారణకు 1,00,000 లీటర్ల (100 KL) మరియు 90,000 లీటర్ల (90 KL) సామర్థ్యం గల రెండు ఓవర్ హెడ్ ట్యాంకుల నిర్మాణాలకు అనుమతులు మంజూరు చేయాలని పోచమ్మ గుడి నుండి దొండ్లవాగు వరకు రోడ్డుకు ఇరువైపులా సిమెంట్ డ్రైనేజీ కాలువల నిర్మాణం చేపట్టాలని ట్రాఫిక్ సమస్య నివారణకు సిరికొండ బైపాస్ రోడ్డు నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని మండల మరియు గ్రామ ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు 30 పడకల ఆసుపత్రిని మంజూరు చేయడంతో పాటు, ఖాళీగా ఉన్న స్టాఫ్ నర్స్ మరియు ఇతర వైద్య సిబ్బంది పోస్టులను వెంటనే భర్తీ చేయాలని ఎస్సీ కాలనీలోని చిన్నారులు, గర్భిణులు, బాలింతల సంక్షేమం మరియు ఆరోగ్య సేవల కోసం నూతన అంగన్‌వాడీ భవనాన్ని మంజూరు చేయాలని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల



సౌకర్యార్థం ప్రీ–ప్రైమరీ పాఠశాలకు అదనపు తరగతి గదులను మంజూరు చేయాలని గ్రామంలో ఇండ్ల మధ్య గుండా వెళ్తున్న ప్రమాదకరమైన 33 కేవీ విద్యుత్ లైన్‌ను ఊరి బయటకు తరలించేలా సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేయాలని గత 20 సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న సర్వే నంబర్ 532 భూసమస్యను పరిష్కరించి, నిరుపేదలకు పంపిణీ చేయాలని కోరారు గ్రామ పాలకవర్గం విన్నవించిన సమస్యలపై ఎమ్మెల్యే రేకులపల్లి భూపతిరెడ్డి సానుకూలంగా స్పందించారు. గ్రామాభివృద్ధికి తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని, ఈ సమస్యలన్నింటినీ ప్రాధాన్యతా క్రమంలో దశలవారీగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ గ్యామ శోభన్ వార్డు మెంబర్లు అల్లిపురం కిషన్, ఇందూరి అమృత, చిట్యాల రంజిత్, ఎరుకల ఎల్లయ్య, కొలిపాక అశ్విని, కానపురం సునీత, బాధవత్ తిరుపతి, బోల్గం శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# నిజామాబాద్ రైల్వే స్టేషన్,రైల్వే కాలనీల్లో నీటి నాణ్యత తనిఖీలను ముమ్మరం చేసిన దక్షిణ మధ్య రైల్వే

**నిజామాబాద్, సెప్టెంబర్ 29, నేటి శుభోదయ :** 21 ఆగస్టు నుండి 28 సెప్టెంబర్ 2026 వరకు నిజామాబాద్ రైల్వే స్టేషన్,రైల్వే కాలనీల్లో సేకరించిన 531 నీటి నమూనాలు తాగునీటికి అనుకూలంగా ఉన్నట్లు నిర్ధారణ.దక్షిణ మధ్య రైల్వే (SCR) పరిధిలో ప్రయాణికులు,రైల్వే వ్యవస్థకు సురక్షితమైన,పరిశుభ్రమైన తాగునీటిని అందించేందుకు నీటి నాణ్యతను నిరంతరం పర్యవేక్షిస్తోంది.ఇందులో భాగంగా హైదరాబాద్ డివిజన్ పరిధిలోని నిజామాబాద్ రైల్వే స్టేషన్,అనుబంధ రైల్వే కాలనీల్లో తనిఖీలు,నిర్వహణ చర్యలు,నీటి నాణ్యత పర్యవేక్షణను మరింత బలోపేతం చేసింది.ఈ తనిఖీల్లో భూగర్భ జల వనరులు,మున్సిపల్ నీటి సరఫరా,నీటి నిల్వ సదుపాయాలు,క్లోరినేషన్ ప్రక్రియలు,నీటి పంపిణీ వ్యవస్థలను పరిశీలిస్తున్నారు.నీటి నాణ్యతపై మరింత సమర్థవంతమైన పర్యవేక్షణ కోసం,అవశేష క్లోరిన్ స్థాయిలను ప్రతిరోజూ తనిఖీ చేయడంతో పాటు,నీటిలో ఈ.కోలీ (E.coli) వంటి కలుషితాల ఉనికిని గుర్తించేందుకు క్రమం తప్పకుండా బ్యాక్టీరియాలాజికల్ పరీక్షలు నిర్వహిస్తున్నారు.21 ఆగస్టు నుండి సెప్టెంబర్ 28, 2026 వరకు నిజామాబాద్ రైల్వే స్టేషన్,రైల్వే కాలనీల్లో సేకరించిన నీటి నమూనాలను పరీక్షించగా,అన్ని ప్రమాణాల ప్రకారం నీటి నాణ్యత సంతృప్తికరంగా ఉన్నట్లు నిర్ధారించారు.

**పర్యవేక్షణలో ముఖ్యమైన అంశాలు:**

★ రైల్వే స్టేషన్,రైల్వే కాలనీల్లో తాగునీటికి సంబంధించిన 531 నీటి నమూనాలను అవశేష క్లోరిన్ స్థాయిల కోసం పరీక్షించగా,అన్ని నమూనాలు సంతృప్తికరంగా ఉన్నట్లు నిర్ధారణ అయింది.ఒక్క నమూనా కూడా వినియోగానికి అనర్హంగా గుర్తించబడలేదు.

★ 134 తాగునీటి నమూనాలను బ్యాక్టీరియాలాజికల్ పరీక్షలు నిర్వహించగా,ఏ ఒక్క నమూనా కూడా అసురక్షితంగా గుర్తించబడలేదు.అలాగే,ఏ నమూనా కూడా ఈ.కోలీ (E.coli)



పాజిటివ్‌గా గుర్తించబడలేదు.

★ ఇంజినీరింగ్,వైద్య విభాగాల అధికారులు సంయుక్తంగా తాగునీటి వనరులు,గ్రౌండ్ లెవల్ రిజర్వాయర్లు (GLRs),హై లెవల్ రిజర్వాయర్లు (HLRs) ను తనిఖీ చేశారు.

దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ,నీటి నాణ్యత పై నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తూ,తాగునీరు ఎటువంటి కలుషితానికి గురికాకుండా ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.రైల్వే స్టేషన్లలో సరఫరా చేసే తాగునీరు ఇండియన్ రైల్వేస్ మెడికల్ మాన్యువల్ లో నిర్దేశించిన ప్రమాణాలకు అనుగుణంగా ఉండాలని ఆయన స్పష్టం చేశారు.అలాగే,తరచుగా పరీక్షలు,పర్యవేక్షణ చేపట్టడం ద్వారా జోన్ వ్యాప్తంగా ఇదే స్థాయి అప్రమత్తతను కొనసాగించాలని అధికారులు,పర్యవేక్షకులను ఆయన ఆదేశించారు.ప్రయాణికులు,రైల్వే కాలనీ నివాసితులందరికీ శుభ్రమైన,సురక్షితమైన,స్వచ్ఛమైన తాగునీరు నిరంతరం అందుబాటులో ఉండేలా చూడాలని సూచించారు.

# బధిరులకు అండగా ఉంటా

● **అంతర్జాతీయ సంకేత భాషా దినోత్సవంలో అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్....**

**నిజామాబాద్, సెప్టెంబర్ 29, నేటి శుభోదయ :** జిల్లాలోని బదిరులకు తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ గుప్తా తెలిపారు.డెఫ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం నగరంలోని న్యూ అంబేద్కర్ భవన్ లో అంతర్జాతీయ సంకేత భాషా దినోత్సవం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ....బధిరులకు మేథోశక్తి ఎంతో ఉంటుందన్నారు.సామాన్యులకు




దీటుగా పోటీ ప్రపంచంలో ముందుకు వెళ్ళడం అభినందనీయమన్నారు.బదిరులుగా ఉంటూ ప్రభుత్వ ఉద్యోగులుగా స్థిరపడటం సంతోషంగా ఉందన్నారు.లోపాన్ని పట్టించుకోకుండా తమ పని



తాము చేసుకుంటూ పోవాలని విజయం వరిస్తుందన్నారు.కార్యక్రమంలో డెఫ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు ఉదయ్ కుమార్,ప్రధాన కార్యదర్శి మహేష్,19వ డివిజన్ కార్పొరేటర్ నాగోల్ల లక్ష్మీనారాయణ,జ్యోతి మురళి తదితరులు పాల్గొన్నారు.

# నూతన క్రీడా భవన నిర్మాణ పనులను పరిశీలించిన తె.యూ.ఉపకులపతి




**నిజామాబాద్, సెప్టెంబర్ 29, నేటి శుభోదయ :** తెలంగాణ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ టి.యాదగిరి రావు యూనివర్సిటీ నూతన క్రీడా భవన నిర్మాణ పనులను రిజిస్ట్రార్ ప్రొఫెసర్ యం.యాదగిరి తో కలిసి పరిశీలించారు. నాణ్యత లో రాజీపడకూడదని,పనులను త్వరిత్తగతిన పూర్తి చేయాలని ఆయన సంబందిత అధికారులను ఆదేశించారు.ఈ పరిశీలనలో VC తో పాటు EC మెంబర్ ప్రొఫెసర్ ఆంజనేయులు,స్పోర్ట్స్ డైరెక్టర్ డాక్టర్ బాలకిషన్,ఇంజనీర్ వినోద్ లు పాల్గొన్నారు.

# బస్తి దావకాన,టీహబ్ లను ఆకస్మిక తనిఖీ చేసిన డిఎంహెచ్వో



**నిజామాబాద్ , సెప్టెంబర్ 29, నేటి శుభోదయ :** జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా.బి.రాజశ్రీ నిజామాబాద్ పట్టణంలోని మిర్చి కాంపౌండ్ నందు గల బస్తి దావకాన,ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ఆవరణలోని టార్గెటివ్ కేర్,తెలంగాణ డయాగ్నస్టిక్ హబ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా బస్తి దావకాన యందు ఔషధారణ స్టాకు రిజిస్టర్,ఔషధాల పంపిణీ రికార్డులను,ఎన్సిడి స్క్రీనింగ్ రికార్డులను, ఫాలోఅప్ రిజిస్టర్,హాజరు పట్టిక,రిఫరల్ సర్వీసెస్ రిజిస్టర్ లను పరిశీలించారు.ఈ సందర్భంగా ఔషధారణ స్టాక్ రిజిస్టర్ పంపిణీ రిజిస్టర్లు ఇతర రికార్డులు అసంపూర్తిగా ఉండరాదని జీవనశైలి వ్యాధుల నిర్ధారణ పరీక్షలు 100% పూర్తిచేయాలని,అత్యవసర మందులు అందుబాటులో ఉంచాలని,దావఖాన కి వచ్చే రోగులతో మర్యాదగా గౌరవంగా ప్రవర్తించాలన్నారు.ప్రభుత్వ సాధారణ ఆస్పత్రి ఆవరణలోని పాలియేటివ్ కేర్ సెంటర్ ను సందర్శించి నొప్పి నివారణ మందులు అందుబాటులో ఉండాలని,నర్సింగ్ కేర్,స్టాప్ డ్యూటీ రోస్టర్ అనుగుణంగా విధులు నిర్వహించాలని,సమయానికి విదులకు హాజరు కావాలన్నారు.అదేవిధంగా తెలంగాణ డయాగ్నస్టిక్ హబ్ షాంపుల్స్ సేకరణ పెంచాలని,ఏజెంట్స్ స్టాక్ పొజిషన్ ఎప్పటికప్పుడు నమోదు చేయాలని,ఔషదాలని అందుబాటులో ఉంచాలని,రిపోర్టులను సమయానికి రోగులకు చేరవేయాలని సిబ్బందికి తెలియజేశారు.తనిఖీ సమయంలో బస్తీ దావకాన సిబ్బంది,పాలియేటివ్ కేర్ నందు డాక్టర్ చైతన్య,టీ హబ్ వైద్యురాలు డాక్టర్ దివ్య వైద్య సిబ్బంది ఉన్నారు.

# కాంగ్రెస్ పార్టీ రైతు వ్యతిరేకి: ఇది కాలం తెచ్చిన కరువు కాదు కాంగ్రెస్ పార్టీ తెచ్చిన కరువు: మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ కుమార్.



**గుర్రంపోడు, సెప్టెంబర్ 29, నేటి శుభోదయ :** కాంగ్రెస్ పార్టీ రైతు వ్యతిరేకి అని ఇది కాలం తెచ్చిన కరువు కాదు కాంగ్రెస్ పార్టీ తెచ్చిన కరువు అని నాగార్జునసాగర్ మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ కుమార్ అన్నారు. మంగళవారం ఆయన గుర్రంపోడు మండలంలోని కే వెంకటాపురం గ్రామంలో బలు గూరి లింగయ్య,మంటిపల్లి లింగయ్య, ఎరుకల బిక్షం రైతుల ఎండిపోయిన పంటలను పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాగార్జునసాగర్ జలాశయంలో పుష్కలంగా నీరు ఉన్నప్పటికీ ఎడమ కాలువకు సాగునీరు విడుదల చేయడంలో ప్రభుత్వం విఫలమైందని అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో నీటిని పొదుపుగా వాడేందుకు సాగర్ ఎడమ కాలువకు వారబందీ ప్రకారం నీటిని విడుదల చేసేవాళ్ళమని తెలిపారు. శ్రీశైలం నుండి పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ ద్వారా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జలచౌర్యానికి పాల్పడిందని అన్నారు. రైతులు ఆరుగాలం కష్టపడి వేలకు వేలు పెట్టుబడి పెట్టి వేసిన పంటలు ఎండిపోతున్నాయని ప్రభుత్వం మాత్రం సాగు నీరు ఇచ్చి పంటలను కాపాడకుండా చోద్యం చూస్తూ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని నాగార్జునసాగర్ నియోజకవర్గంలో గుంట స్థలం ఎండిపోయినా అందుకు రాష్ట్ర ప్రభుత్వం బాధ్యత వహించాలని తెలియజేశారు. రైతుల ఆగ్రహానికి కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం కాలగర్భంలో కలిసిపోక తప్పదని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ బీ ఆర్ఎస్ మండల అధ్యక్షులు నాగులవంచ తిరుపతిరావు, మాజీ వైస్ ఎంపీపీ వజ్జ రామేశ్వరి ధనుంజయ, సీనియర్ నాయకులు సామల బొజ్జయ్య, సర్పంచులు జక్కల భాస్కర్, సింగం బాలకృష్ణ, అందుగుల శ్రీను,చెవ్వ రమేష్, సల్వాది సరస్వతి నగేష్, మాజీ సర్పంచులు పోలే రామచంద్రం,కామల్ల నరసింహ, మండల నాయకులు కామల్ల రాములు,సింగం ప్రవీణ్ కుమార్, నాగులవంచ నాగేశ్వర రావు,దోటి గణేష్, షేక్ సిరాజ్,చింతరెడ్డి రవీందర్ రెడ్డి,తిరందాసు అంజయ్య,మర్ల రమేష్, వనమాల మహేందర్, కుందారపు యాదగిరి, భూపతి రాజు,దోటి అనిల్,పోలే అశోక్ మరియు రైతులు పాల్గొన్నారు.

# డాక్టరేట్ అందుకున్న జవ్వాది మౌనిక.

- ఏన్కూరు ఆడబిడ్డకు అరుదైన గౌరవం.




**ఏన్కూర్, సెప్టెంబర్ 29, నేటి శుభోదయ :** విద్యా రంగంలో ఏన్కూర్ ప్రాంతం మరోసారి తన ప్రత్యేకతను చాటుకుంది. మండల కేంద్రానికి చెందిన జవ్వాది మౌనిక ప్రఖ్యాత కాకతీయ యూనివర్సిటీ నుంచి జంతుశాస్త్రంలో ప్రతిష్టాత్మక డాక్టరేట్ డిగ్రీని అందుకున్నారు.కాకతీయ యూనివర్సిటీ జంతుశాస్త్ర విభాగానికి చెందిన ప్రొఫెసర్ గంగుపంతుల షమిత పర్యవేక్షణలో మౌనిక ఈ పరిశోధన పూర్తి చేశారు."ప్రోబయోటిక్స్ , బాక్టీరియోజెనిక్ సిల్వర్ నానోపార్టికల్స్ సంశ్లేషణ కొరకు టాసర్ పట్టుపురుగు యొక్క గట్ మైక్రోబయోటా, యాంటీమైక్రోబయల్ చర్య మరియు పట్టుగూడు నాణ్యతను మెరుగుపరచడంలో దాని పాత్ర" అనే ఆధునిక అంశంపై ఆమె తన పరిశోధన గ్రంథాన్ని సమర్పించారు. ఈ రీసెర్చ్‌తో పాటు ఆమెకు పేటెంట్ గ్రాంట్ కూడా లభించడం విశేషం. ఈ మేరకు మౌనికకు డాక్టరేట్ డిగ్రీ ప్రదానం చేసినట్లు కేయూ ఎగ్జామినేషన్ కంట్రోలర్ ప్రొఫెసర్ కట్ల రాజేందర్ అధికారికంగా తెలిపారు.ఏన్కూర్ గ్రామ నివాసులు జవ్వాది శివయ్య, పద్మ దంపతుల కుమార్తె అయిన మౌనిక చిన్ననాటి నుంచే చదువులో రాణించారు. ప్రస్తుతం ఆమె ఖమ్మంలోని కవిత మెమోరియల్ డిగ్రీ & పీజీ కళాశాలలో లెక్చరర్‌గా బాధ్యతలు నిర్వహిస్తూనే ఈ పరిశోధనను విజయవంతంగా పూర్తి చేశారు.ఒక గ్రామీణ ప్రాంతం నుంచి వచ్చి సైన్స్ రంగంలో పేటెంట్ సాధించడంతో పాటు డాక్టరేట్ అందుకోవడం పట్ల కాకతీయ యూనివర్సిటీ ఆచార్యులు, తోటి పరిశోధకులు, ఖమ్మం జిల్లా విద్యావేత్తలు హర్షం వ్యక్తం చేశారు. అలాగే ఏన్కూర్ గ్రామ ప్రజలు, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు డా. జవ్వాది మౌనికకు ప్రత్యేక అభినందనలు తెలిపి, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.

# మునిగడప గౌడ సంఘం అధ్యక్షుడిగా కొలిచెల్మ నరేష్ గౌడ్

- ఏకగ్రీవంగా నూతన గ్రామ కమిటీ ఎన్నిక



**జగదేవపూర్, సెప్టెంబర్ 29, నేటి శుభోదయ :** సిద్దిపేట జిల్లా జగదేవపూర్ మండలంలోని మునిగడప గ్రామ గౌడ సంఘం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మంగళవారం గ్రామంలో గౌడ సంఘం సభ్యులు ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో సంఘం అభివృద్ధి, భవిష్యత్తు కార్యాచరణపై చర్చించి, నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ప్రకటించారు. గౌడ సంఘం గ్రామ కమిటీ అధ్యక్షుడిగా కొలిచెల్మ నరేష్ గౌడ్, ఉపాధ్యక్షులుగా కారింగుల భాను ప్రకాష్ గౌడ్, రంగు బాలయ్య గౌడ్, కోశాధికారిగా పబ్బ రవి ఎన్నికయ్యారు. సంఘం సలహాదారులుగా కుంటి బొక్కల నరసయ్య, కేశవులు, పబ్బ హరి, కారింగుల వెంకటేష్, కారింగుల రాజు, పబ్బ శివరాములు, కారింగుల నర్సింలులను నియమించారు. అలాగే ఇదే సమావేశంలో గౌడ సంఘం యూత్ కమిటీని కూడా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. యూత్ విభాగం అధ్యక్షుడిగా కొలుగూరి దేవేందర్ గౌడ్, ఉపాధ్యక్షుడిగా కారింగుల శివ ప్రసాద్, సభ్యుడిగా కొలుగూరి వెంకటేష్ గౌడ్ నియామకమయ్యారు.ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన అధ్యక్ష, కార్యవర్గ సభ్యులకు మునిగడప గ్రామ గౌడ సంఘం సభ్యులు, యువకులు ఘనంగా సన్మానం చేసి, శుభాకాంక్షలు తెలిపారు. సంఘం బలోపేతానికి, సభ్యుల సంక్షేమానికి తమ వంతు కృషి చేస్తామని ఈ సందర్భంగా నూతన కమిటీ ప్రతినిధులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం సభ్యులు, కులబాంధవులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# గుర్రంపోడు కస్తూర్బా గాంధీ విద్యాలయాన్ని సందర్శించిన ఎక్సైజ్ సీ.ఐ ఏడుకొండలు.



**గుర్రంపోడు, సెప్టెంబర్ 29, నేటి శుభోదయ :** గుర్రంపోడు మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని మంగళవారం ద మిషన్ వ్యవస్థాపకులు, కొన్ని వేల మంది నిరుద్యోగుల జీవితాలలో వెలుగు నింపిన ఎక్సైజ్ సీ.ఐ ఏడుకొండలు సందర్శించారు.ఈ సందర్భంగా ఆయన పాఠశాలలోని విద్యార్థులకు చదువు ప్రాముఖ్యత,క్రమశిక్షణ,ఉన్నత శిఖరాలను చేరుకోవడానికి ఏ విధంగా శ్రమించాలి, తల్లిదండ్రుల శ్రమ మరియు రాజ్యాంగం పట్ల నిబద్ధత గురించి అవగాహన కలిగించారు.కస్తూర్బా గాంధీ విద్యాలయం బాలికలకు విజ్ఞానాన్ని అందించే మంచి విషయాలు చెప్పడం తనకు ఎంతో సంతోషాన్ని కలిగించిందని ఆయన పేర్కొన్నారు. విద్యార్థులు పాఠశాల సిబ్బంది ఎక్సైజ్ సీ.ఐ ఏడుకొండలు సార్ కు కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ ఆంజనేయులు, పాఠశాల ప్రత్యేక అధికారిణి డి.విజయశ్రీ, బోధనా సిబ్బంది క్రాంతి,కావ్య, బోధనేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వికసిత్ భారత్ 2047 మన లక్ష్యం

- నాగర్‌కర్నూల్ జిల్లా కన్వీనర్ చేపూరి తేజస్విని
- కల్వకుర్తిలో ఘనంగా వక్తృత్వ, చిత్రలేఖనం పోటీలు
- కల్వకుర్తి మున్సిపాలిటీ అధ్యక్షులు గన్నోజు బాబిదేవ్





**కల్వకుర్తి , సెప్టెంబర్ 29, నేటి శుభోదయ :** భారతదేశాన్ని 2047 నాటికి పూర్తిస్థాయిలో అభివృద్ధి చెందిన దేశంగా మార్చడమే లక్ష్యంగా ప్రధాని నరేంద్ర మోడీ ముందుకు సాగుతున్నారని, ఈ స్వప్న సాకారంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని నాగర్‌కర్నూల్ జిల్లా వక్తృత్వ, చిత్రలేఖనం పోటీల కన్వీనర్ చేపూరి తేజస్విని పిలుపునిచ్చారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సుపరిపాలన అందిస్తున్న సందర్భంగా దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న 'సేవా సంకల్ప అభియాన్' కార్యక్రమంలో భాగంగా మంగళవారం కల్వకుర్తి పట్టణంలోని శ్రీ సరస్వతి శిశుమందిర్ విద్యాపీఠంలో ప్రత్యేక పోటీలు నిర్వహించారు.కల్వకుర్తి మున్సిపాలిటీ అధ్యక్షులు గన్నోజు బాబిదేవ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వక్తృత్వ, చిత్రలేఖనం పోటీలకు తేజస్విని ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వచ్చే 25 ఏళ్ల కాలంలో భారతదేశాన్ని ప్రపంచంలోనే అగ్రగామిగా (విశ్వగురువుగా) నిలబెట్టాలన్నదే మోడీ ప్రధాన సంకల్పమన్నారు.ఈ సుదూర లక్ష్యాన్ని చేరుకోవడానికి ప్రతి పౌరుడు మద్దతుగా నిలవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. విద్యార్థులు చిన్నతనం నుంచే దేశాభివృద్ధిపై అవగాహన పెంచుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ సేవకుల రాజు, కార్యదర్శి సాదు మురళీధర్ రెడ్డి, మున్సిపాలిటీ కన్వీనర్ నరేడ్ల శేఖర్ రెడ్డి, జిల్లా కార్యదర్శి గుర్రాల రాంభూపాల్ రెడ్డి పాల్గొన్నారు. వారితో పాటు పట్టణ ప్రధాన కార్యదర్శి పెద్దారి పర్వతాలు, కిసాన్ మోర్చా అధ్యక్షులు మోతే హుస్సేన్, బీజేవైఎం అధ్యక్షులు తోడేటి అరవీంద్ రెడ్డి, సోషల్ మీడియా కన్వీనర్ అంకియార్ సాయి,పాఠశాల సిబ్బంది మరియు పలువురు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# లింగ నిర్ధారణకు పాల్పడితే కఠిన చర్యలు

- పీ.సీ.పీ.ఎన్.డీ.టీ. చట్టం అమలుపై జిల్లా స్థాయి సమావేశం



**మేడ్చల్, సెప్టెంబర్ 29, నేటి శుభోదయ :** గర్భస్థ శిశువు లింగ నిర్ధారణ, లింగ ఎంపికకు తావులేకుండా పీ.సీ.పీ.ఎన్.డీ.టీ. చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అధికారులను ఆదేశించారు. జిల్లా స్థాయి మల్టీ మెంబర్ అప్రోప్రియేట్ అథారిటీ సమావేశం సీనియర్ సివిల్ జడ్జి జి.ఎస్.ఎల్. ప్రియాంక అధ్యక్షతన నిర్వహించారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డా. కె. ఆనంద్ కార్యదర్శిగా వ్యవహరించారు.సమావేశంలో పీ.సీ.పీ.ఎన్.డీ.టీ. చట్టం, నిబంధనల ప్రకారం 30 దరఖాస్తులను కమిటీ పరిశీలించింది. వీటిలో 18 కొత్తవి, 12 పునరుద్ధరణ దరఖాస్తులు కాగా, సంబంధిత రికార్డులు, నిబంధనలను పరిశీలించిన అనంతరం మొత్తం దరఖాస్తులకు కమిటీ ఆమోదం తెలిపింది.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ అల్ట్రాసౌండ్, ఇమేజింగ్ కేంద్రాల్లో వైద్య పరీక్షలు చట్టబద్ధమైన వైద్య అవసరాల మేరకే నిర్వహించాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘించే కేంద్రాలపై నిరంతర పర్యవేక్షణ చేపట్టి, చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.గర్భస్థ శిశువు లింగ నిర్ధారణ చట్టవిరుద్ధమనే విషయంపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని సీనియర్ సివిల్ జడ్జి జి.ఎస్.ఎల్. ప్రియాంక సూచించారు. ఆడపిల్లల భ్రూణహత్యలను అరికట్టి, బాలికలకు సమాన అవకాశాలు కల్పించడం ద్వారా లింగ సమానత్వాన్ని ప్రోత్సహించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు.సమావేశంలో పీ.సీ.పీ.ఎన్.డీ.టీ. నోడల్ అధికారి డా. గీతా ప్రసాద్, సైబరాబాద్ మహిళలు, బాలల భద్రత విభాగం ఏసీపీ కృష్ణ ప్రసాద్, మేడ్చల్ ఎస్‌హెచ్‌ఓ నరసింహారెడ్డి, కార్పె డియమ్ ఫౌండేషన్ ప్రతినిధి బి. కుమార్ కృపా, డిప్యూటీ జిల్లా ఎక్స్‌టెన్షన్ మీడియా అధికారి వసంత కుమారి తదితరులు పాల్గొన్నారు.

# కేటీఆర్ వ్యాఖ్యలు వాస్తవం కాదు - ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

- బహదూర్‌గూడ రైతుల సమస్యను పరిష్కరించే బాధ్యత నాదే: ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్
- 600 ఎకరాలకు పట్టా పాస్‌పుస్తకాలు 100 శాతం ఇప్పిస్తా
- గత ప్రభుత్వ హయాంలోనే సమస్యను పలుమార్లు ప్రభుత్వం దృష్టికి తీసు కెళ్ళిన ఫలితం లేదు
- ఎకరాకి 500 గజాలు కాదు, 600 గజాలకు ముఖ్యమంత్రిని ఒప్పిస్తా



**శంషాబాద్, సెప్టెంబర్ 29, నేటి శుభోదయ :** బహదూర్‌గూడ రైతుల సమస్యను పరిష్కరించి వారికి న్యాయం జరిగేలా చూడటంతో పాటు సుమారు 600 ఎకరాలకు పట్టా పాస్‌పుస్తకాలు ఇప్పించే బాధ్యత తనదేనని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి. ప్రకాశ్‌గౌడ్ తెలిపారు. బహదూర్‌గూడ రైతుల సమస్యలపై మాజీ మంత్రి కేటీఆర్ చేసిన వ్యాఖ్యలు వాస్తవం కాదని ఆయన పేర్కొన్నారు. బహదూర్‌గూడలో రైతుల భూములకు సంబంధించిన సమస్యలు ఉన్నది వాస్తవమేనని, అయితే ఈ సమస్యను గత 15–18 సంవత్సరాలుగా వివిధ ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్తూ పరిష్కారం కోసం నిరంతరం ప్రయత్నిస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. గతంలో ముఖ్యమంత్రి కేసీఆర్, అప్పటి మంత్రి కేటీఆర్ దృష్టికి కూడా ఈ సమస్యను పలుమార్లు తీసుకెళ్లామని, అప్పటి ప్రభుత్వం అధికారులతో సర్వే కూడా చేయించిందని ఆయన పేర్కొన్నారు. బహదూర్‌గూడ రైతుల సమస్య మా దృష్టికి రాలేదని కేటీఆర్ చెప్పడం సరికాదు. గత ప్రభుత్వం పదేళ్లు అధికారంలో ఉన్న సమయంలో రైతుల సమస్యను ఎందుకు పరిష్కరించలేదో ప్రజలు ఆలోచించాలి. ఇప్పుడు మరో ఏడాది తర్వాత అధికారంలోకి వచ్చి న్యాయం చేస్తామని చెప్పడం కంటే, అప్పట్లోనే రైతులకు న్యాయం చేసి ఉండాల్సింది అని ప్రకాశ్‌గౌడ్ వ్యాఖ్యానించారు. రైతులు గతంలో మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి వద్ద కూడా ధర్నాలు నిర్వహించారని, ఆ సమయంలో వారికి ఎలాంటి పరిష్కారం చూపించారో కేటీఆర్ చెప్పాలని ఎమ్మెల్యే ప్రశ్నించారు. గత ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో అధికారులు బహదూర్‌గూడ భూములపై సర్వే నిర్వహించిన విషయం కేటీఆర్‌కు కూడా తెలుసని ఆయన అన్నారు. ప్రస్తుతం బహదూర్‌గూడలో సుమారు 350 మంది రైతులు ఉన్నారని, అయితే కేటీఆర్‌ను కలిసిన వారిలో వాస్తవంగా ఎంతమంది రైతులు ఉన్నారో ప్రజలు గమనించాలని ఎమ్మెల్యే సూచించారు. రైతుల సమస్యను రాజకీయంగా ఉపయోగించుకోవడం సరికాదని, తనపై చేసిన ఆరోపణలు నిజం కాదని ప్రజలు గుర్తించాలని కోరారు.

**600 గజాల స్థలం కోసం సీఎంను ఒప్పిస్తా**

బహదూర్‌గూడలో నష్టపోయిన రైతులకు ప్రభుత్వం 500 గజాల స్థలం ఇస్తామని చెప్పిందని ఎమ్మెల్యే తెలిపారు. అయితే రైతులకు మరింత ప్రయోజనం కలిగేలా 600 గజాల స్థలం ఇవ్వాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని స్వయంగా కలిసి ఒప్పించేందుకు ప్రయత్నిస్తానని హామీ ఇచ్చారు. రైతులకు న్యాయం చేయాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సానుకూలంగా స్పందించారని, ప్రభుత్వం తరఫున సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. బహదూర్‌గూడ రైతులకు 100 శాతం పట్టా పాస్‌పుస్తకాలు ఇప్పించేందుకు తన వంతు పూర్తి బాధ్యత తీసుకుంటానని స్పష్టం చేశారు. రైతుల సమస్యల పరిష్కారంలో రాజకీయాలకు తావు లేకుండా ప్రభుత్వం, అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే అన్నారు. గత ప్రభుత్వ హయాంలో రైతులకు ఎదురైన సమస్యలను పరిష్కరించేందుకు ప్రస్తుత ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నార్సింగి మార్కెట్ కమిటీ డైరెక్టర్ అనే గౌడ్ శ్రీకాంత్ గౌడ్, సీనియర్ నాయకుడు చంద్రారెడ్డి, యాటకారి సిద్దేశ్వర్ ముదిరాజ్, బోటి గూడ సర్పంచ్ బిక్షపతి, మాజీ జెడ్పిటిసి నీరటి రాజు తదితరులు ఉన్నారు.

నేటి శుభోదయ
ప్రతి క్షణం - ప్రజల కోసం
తెలుగు దినపత్రిక
బుధవారం | హైదరాబాద్
30 - 09 - 2026
www.netisubhodaya.com



## నక్ష బాటలకు శాశ్వత పరిష్కారం చూపాలి: ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

- అభివృద్ధి పనులపై సమగ్ర సమీక్ష.. కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ..
- వేములనర్వలో మహిళా సమైక్య భవనం ప్రారంభం

**కేశంపేట, సెప్టెంబర్ 29, నేటి శుభోదయ :** మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం మండల స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ముఖ్య అతిథిగా హాజరై మండలంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులు, సంక్షేమ కార్యక్రమాల అమలుపై అధికారులతో సమగ్రంగా సమీక్షించారు. గ్రామాల్లో ఏళ్ల తరబడి పరిష్కారం కాని బాట సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని అధికారులను ఆదేశించారు.రైతులు తమ పొలాలకు వెళ్లేందుకు, గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల రాకపోకలకు ఉపయోగపడే మార్గాలను ప్రత్యేకంగా గుర్తించాలని ఎమ్మెల్యే సూచించారు. నక్ష బాటలను గుర్తించి, వాటి వివరాలను పరిశీలించి, ఆక్రమణలకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. అవసరమైన చోట నక్ష బాటలను పునరుద్ధరించి



ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలులో శాఖల మధ్య సమన్వయం పెంచి ప్రజలకు ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు పూర్తిస్థాయిలో అందేలా అధికారులు పనిచేయాలని సూచించారు.అనంతరం అర్హులైన లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పంపిణీ చేశారు. పేద కుటుంబాలకు ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం వేముల నర్వ గ్రామంలో మహిళా సమైక్య భవనాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. మహిళల ఆర్థిక స్వావలంబన, సామాజిక



అభివృద్ధికి మహిళా సమైక్య సంఘాలు మరింత చురుగ్గా పనిచేయాలని అన్నారు.ఈ సమావేశంలో మండల అధ్యక్షుడు రమేష్, కేశంపేట మాజీ జెడ్పిటిసి విశాల శ్రావణ్ రెడ్డి, పిఎసిఎస్ చైర్మన్ శ్రీధర్ రెడ్డి, మహిళా అధ్యక్షురాలు గుండె రాణి, సర్పంచులు కవితా కరుణాకార్ రెడ్డి, హైమావతి జగదీష్,నాగేష్, సురేష్ రెడ్డి, భాస్కర్ గౌడ్, చెప్లి భాస్కర్, సుజాత హనుమంతు నాయక్, స్వప్న భూపాల్ రెడ్డి, బొజ్జం సంతోష శ్రీశైలం, నరేందర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల మాజీ అధ్యక్షుడు వీరేష్, తహసిల్దార్ రాజేందర్ రెడ్డి, ఎంపీడీవో రవిచంద్ర కుమార్ రెడ్డి,కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ





**పినపాక, సెప్టెంబర్ 29, నేటి శుభోదయ :** పినపాక మండలంలోని ఈ.బయ్యారం క్రాస్ రోడ్ లోని జీవీఆర్ ఫంక్షన్ హాల్ లో కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమం ఘనంగా జరిగింది.ఈ కార్యక్రమానికి పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా హాజరై 28 మంది లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద కుటుంబాలకు కళ్యాణ లక్ష్మి , షాదీ ముబారక్ పథకాలు ఆర్థికంగా ఎంతో భరోసా కల్పిస్తున్నాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తూ అన్ని వర్గాల అభివృద్ధికి కృషి చేస్తోందని, పినపాక నియోజకవర్గ అభివృద్ధికి తాను నిరంతరం కృషి చేస్తానని ఎమ్మెల్యే పాయం తెలిపారు.చెక్కులు అందుకున్న లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేస్తూ ప్రభుత్వానికి, ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు, అధికారులు, లబ్ధిదారులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## రైతులకు రాష్ట్ర ప్రభుత్వం మోసపూరిత హామీలిచ్చింది....

- కాంగ్రెస్,బీఆర్ఎస్ రెండూ ఒకటే..
- అన్ని వర్గాలను విస్మరించాయి..
- అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ..
- అర్బన్ కు చేరుకున్న బిజెపి కిసాన్ మోర్చా సైకిల్ ర్యాలీ...

**నిజామాబాద్, సెప్టెంబర్ 29, నేటి శుభోదయ :** కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు రైతులకు మోసపూరిత హామీలు ఇచ్చి అధికారులు పై వచ్చిందని అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ తెలిపారు. రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ బిజెపి కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో చేపట్టిన సైకిల్ యాత్ర మంగళవారం నిజామాబాద్ అర్బన్ కు చేరుకుంది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వరంగల్ డిక్లరేషన్ లో రాహుల్ గాంధీ సాక్షిగా రైతులకు అనేక హామీలు ఇచ్చి ఒకటి నెరవేర్చలేదని మండిపడ్డారు.రెండు లక్షల రుణమాఫీ,ఇందిరమ్మ రైతు భరోసా,భూమి లేని రైతు కూలీలకు 12 వేల ఆర్థిక సాయం,రైతు పండించిన ప్రతి పంటను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని,వరి క్వింటాలుకు 500 బోనస్ ఇస్తామని చెప్పి విస్మరించిందన్నారు.కేవలం రైతులనే కాకుండా మహిళలకు,యువతీ యువకులకు ఇచ్చిన హామీలు కూడా నెరవేర్చకుండా కాలయాపన చేస్తుందన్నారు.ఎల్ నినో ప్రభావం రాష్ట్రం పై తీవ్రంగా ఉంటుందని కేంద్ర ప్రభుత్వం హెచ్చరించిన పట్టించుకోలేదన్నారు. సమయం దాటిన తర్వాత ప్రత్యామ్నాయ పంటలు వేసుకోవాలని చెప్పడం విడ్డూరమన్నారు.అప్పటికే రైతులు వరి వేసుకున్నారని గుర్తు చేశారు.ఫ్యూచర్ సిటీ,మూసి ప్రక్షాళన అంటూ లక్షల కోట్లు ఖర్చు పెడుతున్నారు కానీ రైతులను మాత్రం పట్టించుకోవడం లేదన్నారు.గతంలో బీఆర్ఎస్ వ్యవహరించిన మాదిరిగానే కాంగ్రెస్ వ్యవహరిస్తుందన్నారు.కేంద్ర ప్రభుత్వం అన్ని పథకాల్లో తన వాటా ఇచ్చిన రాష్ట్ర ప్రభుత్వం మాత్రం తామే చేస్తున్నట్లు ప్రచారం చేయడం సిగ్గుచేటు అన్నారు.కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలో బోధన్ నుంచి జగిత్యాల వరకు 320 కిలోమీటర్ల సైకిల్ ర్యాలీ చేపట్టడం అభినందనీయమని చెప్పారు. కార్యక్రమంలో కిసాన్ మోర్చా జిల్లా





అధ్యక్షుడు తిరుపతిరెడ్డి,హరీష్ రెడ్డి,సుగంధం హరీష్,పద్మా రెడ్డి, కార్పొరేటర్లు నాగోల్ల లక్ష్మీ నారాయణ,బంటు రాము,మల్కాయి మహేందర్, ప్రసూన శ్రీనివాస్ రెడ్డి,బొబ్బిలి సువర్ణ వేణుగోపాల్,ఓబీసీ మోర్చరాష్ట్ర ప్రతినిధి స్వామి యాదవ్,మహిళా మోర్చ జిల్లా అధ్యక్షురాలు వనిత,మైనార్టీ మోర్చా అధ్యక్షుడు జస్పాల్ సింగ్,యువ మోర్చ రాష్ట్ర సహా కోశాధికారి విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలి

- దామర్లపల్లి సర్పంచ్ పొన్న చైతన్య కృష్ణారెడ్డి



**షాబాద్, సెప్టెంబర్ 29, నేటి శుభోదయ :** వర్షపు నీటిని ఒడిసిపట్టి భూగర్భ జలాలను పెంపొందించేందుకు ప్రతి ఇంటి వద్ద ఇంకుడు గుంతలు, రైతులు పంట పొలాల్లో పంట కుంటలు ఏర్పాటు చేసుకోవాలని దామర్లపల్లి సర్పంచ్ పొన్న చైతన్య కృష్ణారెడ్డి సూచించారు.దామర్లపల్లి గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో వీబీజీ–రామ్‌జీ పనులపై గ్రామసభ నిర్వహించారు. ఫారం పాండ్స్, సోక్‌పిట్స్, మల్లప్ప చెరువులో సిల్ట్ తొలగింపు తదితర పనులను గుర్తించారు. నీటి సంరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని సర్పంచ్ కోరారు.

## ఒకే లైసెన్స్‌తో మూడు గ్రామాల్లో కల్లు దందా

- దామర్లపల్లి పేరుతో లైసెన్స్ పెదవేడు, నాందార్ఖాన్‌పేట్, లింగారెడ్డిగూడలో దుకాణాల నిర్వహణపై ఆరోపణలు
- ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదంటున్న పీఏసీఎస్ డైరెక్టర్ దేవేందర్‌రెడ్డి

**షాబాద్, సెప్టెంబర్ 29, నేటి శుభోదయ :** షాబాద్ మండలంలో ఒక గ్రామపంచాయతీ పేరుతో మంజూరైన కల్లు దుకాణం లైసెన్స్‌ను ఆధారంగా చేసుకుని ఇతర గ్రామాల్లో నిబంధనలకు విరుద్ధంగా కల్లు దుకాణాలు, కాంపౌండ్లు నిర్వహిస్తున్నారనే ఆరోపణలు వెలువడుతున్నాయి. దామర్లపల్లి గ్రామపంచాయతీ పేరుతో పొందిన లైసెన్స్‌తో పెదవేడు, నాందార్ఖాన్‌పేట్, లింగారెడ్డిగూడ గ్రామాల్లో కల్లు దుకాణాలు నిర్వహిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.ఈ వ్యవహారంపై పెదవేడు గ్రామస్తులతో పాటు పీఏసీఎస్ డైరెక్టర్ దేవేందర్‌రెడ్డి సెప్టెంబర్ 21న ప్రజావాణి కార్యక్రమంలో సంబంధిత అధికారులకు రాతపూర్వకంగా ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. అయితే ఫిర్యాదు చేసి రోజులు గడుస్తున్నా ఎక్సైజ్ అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టకపోవడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

**ఎక్సైజ్ శాఖ జవాబుదారీతనం ఏది?**

ఒకే లైసెన్స్ ఆధారంగా వేర్వేరు గ్రామాల్లో దుకాణాలు నిర్వహించేందుకు నిబంధనలు అనుమతిస్తాయా? లైసెన్స్ ఏ గ్రామానికి, ఏ ప్రదేశానికి మంజూరైందో పరిశీలించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని దేవేందర్‌రెడ్డి పేర్కొన్నారు. ఫిర్యాదు చేసినప్పటికీ అధికారులు స్పందించకపోవడం పట్ల ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు.ఇప్పటికైనా ఎక్సైజ్ ఉన్నతాధికారులు స్పందించి క్షేత్రస్థాయిలో సమగ్ర విచారణ చేపట్టి, లైసెన్స్ నిబంధనలు ఉల్లంఘించినట్లు తేలితే





Citizen Copy

GOVERNMENT OF TELANGANA

Rangareddy District Prajavani Acknowledgment

| | | | |
|---|---|---|---|
| Grievance ID: | DRANG21092600015 | Grievance Date: | 21-SEP-2026 |
| Citizen Name: | Devender reddy and villag | Mobile No.: | 9848303558 |
| Gist of Grievance: | take necessary action toddy shops | | |

Your Grievance has been forwarded to the **Prohibition & Excise Inspector Office - Shabad** for resolution. Kindly note the Grievance ID for further reference.

This is a system-generated receipt. No signature required

*"You can track the status using the above grievance ID on the Prajavani portal (prajavani.cgg.gov.in)."*

అక్రమంగా నిర్వహిస్తున్న దుకాణాలను మూసివేసి, బాధ్యులపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని దేవేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు.

## గుర్రంపోడు 'వెలుగు'ఆఫీసులో అధికారుల బాధ్యతారాహిత్యం

**– రూ.3.90 లక్షలు నష్టపోయిన వీఏవోలు!**




**గుర్రంపోడు , సెప్టెంబర్ 29, నేటి శుభోదయ :** గుర్రంపోడు మండల మహిళా సమైక్య (వెలుగు) కార్యాలయంలో అధికారుల నిర్లక్ష్యం పరాకాష్టకు చేరింది. ఏపీఎం ,సీసీల బాధ్యతారాహిత్యం కారణంగా తాము రూ. 3.90 లక్షల మేర నష్టపోయామని గ్రామ సంఘాల సహాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారుల తీరుకు నిరసనగా వెలుగు కార్యాలయం ఎదుట వీఓఏలు చేపట్టిన ధర్నా మంగళవారానికి 20వ రోజుకు చేరుకుంది.తమకు రావాల్సిన బకాయి జీతాలు, బకాయిలు పూర్తిస్థాయిలో చెల్లించే వరకు వెనక్కి తగ్గేది లేదని, ఎంతవరకైనా పోరాడతామని సంఘం నాయకులు స్పష్టం చేశారు.మండల సమాఖ్యలో జరుగుతున్న అక్రమాలు, అధికారుల నిర్లక్ష్యంపై ఉన్నతాధికారులు స్పందించి తక్షణమే విచారణ జరిపి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.ఈ నిరసన కార్యక్రమంలో వీఏవో ల సంఘం మండల అధ్యక్షురాలు సైదమ్మ, కార్యదర్శి లక్ష్మి , కోశాధికారి యాదయ్యతో పాటు పుష్ప,విమల, యాదమ్మ, సునీత,వెంకటమ్మ, రజిత,నాగమణి,రుద్రతేజ తదితరులు పాల్గొన్నారు.

Printed Published and Owned by Gongura Srinivas Rao, Printed at M R Publications, # 6-3-1880, Vanasthalipuram, Ranga Reddy (Dist), Telangana 500070. at H.No 8-7-12/671, Sai Colony, Madhuban Colony, Rajendranagar, Ranga Reddy District, Telangana-500077, Editor: Gongura Srinivas Rao, RNI Title Code :- RNI TELTEL/2024/89620